

'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 15 | సంచిక: 344

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | VIJAYAWADA | BANGALORE | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 27-8-2023



ప్రణయ్.. కాంస్యంతో సరి

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ స్టార్ ప్లేయర్ ప్రణయ్.. కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో 21-18, 13-21, 14-21తో కున్లావుత్ చేతిలో ఓటమిపాలయ్యాడు.

- వివరాలు 12లో



తగ్గేదే లే.. ఆపేదేలే.. అనుకున్నా

'నన్ను నేను సరిదిద్దుకున్నా.. ఇక నుంచి తగ్గేదే లే.. ఆపేదేలే అనుకున్నాను' అంటున్న జాతీయ ఉత్తమ నటుడు అల్లు అర్జున్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ.

- వివరాలు 12లో



తోటి విద్యార్థులతో కొట్టించి..

యూపీలో ఓ టీచర్ బాలుడిని పిల్లలందరితో కొట్టించడంతో పాటు మత విద్వేష వ్యాఖ్యలు చేయడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది.


వివరాలు 6లో ▸



ఆ 3 రోజులు 'ఢిల్లీ'కి సెలవు..

'జీ-20' దృష్ట్యా సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో ఢిల్లీలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవులివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 6లో ▸



2న ఆదిత్య-ఎల్1 ప్రయోగం!

సౌర వాతావరణం అధ్యయనం కోసం ఇస్రో వచ్చే నెల 2న ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగించడానికి సన్నాహాలు చేస్తోంది.

వివరాలు 6లో ▸



నింగిలోకి వ్యోమగాములు..

అమెరికా, డెన్మార్క్, జపాన్, రష్యాకు చెందిన నలుగురు వ్యోమగాములతో స్పేస్ ఎక్స్ రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్

'యాంత్రిక' రాతలు పనిచేయవు రామోజీ..

- చంద్రబాబు హయాంలో ఉన్నట్లే అవినీతి ఉందన్న భ్రమల్లో ఈనాడు
- రాష్ట్రంలో వ్యవసాయ యంత్ర పరికరాల సరఫరాపై అసత్య కథనం
- బాబు హయాంలో కమీషన్ల కోసమే రైతు రథాలు, యంత్ర పరికరాలు
- కమిటీల ప్రమేయం లేకుండా సబ్సిడీ చెల్లింపు.. ట్రాక్టర్లు రైతులకు ఇవ్వకుండా సబ్సిడీ స్వాహా
- రైతులకు తక్కువ అద్దెకు పరికరాలు ఇవ్వాలన్నది సీఎం జగన్ సంకల్పం
- అందుకే వైఎస్సార్ యంత్ర సేవా పథకం.. పార్టీ, కులంతో పనిలేకుండా అర్హులైన రైతులతో కమిటీలు
- రైతు కమిటీల ఖాతాలకే సబ్సిడీ జమ.. సబ్సిడీ రూ.366.25 కోట్లు భరించిన ప్రభుత్వం
- వ్యవసాయ సలహా మండళ్లలో పరికరాల అద్దె నిర్ణయం
- ఆర్బీకేల్లో పరికరాల అద్దెల ప్రదర్శన
- 15 రోజుల ముందుగా బుక్ చేసుకునేలా యాప్.. ఇప్పటివరకు 3.3 లక్షల మంది రైతులకు సేవలు
- రుణం తీరే వరకు బ్యాంకుల తనఖాలో ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు
- అలాంటప్పుడు అమ్ముకునే అవకాశం ఎక్కడుంటుంది రామోజీ

10లో

'ఫ్యామిలీ డాక్టర్'తో పల్లెకు రక్ష



నూతన విధానంతో గ్రామీణులకు తగ్గిన వ్యయ, ప్రయాసలు

సొంత ఊరిలోనే ప్రాథమిక వైద్య సేవలు

- మంచానికి పరిమితమైన వారి ఇళ్ల వద్దకే వైద్యుడు
- క్రమం తప్పని విజిట్స్‌తో కుటుంబ సభ్యులకు పెద్ద ఊరట
- ఊళ్లోనే 14 రకాల వైద్య పరీక్షలు
- అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూల్ విద్యార్థుల ఆరోగ్యంపై కూడా వాకబు
- ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 2.10 కోట్ల సేవలు నమోదు
- గ్రామ స్థాయిలో వైద్యంపై ప్రముఖుల ప్రశంసలు
- మరోవైపు విలేజ్ క్లినిక్‌లతో గ్రామీణుల ఆరోగ్యానికి కొండంత భరోసా.. అన్ని విలేజ్ క్లినిక్స్‌లో 105 రకాల మందులు..
- స్పెషాలిటీ వైద్యులతో టెలీకన్సల్టెన్సీ సదుపాయం


గుంటూరు జిల్లా కాకుమానులో వృద్ధుడు నాగేశ్వరరావును ఇంటి వద్దే పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

(పమిడివారిపాలెం, పెదపాలెం, కాకుమాను గ్రామాల నుంచి సాక్షి ప్రతినిధి వడ్డే బాలశేఖర్):

'ఏం తాత.. ఆరోగ్యం ఎలా ఉంది? మందు బిళ్లలు సమయానికి వేసుకుంటున్నావా?' అని డాక్టర్ అడిగితే.. 'ఆరోగ్యం బాగానే ఉంది' అనేలా రెండు చేతులు కదిలిస్తూ సైగల ద్వారా ఆరి నాగేశ్వరరావు సమాధానం ఇచ్చారు. ఇంతలో పక్కనే ఉన్న నాగేశ్వరరావు భార్య విమల మాట్లాడుతూ.. 'మీరు చెప్పినట్టే మాత్రలు సమయానికి వేస్తున్నాం. రోజులో 3 సార్లు పడుకునే స్థితి (పొజిషన్)లో మార్పులు చేస్తున్నాం' అని వివరించింది.

గుంటూరు జిల్లా కాకుమానుకు చెందిన వృద్ధుడు నాగేశ్వరరావు రెండేళ్లుగా ఆర్థో, న్యూరో సంబంధిత సమస్యలతో బాధ పడుతున్నాడు. వీటికి తోడు బీపీ సమస్య కూడా ఉంది. వయోభారం, అనారోగ్య సమస్యల రీత్యా మంచానికి పరిమితం అయ్యాడు. దీంతో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకోవడం కోసం వైద్యుడి వద్దకు నాగేశ్వరరావు వెళ్లాలంటే ఈ కుటుంబానికి ఎంతో కష్టంతో కూడుకున్న పని. ఇంటికి

మిగతా 2వ పేజీలో ▸

బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ సెంటర్‌లో శాస్త్రవేత్తలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో ఇస్రో చైర్మన్ సోమనాథ్ తదితరులు



'శివశక్తి'గా పిలుచుకుందాం

- చంద్రుడిపై ల్యాండర్ దిగిన ప్రాంతానికి నామకరణం చేసిన ప్రధాని మోదీ
- ఆగస్టు 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా పాటిద్దామని పిలుపు
- బెంగళూరులో ఇస్రో శాస్త్రవేత్తలను కలిసి అభినందించిన ప్రధాని
- 'మీ అంకితభావం, నిబద్ధత, తెగువకు నా సెల్యూట్' అంటూ ప్రశంసలు

" విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతాన్ని 'శివశక్తి'గా, 2019లో చంద్రయాన్-2 చంద్రునిపై కూలిన ప్రదేశాన్ని తిరంగా పాయింట్‌గా పిలుచుకుందాం. శివశక్తిలోని శివ్.. మానవత్వం శ్రేయస్సుకు ప్రతీక. శక్తి.. మానవాళి సంక్షేమ ఆకాంక్షలకు తగిన ధైర్యాన్ని, స్థైర్యాన్ని అందిస్తుంది. అందుకే ఆ ప్రాంతానికి శివశక్తిగా నామకరణం చేశా. జై విజ్ఞాన్... జై అనుసంధాన్.. - ప్రధాని మోదీ

6లో

సజావుగా 'ప్రజ్ఞాన్' ప్రయాణం

చంద్రుడిపై ప్రజ్ఞాన్ రోవర్ సజావుగా ముందుకు సాగుతోందని ఇస్రో ప్రకటించింది. వీడియో, ఫొటోలను తన వెబ్‌సైట్‌లో ఉంచింది. చంద్రుడి ఉపరితలంపై సేకరించిన సమాచారాన్ని రోవర్ భూమికి చేరవేస్తోంది. రోవర్ ఇప్పటికే చంద్రుడిపై నీటి జాడను కనుగొన్నట్లు వార్తలొచ్చాయి. కానీ ఇస్రో ధ్రువీకరించలేదు. - వివరాలు 6లో ▸

పీజీ సెట్స్ కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ ఖరారు

- ఐసెట్, పీజీసెట్, పీఈసెట్, లాసెట్, ఎడ్‌సెట్‌లలో ప్రవేశాలు
- సెప్టెంబర్ 6 నుంచి ప్రక్రియ ప్రారంభం

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యా కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ ఖరారైంది. సెప్టెంబర్ మొదటి వారంలో ప్రవేశాలు ప్రారంభించనున్నట్టు ఏపీ ఉన్నత విద్యామండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 6న ఐసెట్, 11న ఎంఏ, ఎంకామ్ కోర్సులకు సంబంధించిన పీజీసెట్, 17న పీఈసెట్(బీపీఈడీ/డీపీఈటీ), 26న లాసెట్, 30న ఎడ్‌సెట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కాగా, ఈ నెల 10 నుంచి పీజీఈసెట్, 26 నుంచి ఏపీ ఈఏపీసెట్‌లో బి కేటగిరీ సీట్ల కౌన్సెలింగ్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

నీ జీవితమంతా అబద్ధాలే

నాడు నీ ఇంటి పక్కనే, కళ్లెదుటే ఇసుక దోపిడీ

చంద్రబాబు ఇసుక ప్రజెంటేషన్‌పై నిప్పులు చెరిగిన మంత్రి పెద్దిరెడ్డి

- అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కదోవ పట్టించేందుకే ఆరోపణలు
- ఉచిత విధానంలో నాడు ఇసుక ఎవరికి ఉచితంగా ఇచ్చావు?
- నాడు కరకట్టపై తవ్వుతుంటే కళ్లు మూసుకున్నావు
- ఉచితమంటూ ఊదరగొట్టేసి ఎల్లో గ్యాంగ్ లూటీ
- అడ్డుకున్న మహిళా తహసీల్దార్‌ను జుట్టు పట్టి ఈడ్చేసిన చింతమనేని
- మీ నిర్వాకంతో రూ.100 కోట్లు జరిమానా విధించిన ఎన్జీటీ
- టీడీపీ పెద్దల జేబులోకి రూ.వేల కోట్ల ఆదాయం



- కొత్త పాలసీతో దందాకు తెర దించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఏ రీచ్‌లో అయినా పర్యావరణ అనుమతుల మేరకే తవ్వకాలు
- ప్రభుత్వానికి ఏటా రూ.765 కోట్ల ఆదాయం.. కొరత లేకుండా సరఫరా

- వివరాలు 3లో ▸

మదురై రైలులో మంటలు



- 9 మంది మృతి, 20 మందికి గాయాలు
- ప్రైవేట్ కోచ్‌లో గ్యాస్ స్టౌపై టీ కాచేందుకు యత్నం..
- సిలిండర్ పేలి ప్రమాదం

6లో

స్థానికంగానే టీచర్ల మెడికల్ బిల్లుల డేటా పరిశీలన

- బిల్లులు, ఇతర సమాచారమంతా డీడీవోల లాగిన్‌లోనే ఉంటాయి
- కమిషనరేట్‌కు వచ్చి ఇబ్బంది పడొద్దు
- పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్ సూచన

- వివరాలు 2లో ▸


ఇదం జగత్



మూలధన వ్యయంలో ఏపీ టాప్

4 నెలల్లోనే బడ్జెట్ కేటాయింపుల్లో 47.79 శాతం వ్యయం

- ఇదే సమయంలో కేరళలో 28.19%
- ఏపీలో ఏప్రిల్ నుంచి జూలై వరకు రూ.14,844.99 కోట్లు వ్యయం
- మూల ధన వ్యయంపై కాగ్ గణాంకాల నివేదికలో స్పష్టీకరణ
- తొలి త్రైమాసికం మూల ధన వ్యయాలపై ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక



3లో

- 3 నెలల్లోనే ఏపీ 40.8 శాతం వ్యయం
- ఇదే సమయంలో కేంద్రం మూల ధన వ్యయం 27.8 శాతమే
- ఏపీ దరిదాపుల్లో లేని మిగతా రాష్ట్రాలు

క్లుప్తంగా...

100 జీఈఆర్‌ను నిజాయితీగా సాధించాలి



ప్రవీణ్ ప్రకాశ్ సమక్షంలో జీఈఆర్ బ్యాడ్జిని చూపిస్తున్న బనగానపల్లి వలంటీర్లు

సాక్షి, అమరావతి: నంద్యాల జిల్లా బనగానపల్లి గ్రామ సచివాలయం పరిధిలో వలంటీర్లు 100% విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్) సాధించారని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. నంద్యాల జిల్లాలో శనివారం పర్యటించిన ఆయన పలు పాఠశాలల పనితీరును పరిశీలించారు. బనగానపల్లిలోని వలంటీర్లు తమ పరిధిలోని గృహాల్లో బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో నమోదు చేయించారు. దీంతో ఈ వలంటీర్లకు యాప్ ద్వారా బ్యాడ్జి వచ్చింది. వీరు తమ పరిధిలో ఒకటికి రెండుసార్లు డేటాను పరిశీలించి.. 'నా సర్వే సరైంది.. ఇది నా చాలెంజ్.. మిషన్ జీఈఆర్ 100 శాతం ఆంధ్రా' అనే క్యాప్షన్‌తో బ్యాడ్జి స్క్రీన్‌షాట్‌ను వారి వాట్సాప్ స్టేటస్‌లో ఉంచారు. వీరి సవాలును స్వీకరించిన మిగతా 60 వేల మంది వలంటీర్లు కూడా తమ పరిధిలోని డేటాను మరోసారి తనిఖీ చేసి, వాట్సాప్ స్టేటస్ పెట్టాలని ప్రవీణ్ ప్రకాశ్ సూచించారు. నూరు శాతం జీఈఆర్‌ను నిజాయితీ, నిబద్ధతతో సాధించాలన్నారు.

ఏయూలో రూ.3 కోట్లతో ఇండస్ట్రీ 4.ఓ సెంటర్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇండస్ట్రీ 4.ఓ కేంద్రం త్వరలో ఏర్పాటు కానుంది. భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల మంత్రిత్వశాఖకు అనుబంధంగా పనిచేసే సమర్థ్ ఉద్యోగ్ టెక్నాలజీ ఫోరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సదాశివ్ పాధ, ఆపరేషన్స్ విభాగాధిపతి రాజేష్ పహాడిలు ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని శనివారం సందర్శించారు. ఏయూలో ఇండస్ట్రీ 4.ఓ కేంద్రం ఏర్పాటుకు అనువైన ప్రాంతం, భవనాలు తదితర అంశాలను పరిశీలించారు. పలు స్టార్టప్ సంస్థల పనితీరు పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడారు. పాలక మండలి సమావేశ మందిరంలో ఫోరం ప్రతినిధులు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. త్వరలో కేంద్ర మంత్రిత్వశాఖ అనుమతితో ఏయూలో సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఏయూ ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ హనుమంతు పురుషోత్తం ఏయూలో రూ.3 కోట్లతో ఇండస్ట్రీ 4.ఓ ఏర్పాటుకు అవసరమైన ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తీర్చిదిద్దారు.

చరిత్రలో తొలిసారి నాయీ బ్రాహ్మణులకు టీటీడీ బోర్డులో చోటు

- టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న యానాదయ్య

కడప కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌కి నాయీ బ్రాహ్మణులు ఆజన్మాంతం రుణపడి ఉంటారని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యుడు సిద్దవటం యానాదయ్య అన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక హెడ్‌పోస్టాఫీసు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. యానాదయ్య మాట్లాడుతూ దేశ చరిత్రలో తొలిసారిగా టీటీడీ పాలక మండలిలో నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కడపలో ఆప్కాబ్ శిక్షణ కేంద్రం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) కడపలో కో–ఆపరేటివ్ ట్రైనింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తోంది. సహకార బ్యాంకుల ఉద్యోగులకు శిక్షణ కోసం 2.18 ఎకరాల్లో ఈ కేంద్రాన్ని నిర్మించనుంది. శిక్షణ కోసం అకడమిక్ భవనంతోపాటు ఉద్యోగులు ఉండేందుకు హాస్టల్ భవనాన్ని సిద్ధం చేయనుంది. ఇందుకోసం రూ.17.10 కోట్లతో నిర్మాణ పనులకు ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. ఆసక్తిగల సంస్థలు సెప్టెంబర్ 7లోపు బిడ్లు దాఖలు చేయాలని కోరింది. ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలను అందించడం కోసం కడపలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు ఆప్కాబ్ ఎండీ ఆర్‌ఎస్ రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

'ఇంటింటికీ ఇంటర్నెట్'

లక్డీకాపూల్ (హైదరాబాద్)/కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌లోని ఇంటింటికీ ఇంటర్నెట్ సర్వీసు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఏపీ ఫైబర్‌నెట్(ఏపీఎస్‌ఎఫ్‌ఎల్) చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సీఎస్సీ గ్రూప్ ఆధ్వర్యాన శనివారం 'సీఎస్సీ ఎక్స్‌పో–2023' ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఇందులో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. అలాగే కర్నూలు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన బీబీఎన్‌ఎల్ కేబుల్ వ్యవస్థను పి.గౌతమ్‌రెడ్డి శనివారం ప్రారంభించారు.

100 శాతం జీఈఆర్.. తొలి మండలంగా తెనాలి అర్బన్



తెనాలిలోని పినపాడు మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాల



■ ఈ చిత్రంలోని బాలుడి పేరు.. ఆదిముళ్ల నాగచైతన్య. గుంటూరు జిల్లా తెనాలి ఇందిరానగర్ కాలనీలో ఇతడి కుటుంబం ఉంటోంది. ఇంటికి కొంచెం దూరంలోనే ఉన్న మున్సిపల్ హైస్కూలులో ఐదో తరగతి చదువుతూ మధ్యలో మానేశాడు. చదువుపై ఆసక్తి లేదని చెప్పడంతో తల్లిదండ్రులూ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో స్థానిక సచివాలయం నుంచి ఒక విద్యా కార్యదర్శి వచ్చి పిల్లాడిని చదివించాలని వారికి నచ్చజెప్పారు. ఫీజులు కట్టలేమని చెబితే దగ్గర్లోని కాన్వెంటులో ఉచితంగా చదివిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పిల్లాడూ సరేనన్నాడు. ఇప్పుడు రోజూ కాన్వెంటుకు వెళుతున్నాడని బాలుడి తల్లి సౌజన్య సంతోషంతో చెబుతున్నారు.

- విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తిలో రాష్ట్రంలోనే మొదటి స్థానం
- బడి బయట ఉన్న 935 మందిని బడిలో చేర్చిన అధికారులు
- తెనాలి రూరల్ మండలంలోనూ 100 శాతం జీఈఆర్

తెనాలి: బడి బయట ఉన్న పిల్లలను, మధ్యలో బడి మానేసినవారిని గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. 2005 సెప్టెంబర్ 1–2018 ఆగస్టు 31 మధ్య పుట్టినవారంతా సెప్టెంబర్ 4 నాటికి ఏదో ఒక స్కూల్/కాలేజీలో నమోదై ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఎవరైనా బడి/కాలేజీకి దూరంగా ఉంటే వారిని చేర్పించాలని ప్రభుత్వం.. వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, డీఈవోలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో గుంటూరు జిల్లా తెనాలి అర్బన్ మండలం విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (జీఈఆర్)లో నూటికి నూరు శాతం లక్ష్యాన్ని సాధించిన తొలి మండలంగా అవతరించింది. ఈ మండలంలో బడి బయట చదువుకు దూరంగా ఉన్న మొత్తం 935 మందిని పాఠశాల/కాలేజీలో చేర్పించారు.

జూలై మొదటి వారం నుంచే ప్రత్యేక డ్రైవ్..

గ్రామ/ వార్డు సచివాలయాల సహకారంతో పాఠశాల విద్యాశాఖ నూరు శాతం జీఈఆర్ సాధనకు జూలై మొదటి వారం నుంచే ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఈ క్రమంలో 47 సచివాలయాలు కలిగిన తెనాలి అర్బన్ మండలం 100 శాతం లక్ష్యాన్ని సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోల పర్యవేక్షణలో వలంటీర్లు, వార్డు సచివాలయ విద్యా కార్యదర్శులు ఇంటింటా సర్వేను ఒక ఉద్యమంలా చేపట్టారు. ఒక్కో సచివాలయం పరిధిలో వందలాదిమంది బడి ఈడు పిల్లల సమాచారాన్ని సేకరించారు. విద్యాశాఖ.. వార్డు/గ్రామ వలంటీర్లకు అందజేసిన యాప్‌లో వారి వివరాలను పొందుపరిచారు. పదో తరగతిలోపు విద్యార్థులను వారు కోరుకున్న ప్రభుత్వ/ ప్రైవేటు పాఠశాలలకు పంపారు. స్తోమత లేని పేదింటి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. అందుకు ఇష్టపడని పిల్లలను తల్లిదండ్రుల అభిమతం ప్రకారం ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలలకు పంపారు. ఇంటర్ ఫెయిలైన వారు, మధ్యలో మానేసినవారిని కాలేజీ/ఐటీఐ/పాలిటెక్నిక్ కోర్సుల్లో చేర్చారు. మరికొందరిని వారు కోరినట్టుగా కోచింగ్ క్లాసులకు పంపారు. ఈ విధంగా తెనాలి అర్బన్ మండలంలో 935 మంది మళ్లీ బడి/కళాశాల బాటపట్టారు. కాగా అర్బన్ మండలంతోపాటు తెనాలి రూరల్ మండలం కూడా నూరు శాతం జీఈఆర్ లక్ష్యాన్ని సాధించింది. ఇక్కడ కూడా బడి బయట ఉన్నట్టు గుర్తించిన 355 మంది పిల్లలను బడి/కళాశాలల్లో చేర్పించారు.

కోరిన పాఠశాలల్లోనే చేర్పించాం..



రాష్ట్రంలో నూరు శాతం జీఈఆర్ సాధించిన తొలి మండలంగా తెనాలి అర్బన్ నిలవడం పట్ల చాలా సంతోషంగా ఉంది. అందరి సమన్వయంతో రూరల్ మండలంలోనూ ఈ లక్ష్యాన్ని సాధించాం. పిల్లలు, వారి తల్లిదండ్రులు కోరుకున్న విద్యాసంస్థల్లోనే చేర్పించాం.
– మేకల లక్ష్మీనారాయణ, మండల విద్యాశాఖాధికారి, తెనాలి, గుంటూరు జిల్లా

చాలా సంతృప్తిగా ఉంది..



కరోనా తర్వాత మైగ్రేషన్, డేటాలో వయసు తప్పు వంటి సాంకేతిక సమస్యలను అధిగమించి మా సచివాలయం పరిధిలో 563 మందిని సర్వే చేశాం. చదువుకు దూరంగా ఉన్న ఇద్దరు పేద పిల్లలను గుర్తించి వారిని ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యా హక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలలో చేర్పించాం. చాలా సంతృప్తిగా ఉంది.
– గంగవరపు స్వాతి, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ, 35వ సచివాలయం, తెనాలి, గుంటూరు జిల్లా

ఏపీలో పథకాల అమలు భేష్

- పార్లమెంటరీ కమిటీ చైర్మన్ కనిమొళి



రెడ్డిపల్లి సచివాలయాన్ని సందర్శించిన పార్లమెంటరీ కమిటీ చైర్మన్ కనిమొళి బృందం

సాక్షి, విశాఖపట్నం: ఏపీలో కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు తీరు ప్రశంసనీయంగా ఉందని కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ కనిమొళి కరుణానిధి అభినందించారు. కనిమొళి అధ్యక్షతన 11 మంది ఎంపీలతో కూడిన బృందం విశాఖ జిల్లాలోని ఆనందపురం, పద్మనాభం మండలాల్లో శనివారం పర్యటించింది. కేంద్ర నిధులతో జరుగుతున్న పనులను పరిశీలించారు. శొంఠ్యాంలోని రామ్‌సాగర్ అమృత్ సరోవర్ ట్యాంకుతోపాటు, చందక గ్రామంలో వ్యవసాయ భూ రీ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. పద్మనాభం మండలం రెడ్డిపల్లి సచివాలయంలో అందుతున్న సేవల గురించి ఆరా తీసింది. వివిధ గ్రామాలకు చెందిన స్వయం సహాయక బృందాల సభ్యులతో మాట్లాడి పథకాల అమలు తీరుపై ఆరా తీశారు.

సచివాలయాల సేవలు అద్భుతం

అనంతరం నగరంలోని ఓ హోటల్‌లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన సంస్థ విభాగాలకు సంబంధించిన జిల్లా అధికారులు, యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ అధికారులతో శనివారం రాత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కనిమొళి మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు అద్భుతంగా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు తీరుని ప్రశంసించారు. సమావేశంలో పార్లమెంటరీ కమిటీ సభ్యులు మాల రాజ్యలక్ష్మీషా, అజయ్ ప్రతాప్‌సింగ్, తలారి రంగయ్య, నరాన్‌భాయ్ జె.రత్వా, ఏకేపీ చిన్‌రాజ్, రాజీవ్ దిలేర్, మహ్మద్ జావెద్, వాజేసింగ్‌భాయ్ రత్వా, ఇరన్నా కడాది, నరేంద్రకుమార్‌తో పాటు జిల్లా కలెక్టర్ మల్లికార్జున పాల్గొన్నారు.

స్థానికంగానే టీచర్ల మెడికల్ బిల్లుల డేటా పరిశీలన



సాక్షి, అమరావతి: మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల సమాచారం స్థానిక డీడీవోల లాగిన్‌లోనే అందుబాటులో ఉంటుందని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ తెలిపారు. వాటిని సరిగ్గా పరిశీలించి.. టీచర్లకు సరైన సమాచారం అందించాలని డీడీవోలను శనివారం కమిషనర్ ఆదేశించారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల స్థితిగతులను తెలుసుకునేందుకు, ప్రొసీడింగ్స్ కాపీల కోసం దూరప్రాంతాల నుంచి ఇబ్రహీంపట్నంలోని కమిషనరేట్‌కు వచ్చి ఇబ్బంది పడొద్దని సూచించారు. బిల్లుల మంజూరు ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తున్నామని చెప్పారు. కానీ డీడీవోలైన హెచ్‌ఎంలు, ఎంఈవోలు, డీవైఈవోల లాగిన్‌లో పరిశీలించకపోవడం వల్ల సమస్య వస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ నుంచి స్క్రూటినీ రిపోర్టులు వచ్చిన వెంటనే ఎలాంటి జాప్యం చేయకుండా మంజూరు ప్రొసీడింగ్స్ ఆమోదించి, సంబంధిత డీడీవోల లాగిన్‌లకు పంపిస్తున్నామన్నారు. కానీ డీడీవోలు తమ లాగిన్‌లో బిల్లుల స్థితిగతులను సరిగ్గా పరిశీలించకపోవడం వల్ల టీచర్లు వాటి కోసం దూరప్రాంతాల నుంచి తమ కార్యాలయానికి వస్తున్నారని, టీచర్లు, ఉద్యోగులు వీటి కోసం కమిషనరేట్‌ను సంప్రదించే పరిస్థితి వస్తే.. డీఈవోలు, డీడీవోలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించిన మెడికల్ రీయింబర్స్ బిల్లులను సంబంధిత డీడీవోలు ఆన్‌లైన్‌లోనే సమర్పించాలని.. లాగిన్ ఫిజికల్ బిల్లులు స్వీకరించేది లేదని కమిషనర్ స్పష్టం చేశారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో పల్లెకు రక్ష

▶ మొదటి పేజీ తరువాయి

కిలోమీటర్‌కు పైగానే దూరంలో ఉన్న పీహెచ్‌సీకి వెళ్లడానికి ప్రత్యేకంగా ఓ ఆటో మాట్లాడుకోవాలి. రాను పోను సుమారు రూ.300 అవుతుంది. కదల్లేని స్థితిలో ఉన్న నాగేశ్వరరావును ఆటో ఎక్కించి, ఆస్పత్రిలో చూపించుకునిగి మళ్లీ ఇంటికి చేర్చాలంటే ఇద్దరు వ్యక్తులు కచ్చితంగా తోడుండాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' విధానంలో ఈ వ్యయ ప్రయాసలు ఏమీ లేకుండా కాకుమాను పీహెచ్‌సీ డాక్టర్.. వృద్ధుడైన నాగేశ్వరరావు ఇంటికి క్రమం తప్పకుండా వస్తున్నాడు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కొలెస్ట్రాల్, రక్తం గడ్డ కట్టడాన్ని నియంత్రించే మాత్రలు ఇస్తున్నారు. ఈ క్రమంలో నాగేశ్వరరావు భార్య విమల మాట్లాడుతూ 'ఒకప్పుడు ఆయన్ని ఆస్పత్రికి తీసుకుని వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఆ రోజు మా పిల్లలు పనులు వదులుకోవాల్సి వచ్చేది. ఇప్పుడా ఇబ్బందులు లేవు. డాక్టరే మా ఇంటికి వస్తున్నారు. మా ఆయన ఆరోగ్యం కూడా మెరుగ్గా ఉంటోంది. నెల నెలా వలంటీర్ ఇంటికే వచ్చి పెన్షన్ కూడా ఇచ్చి వెళుతున్నారు. గతంలో ఆయన కిందపడి కాలు విరిగినప్పుడు ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చికిత్స చేయించి ఆదుకుంది' అని సంతోషం వ్యక్తం చేసింది. 'ఫ్యామిలీ డాక్టర్' విధానంపై 'సాక్షి' గుంటూరు జిల్లాలోని పొన్నూరు, పెదకాకాని, పెదనందిపాడు మండలాల్లోని పలు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి అమలు తీరును పరిశీలించగా ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తమైంది.



గుంటూరు జిల్లా కాకుమాను గ్రామంలో అంగన్వాడి పిల్లలకు వైద్యం చేస్తున్న డాక్టర్ రవి ప్రసాద్



పెదనందిపాడు గ్రామంలో మంచానికే పరిమితమైన అక్కమ్మకు ఇంటి వద్ద వైద్యం అందిస్తున్న డాక్టర్ లావణ్య

'ఫ్యామిలీ డాక్టర్' కోసం ప్రభుత్వ చర్యలు ఇలా..

- మండలానికి రెండు పీహెచ్‌సీలు ఉండేలా ప్రస్తుతం ఉన్న 1,142 పీహెచ్‌సీలకు అదనంగా 88 కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ప్రతి పీహెచ్‌సీలో తప్పనిసరిగా ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన భవనాలు నిర్మాణంలో ఉంటుండగానే కార్యక్రమం అమలు కోసం వైద్యులను అందుబాటులోకి తెచ్చింది.
- మరోవైపు మండలంలో ఒక పీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఉన్న చోట 63 చోట్ల వైద్యులను నియమించి వారిని సీహెచ్‌సీలో కో లొకేట్ చేసి సేవలు అందిస్తున్నారు. ఎవరైనా వైద్యులు సెలవు పెడితే కార్యక్రమానికి ఇబ్బంది రాకుండా పూల్ అప్ వైద్యులను అందుబాటులో ఉంచారు.
- 104 మొబైల్ మెడికల్ యూనిట్(ఎంఎంయూ)తో పాటు వైద్యులు గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో 10,032 విలేజ్ క్లినిక్స్‌ను నెలలో రెండుసార్లు సందర్శించడానికి వీలుగా అప్పటికే ఉన్న 676 ఎంఎంయూ వాహనాలకు అదనంగా 260 వాహనాలను అందుబాటులోకి తెచ్చారు.
- అన్ని విలేజ్ క్లినిక్స్‌లో 105 రకాల మందులను అందుబాటులో ఉంచారు.
- ఎన్‌సీడీ సర్వేలో భాగంగా 30 ఏళ్లు పైబడిన వారందరినీ వైద్య శాఖ స్క్రీనింగ్ చేపట్టింది. వీరిలో గుర్తించిన బీపీ, షుగర్, ఇతర సమస్యల బాధితులను ఫ్యామిలీ డాక్టర్‌తో అనుసంధానించారు. వారికి నిరంతర ఫాలో అప్ సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.



గుంటూరుకు వెళ్లే బాధ తప్పింది..

గుంటూరు జిల్లా పొన్నూరు మండలం పెదపాలెం గ్రామానికి చెందిన కావూరి శేషగిరిరావుకు 90 ఏళ్లు. ఆయన సతీమణి వెంకాయమ్మకు 70 ఏళ్లపైనే ఉంటాయి. పిల్లలందరూ వేరే ఊళ్లలో స్థిరపడ్డారు. వృద్ధులు ఇద్దరే ఉంటారు. వయో భారానికి తోడు శేషగిరిరావుకు బీపీ, షుగర్ ఉన్నాయి. వెంకాయమ్మ గుండెకు కొన్నేళ్ల క్రితం స్టెంట్ వేశారు. దీంతో వీరిద్దరూ క్రమం తప్పకుండా ఆస్పత్రికి వెళ్లి చెకప్ చేయించుకుని మందులు వాడాల్సిన పరిస్థితి. ప్రతి నెలా గుంటూరులోని మిలటరీ ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను అందుబాటులోకి తేవడంతో పాటు, ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామంలోని వీరి ఇంటికి వైద్యుడు వచ్చి మందులు ఇచ్చారు. ఈ మందులను తీసుకెళ్లి గుంటూరు మిలటరీ ఆస్పత్రిలో చూపిస్తే తామిచ్చే మందులు కూడా అవే అన్నారు. దీంతో వెంకాయమ్మ దంపతులు గుంటూరుకు వెళ్లడం మానేశారు. క్రమం తప్పకుండా ఫ్యామిలీ డాక్టర్ వీరి ఇంటికి వెళుతున్నారు. వైద్య సేవలు అందిస్తున్నారు. 'ఒకప్పుడు గుంటూరు మిలటరీ ఆస్పత్రికి పోయి రావడానికి రోజంతా సరిపోయేది. బాగా ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు ఇంటి దగ్గరకే డాక్టర్ వస్తుండటం మాకెంతో ఉపయోగకరంగా ఉంది. ప్రభుత్వం చాలా గొప్ప నిర్ణయం తీసుకుంది. మాలాంటి ఎందరికో చాలా మంచి చేస్తోంది' అని వెంకాయమ్మ అభిప్రాయపడింది. ఇలా 'ఫ్యామిలీ డాక్టర్' విధానం వల్ల వృద్ధులు, వ్యాధిగ్రస్తులున్న ఊరు, ఇంటి వద్దకే వైద్యులు వచ్చి సేవలు అందిస్తూ, ఆరోగ్య వివరాలను వాకబు చేస్తుండటం పట్ల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. సీఎం జగన్ పుణ్యమా అని ఆస్పత్రుల చుట్టూ తిరిగే అవస్థలు తప్పాయని మారుమూల గ్రామీణ, గిరిజన ప్రాంత ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ 14 రకాల వైద్య పరీక్షలు

- గర్భం నిర్ధారణకు యూరిన్ టెస్ట్
- హిమోగ్లోబిన్ టెస్ట్
- ర్యాండమ్ గ్లూకోజ్ టెస్ట్ (షుగర్)
- మలేరియా టెస్ట్
- హెచ్‌ఐవీ నిర్ధారణ
- డెంగ్యూ టెస్ట్
- స్పుటమ్ (ఏఎఫ్‌బి)
- మల్టీపారా యూరిన్ స్ట్రిప్స్ (డిప్ స్టిక్)
- అయోడిన్ టెస్ట్
- వాటర్ టెస్టింగ్
- హెపటైటిస్ బి నిర్ధారణ
- ఫైలేరియాసిస్ టెస్ట్
- సిఫిలి ర్యాపిడ్ టెస్ట్
- విజువల్ ఇన్‌స్పెక్షన్

వ్యయ, ప్రయాసలకు ఫుల్‌స్టాప్

పెదనందిపాడు మండలం పమిడివారిపాలెం గ్రామంలో సుమారు 900 మంది జనాభా ఉంటారు. వీరిలో 170 మందికి పైగా బీపీ, షుగర్‌తో బాధ పడుతున్నారు. వీరితో పాటు గర్భిణులు, బాలింతలు, వృద్ధులు క్రమం తప్పకుండా వైద్యుడిని సంప్రదించి, వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో 14 కి.మీ దూరంలో ఉండే పెదనందిపాడు పీహెచ్‌సీ, 20 కి.మీకు పైగా దూరంలో ఉండే ప్రత్తిపాడు సీహెచ్‌సీ, పొన్నూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలి. ఇంట్లో మోటార్ సైకిల్ ఉంటే పర్వాలేదు. లేదంటే ప్రత్యేకంగా ఆటో మాట్లాడుకుని వెళ్లాల్సిందే. ఒకసారి ఆటోలో ఆస్పత్రికి పోయి రావాలంటే రూ.500 పైనే ఖర్చవుతుంది. ఇప్పుడు ఫ్యామిలీ డాక్టర్ వల్ల ఈ వ్యయ, ప్రయాసలకు ఫుల్‌స్టాప్ పడింది. ఈ విధానంలో పెదనందిపాడు పీహెచ్‌సీ డాక్టర్ ప్రతి నెలా క్రమం తప్పకుండా నాలుగో శుక్రవారం గ్రామానికి వస్తున్నారు. రోజంతా గ్రామంలో ఉండి వైద్య సేవలు అందిస్తున్నారు. మంచానికే పరిమితం అయిన వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, బాలింతలు, ఆరోగ్యశ్రీ రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఆరోగ్యంపై వాకబు చేస్తున్నారు. మరోవైపు పక్కనే మూడు కి.మీ దూరంలో ఉన్న పుసులూరు గ్రామంలో ప్రభుత్వం వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

తొలగిన ఆర్థిక భారం.. ఇబ్బందులు..

ఫ్యామిలీ డాక్టర్‌తో రాష్ట్రంలో ఉన్న గ్రామీణ ప్రజలు ప్రాథమిక వైద్యం కోసం సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి రావడానికి అయ్యే రవాణా వ్యయం రూ.కోట్లలో ఉంటుంది. ఇప్పుడు ఈ ఆర్థిక భారం, ఇతర ఇబ్బందులకు విముక్తి లభించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలోనే విలేజ్ క్లినిక్ సేవలు ప్రారంభం అయ్యాయి. 12 రకాల వైద్య సేవలు, 14 పరీక్షలు, 105 రకాల మందులు అక్కడే అందుబాటులోకి వచ్చాయి. టెలీ మెడిసిన్ ద్వారా గైనిక్, పీడియాట్రిషన్, ఇతర స్పెషాలిటీ వైద్యుల కన్సల్టెన్సీ లభిస్తోంది. పీహెచ్‌సీ డాక్టర్ ప్రతి నెలా గ్రామాలకే వెళుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అవుట్ పేషెంట్(ఓపీ) క్లినిక్ నిర్వహించి, ఆ తర్వాత మంచానికి పరిమితం అయిన వారికి వైద్య సేవలు అందించడానికి గృహాలు సందర్శిస్తున్నారు అదే విధంగా అంగన్‌వాడీలు, పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల ఆరోగ్యంపై వాకబు చేస్తున్నారు.

ఇప్పటి వరకు 2.10 కోట్ల మందికి వైద్యం


రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్‌రన్ గత ఏడాది అక్టోబర్ 21న ప్రారంభించారు. పూర్తి స్థాయిలో ఈ ఏడాది ఏప్రిల్‌లో అందుబాటులోకి వచ్చింది. కాగా గత ఏడాది అక్టోబర్ 21 నుంచి ఇప్పటి వరకు పీహెచ్‌సీ వైద్యులు 10,032 విలేజ్ క్లినిక్స్ పరిధిలో 1,82,459 సార్లు సందర్శించారు. 2,10,75,065 మందికి వైద్య సేవలు అందించారు.

విభాగం	వైద్య సేవలు
జనరల్ ఓపీ	69,20,919
అడొలెసెంట్ (కౌమార దశ)	37,380
గర్భిణులు	15,16,475
బాలింతలు	5,19,919
రక్తహీనత	97,814
బీపీ	51,33,078
షుగర్	32,54,790
బీపీ, షుగర్	34,51,022
నోటి క్యాన్సర్	45,011
రొమ్ము క్యాన్సర్	45,011
గర్భాశయ క్యాన్సర్	72,062
టీబీ	10,498

'ఫ్యామిలీ డాక్టర్'తో గ్రామాల్లో అందే వైద్య సేవలు


- జనరల్ అవుట్ పేషెంట్ సేవలు
- బీపీ, షుగర్, ఊబకాయం లాంటి జీవనశైలి జబ్బుల కేసుల ఫాలోఅప్
- గర్భిణులకు యాంటీనేటల్ చెకప్స్, బాలింతలకు పోస్ట్‌నేటల్ చెకప్స్, ప్రసవానంతర సమస్యల ముందస్తు గుర్తింపు. చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చిన లోపాల గుర్తింపు
- రక్తహీనతతో బాధ పడుతున్న మహిళలు, చిన్న పిల్లలకు వైద్య సేవలు
- ఆరోగ్యశ్రీ కింద శస్త్ర చికిత్స జరిగిన రోగులు, క్యాన్సర్, ఇతర దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితం అయిన వారికి, వృద్ధులకు ఇంటి వద్దే వైద్యం
- పాలియేటివ్ కేర్
- తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ నిర్ధారణ

చాలా ఆనందంగా ఉంది




రెండేళ్లుగా బీపీ సమస్య ఉంది. దీంతో మందులు వాడుతూ, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ చెప్పారు. మా ఊళ్లోనే ప్రభుత్వం విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేసింది. ఇక్కడే పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు. పొన్నూరు నుంచి ప్రభుత్వ డాక్టర్ కూడా క్లినిక్‌కు వస్తారు. ముందు రోజు ఆశ, ఏఎన్‌ఎం సమాచారం ఇస్తారు. బీపీ స్థాయిని బట్టి డాక్టర్లు మందులు ఇస్తున్నారు. మందులు బాగా పని చేస్తున్నాయి. ప్రభుత్వం ఈ వ్యవస్థను తేకపోయినట్లైతే పొన్నూరుకు పోవాల్సి వచ్చేది. దీంతో రాను, పోను ఆటో చార్జీల రూపంలో అదనపు ఖర్చులు పెట్టుకోవాల్సి ఉండేది. ఇప్పుడా సమస్య లేదు.
– రత్నకుమారి, పెదపాలెం, గుంటూరు జిల్లా

మంచి కార్యక్రమం



మన దేశంలో ఇప్పటి వరకు గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడం కోసం ఏఎన్‌ఎం, ఆశ, ఎంఎల్‌హెచ్‌పీ వ్యవస్థ మాత్రమే ఉంది. గ్రామ స్థాయిలోనే వైద్యులు నేరుగా ప్రజలకు సంరక్షణ అందించే వ్యవస్థ లేదు. ఫ్యామిలీ డాక్టర్ ద్వారా డాక్టర్‌లను గ్రామ స్థాయిలోకి తీసుకుని వెళ్లి ప్రజలకు సేవలు అందించడం మంచి నిర్ణయం. ప్రజారోగ్య వ్యవస్థలో ప్రాథమిక వైద్య సేవలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. వివిధ జబ్బులు, అనారోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించడం, ఆ దశలోనే రోగికి సరైన వైద్య సేవలు అందించడం కీలకం. వైద్యులు క్రమం తప్పకుండా గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలతో మమేకం అవ్వడంతో చాలా వరకు జబ్బులు, సమస్యలు ప్రారంభ దశలోనే బయటపడతాయి. బీపీ, షుగర్, ఇతర నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌తో బాధపడే వారికి నిరంతర ఫాలోఅప్ సేవలు అందుతాయి. – డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, ఢిల్లీ ఎయిమ్స్ కార్డియాలజీ విభాగం మాజీ అధిపతి, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు

ప్రజల సంతృప్తి స్థాయి తెలుసుకుంటున్నాం



ఫ్యామిలీ డాక్టర్ సేవల పట్ల ప్రజల సంతృప్తి స్థాయిలను తెలుసుకుంటున్నాం. ఇందుకోసం బోధనాస్పత్రుల్లోని ఎస్పీఎం విభాగాన్ని కార్యక్రమంలో భాగస్వామిని చేశాం. ప్రతి జిల్లాలో ర్యాండమ్‌గా ఒకటి రెండు గ్రామాలను ఎంపిక చేసి ఫ్యామిలీ డాక్టర్ సేవలు పొందిన వారి నుంచి వైద్య విద్యార్థులు అభిప్రాయాలు సేకరిస్తున్నారు. సేవలు పొందిన వారిలో అత్యధికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన నెగిటివ్ ఫీడ్ బ్యాక్‌కు కారణాలు అన్వేషించి, పరిష్కరిస్తున్నాం.
– జె.నివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్

నీ జీవితమంతా అబద్ధాలే



చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కరకట్ట మీదగల ఆయన నివాసానికి సమీపంలో ఇసుకను తవ్వి రవాణా చేస్తున్న లారీలు

నాడు నీ ఇంటి పక్కనే, కళ్లెదుటే ఇసుక దోపిడీ

చంద్రబాబు ఇసుక ప్రజెంటేషన్‌పై నిప్పులు చెరిగిన మంత్రి పెద్దిరెడ్డి



మీడియాతో మంత్రి పెద్దిరెడ్డి తదితరులు

సాక్షి, తిరుపతి

రాష్ట్రంలో సీఎం వైఎస్‌ జగన్‌ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇసుక దోపిడీ అంటూ చంద్రబాబునాయుడు అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర గనులు, ఇంధన, అటవీ, పర్యావరణ, శాస్త్ర–సాంకేతిక శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిప్పులు చెరిగారు. చంద్రబాబు జీవితమంతా అబద్ధాలేనని ధ్వజమెత్తారు. నాడు నీ ఇంటి వెనుకే యథేచ్ఛగా ఇసుక దోపిడీ సాగుతుంటే నిద్రపోయావా? అంటూ నిలదీశారు. తిరుపతిలోని క్యాంప్‌ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యలపై మాట్లాడే పరిస్థితి లేనందున ఇసుక దోపిడీ అంటూ చంద్రబాబు పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ పేరుతో అర్థంలేని ఆరోపణలకు దిగాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని దూషించడం, సీఎంపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం, అబద్ధాలను నిజాలుగా భ్రమింపచేసే దిగజారుడు పనులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వం నిర్వహించిన ఇసుక టెండర్లలో చంద్రబాబు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. టెండర్లు దక్కించుకున్న సంస్థ టన్నుకు రూ.375 ప్రభుత్వానికి చెల్లించాలని, మరో రూ.వంద వారి అడ్మినిస్ట్రేటివ్‌ ఖర్చు కింద తీసుకుంటుందని వివరించారు. మొత్తంగా టన్ను ఇసుక రూ.475 చొప్పున విక్రయించాలన్నారు. ఇందుకు భిన్నంగా ఎక్కడైనా జరిగితే ప్రజలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని నియోజకవర్గాల వారీగా, డిపోల వారీగా రవాణా చార్జీలతో కలిపి ప్రభుత్వం నిర్ణయించిన రేట్లను ప్రతివారం పత్రికల్లో ప్రకటిస్తున్నామని స్పష్టం చేశారు. ఫిర్యాదు చేసేందుకు టోల్‌ ఫ్రీ నంబర్, రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు, గనుల శాఖ రీజనల్‌ స్క్వాడ్స్, ఎస్‌ఈబీ తనిఖీల ద్వారా అక్రమాలకు తావులేకుండా చేశామని చెప్పారు. మంత్రి ఇంకా ఏం చెప్పారంటే..

పారదర్శక విధానం.. ఎన్జీటీ సంతృప్తి

- వైఎస్‌ జగన్‌ అధికారంలోకి రాగానే కేబినెట్‌ సబ్‌ కమిటీని నియమించి, పారదర్శకంగా కొత్త ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ప్రజలకు సులభంగా తక్కువ ధరకు అందించేలా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీ ద్వారా ఇసుక తవ్వకాల టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. పర్యావరణానికి ఎటువంటి విఘాతం కలగకుండా పూర్తి అనుమతులతో ఇసుక తవ్వకాలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక పాలసీ ద్వారా తీసుకున్న చర్యలను పరిశీలించిన ఎన్జీటి సైతం సంతృప్తి వ్యక్తం చేసింది.
- గత సర్కారు హయాంలో వర్షాకాలంలో నాలుగు నెలల పాటు ఇసుక లభించక రాష్ట్రంలో భవన నిర్మాణ పనులు నిలిచిపోయేవి. కార్మికులు ఉపాధి లేక ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వర్షాకాలంలోనూ ఇసుక పుష్కలంగా లభ్యమయ్యేలా దాదాపు 50 లక్షల టన్నులకుపైగా ఇసుకను డిపోల్లో నిల్వ చేసేలా చర్యలు తీసుకుంది. దీంతో ఎక్కడా నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడటం లేదు.

ప్రభుత్వ ఆదాయం పెరిగితే దోపిడీ జరిగినట్లా?

- 2018–19లో టీడీపీ ప్రభుత్వం దిగిపోయేప్పుడు మైనింగ్‌ రెవెన్యూ రూ.1,950 కోట్లు. ఆ రోజు మైనర్‌ మినరల్స్‌లో రూ.1,263 కోట్ల ఆదాయం కాగా, మేజర్‌ మినరల్స్‌లో రూ.687 కోట్లు. 2022–23లో రూ.4,756 కోట్ల మైనింగ్‌ రెవెన్యూ వస్తే, అందులో మైనర్‌ మినరల్స్‌లో రూ.3,882 కోట్లు, మేజర్‌ మినరల్స్‌లో రూ.874 కోట్లు వచ్చింది. మా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించకపోయి ఉంటే ఆ రూ.1,950 కోట్ల వద్దే ఉండేవాళ్లం.
- ఏపీఎండీసీకి 2018–19లో రూ.833 కోట్ల ఆదాయం వస్తే, 2022–23 లో రూ.1,800 కోట్లు, 2023–24లో రూ.4 వేల కోట్ల వరకు వస్తుందని అంచనా. దాదాపు రెండు, మూడు రెట్లు రెవెన్యూ పెరిగితే, మైనింగ్‌లో దోపిడీ అంటున్న చంద్రబాబు వ్యాఖ్యలు అర్థరహితం.

మీకు మళ్లీ భంగపాటు తప్పదు

- ఆరోపణలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించి, రాజకీయంగా దివాలాకోరుగా మారి అధికారంలోకి రావాలని చంద్రబాబు చూస్తున్నారు. ఎవరు ఎక్కువ రౌడీయిజం చేస్తే, ఎవరిపై ఎక్కువ కేసులు ఉంటే వారికి నామినేటెడ్‌ పదవులు ఇస్తానని అంటున్నారు. యుద్ధానికి రండి... జైలుకు పోయినా పరవాలేదని అధికారంలోకి రావాలని చంద్రబాబు దత్తపుత్రుడు పవన్‌ కళ్యాణ్‌ అంటున్నారు. చంద్రబాబు, లోకేశ్ , పవన్‌ ఈ ముగ్గురు కలిసి ప్రజలను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారు. వీరికి మరోసారి భంగపాటు ఖాయం.
- రాబోయే ఎన్నికల్లో మరింత ఎక్కువ మెజారిటీతో మళ్లీ అధికారంలోకి వస్తాం. సీఎం వైఎస్‌ జగన్‌ చరిష్మా ఉన్న నేత. నాడు చంద్రబాబు చేర్పించిన 60 లక్షల దొంగ ఓట్లు తొలగిస్తుంటే ఎల్లో గ్యాంగ్‌ గగ్గోలు పెడుతోంది. ఒక్క కుప్పంలోనే 36 వేల దొంగ ఓట్లు ఉన్నాయి. దొంగ ఓట్ల విషయమై ఈ నెల 28వ తేదీన మా ఎంపీలు ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని, కేంద్ర హోంమంత్రిని కలవనున్నారు.
- విలేకరుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, జడ్పీ చైర్మన్‌ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చింతమనేని వికృత చేష్టలు

- ఇసుక మాఫియాను అడ్డుకున్న మహిళా తహసీల్దార్‌ వనజాక్షిపై టీడీపీ నేత చింతమనేని ప్రభాకర్‌ దారుణంగా దాడికి పాల్పడ్డ ఘటనను ఎవరూ మరచిపోలేరు. అక్రమ తవ్వకాలను అడ్డుకున్నదని ఆమె జుట్టు పట్టుకుని ఈడ్చేశారు. టీడీపీ హయాంలో ఆగడాలకు ఈ ఘటనే మచ్చుతునక. నాడు ఇష్టారాజ్యంగా కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలు చేయడంతో ఒక బోటు బోల్తాకొట్టి పలువురు మృతి చెందిన విషయం అందరికీ తెలిసిందే.
- ఇసుకపై జీఎస్టీ వసూలు చేయలేదని చంద్రబాబు మాట్లాడుతున్నారు. జీఎస్టీ వసూళ్లు కేంద్ర ప్రభుత్వ విభాగాలు చూసుకుంటాయి. దాంతో రాష్ట్రానికి ఏం సంబంధం? నాడు ఉచిత ఇసుక పేరుతో దోచుకున్న డబ్బులతో నువ్వు, మీ కుమారుడు జేబులు నింపుకోలేదా? చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌కు ఇసుకను తరలించలేదా?



ఎమ్మార్వో వనజాక్షిపై దాడి చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని, కన్నీళ్లు పెట్టుకున్న వనజాక్షి (ఫైల్)

ఉచితంగా ఎవరికైనా ఇచ్చావా?

- టీడీపీ హయాంలో తొలుత మహిళా సంఘాలకు ఇసుక తవ్వకాలను అప్పగించినా పచ్చమూకల బెదిరింపులతో నిస్సహాయ పరిస్థితి సృష్టించి వారి చేతి నుంచి తప్పించేశారు. ఆ తర్వాత ఉచిత ఇసుక విధానం పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా మాఫియా నెట్‌వర్క్‌ ఆవిర్భవించింది. వినియోగదారులు బ్లాక్‌ మార్కెట్‌ నుంచి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన ఆగత్యం కల్పించారు. ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఆదాయం రాకుండా చేసి అక్రమ తవ్వకాలతో పచ్చ మూకలు జేబులు నింపుకున్నాయి. ప్రజలకు ఇసుక అందకుండా బ్లాక్‌ మార్కెట్‌ సృష్టించి దోపిడీకి పాల్పడ్డారు. నాడు చంద్రబాబు ఉచిత ఇసుకను ఎవరికీ ఇవ్వలేదు.
- చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆయన ఇంటి వెనుకే అక్రమంగా ఇసుక తవ్వకాలు రేయింబవళ్లు యథేచ్ఛగా జరిగేవి. వందల సంఖ్యలో లారీలు ఆయన ఇంటి ముందు నుంచే హైదరాబాద్‌కు తరలిపోయేవి. అప్పుడు వసారాలో తాపీగా కూర్చొని కళ్లప్పగించి చూసిన చంద్రబాబు.. ఇప్పుడు దోపిడీ జరుగుతోందంటూ నిందలు వేయడం దుర్మార్గం. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఇసుక దోపిడీ నిజమేనని తేలడంతో జాతీయ హరిత ట్రిబ్యునల్‌ (ఎన్జీటీ) ఏకంగా రూ.100 కోట్ల జరిమానా విధించడం ఎవరూ మరచిపోలేదు.

నాడు రూ.43 వేల కోట్లు మీరు దోచేసినట్లే!


- రూ.40 వేల కోట్ల ఇసుక అక్రమాలు జరిగాయని ఏ లెక్కల ప్రకారం మాట్లాడుతున్నావు? టెండర్ల ద్వారా రాష్ట్రంలో ఇసుక తవ్వకాల కాంట్రాక్టును దక్కించుకున్న జేపీ వెంచర్స్‌ సంస్థ ఏటా ప్రభుత్వానికి రూ.765 కోట్లు చెల్లిస్తోంది. ఈ నాలుగేళ్లలో సుమారు రూ.3 వేల కోట్ల ఆదాయం లభించింది.
- చంద్రబాబు చెబుతున్న లెక్కల ప్రకారం రూ.40 వేల కోట్లు, మా ప్రభుత్వ హయాంలో వచ్చిన రూ.3 వేల కోట్లు కూడా కలిపితే మొత్తం 43 వేల కోట్లు.. మీ ఐదేళ్ల పాలనలో కూడా వచ్చి ఉండాలి కదా? మరి ఆ డబ్బు అంతా మీరు దోపిడీ చేశారని అంగీకరిస్తావా చంద్రబాబూ? నాటి తప్పులన్నీ నేడు జరిగినట్లు ప్రజలను భ్రమింపజేయాలన్నదే మీ ఉద్దేశం అని అర్థమవుతోంది.



లింగాయపాలెం వద్ద కృష్ణా నది ఒడ్డున ఇసుక తోడుతున్న పొక్లెయిన్ (ఫైల్)

మూలధన వ్యయంలో ఏపీ టాప్

- నాలుగు నెలల్లోనే బడ్జెట్ కేటాయింపుల్లో 47.79 శాతం వ్యయం
- ఇదే సమయంలో కేరళంలో 28.19 శాతమే
- ఏపీలో ఏప్రిల్ నుంచి జూలై వరకు రూ.14,844.99 కోట్లు వ్యయం
- మూల ధన వ్యయంపై కాగ్ గణాంకాల నివేదికలో స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూల ధన వ్యయంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది. ఏప్రిల్ నుంచి జూలై వరకు మూల ధన వ్యయంపై కాగ్ విడుదల చేసిన గణాంకాల ద్వారా రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని స్పష్టమైంది. బడ్జెట్‌లో మూల ధన వ్యయం కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల్లోనే 47.79 శాతం వ్యయం చేసినట్లు కాగ్ గణాంకాలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళం రాష్ట్రానికి చెందిన తొలి నాలుగు నెలల మూల ధన వ్యయం గణాంకాలను కాగ్ పేర్కొంది. కేరళం బడ్జెట్‌లో మూల ధన వ్యయం కేటాయింపుల్లో ఏప్రిల్ నుంచి జూలై వరకు 28.19 శాతమే వ్యయం చేసినట్లు కాగ్ తెలిపింది. ఏప్రిల్ నుంచి జూలై వరకు ఏపీ మూల ధన వ్యయం రూ.14,844.99 కోట్లు అని, ఇది బడ్జెట్‌లో మూల ధన వ్యయ కేటాయింపుల్లో 47.79 శాతంగా ఉందని తెలిపింది. ఈ నాలుగు నెలల్లో కేరళం మూల ధన వ్యయం రూ.4,117.87 కోట్లు అని, ఇది బడ్జెట్ కేటాయింపుల్లో 28.19 శాతం అని వెల్లడించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన జూలై నెల మూల ధన వ్యయం గణాంకాలను కాగ్ ఇంకా విడుదల చేయలేదు. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్ నుంచి మే వరకు) కేంద్ర ప్రభుత్వంతో పాటు వివిధ రాష్ట్రాలు బడ్జెట్‌లో మూల ధన వ్యయం కేటాయింపుల్లో ఎంత మేర వ్యయం చేశాయనే వివరాలను ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. కేంద్రంతో పాటు దేశంలోని ఏ ఇతర రాష్ట్రాలు చేయనంత మూల ధన వ్యయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలి త్రైమాసికంలోనే చేసిందని ఆ నివేదిక వెల్లడించింది.

తొలి త్రైమాసికంలో కేంద్రం కంటే ఎక్కువ వ్యయం

కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక ఏడాది బడ్జెట్‌లో మూల ధన వ్యయ కేటాయింపుల్లో తొలి త్రైమాసికంలో 27.8 శాతం వ్యయం చేయగా, ఆంధ్రప్రదేశ్ 40.8 శాతం వ్యయం చేసినట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. తొలి త్రైమాసికంలో ఇంత పెద్ద ఎత్తున ఏపీ ప్రభుత్వం మూల ధన వ్యయం చేయడం స్వాగత సంకేతమని ఆ నివేదిక వ్యాఖ్యానించింది. తొలి త్రైమాసికంలో మూల ధన వ్యయంలో ఆంధ్రప్రదేశ్ తరువాత తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. తొలి త్రైమాసికంలో అన్ని రాష్ట్రాల సరాసరి చూస్తే మూల ధన వ్యయం బడ్జెట్ కేటాయింపుల్లో 12.7 శాతంగా ఉంది. మూల ధన వ్యయం అంటే ఆస్తుల కల్పన వ్యయంగా పరిగణిస్తారు. వ్యవసాయం, విద్య, వైద్యం, రహదారులు రంగాల్లో ఆస్తుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పనులను చేపట్టిన విషయం తెలిసిందే. ఒక పక్క సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూనే మరో పక్క ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. మూలధన వ్యయంలో గత ప్రభుత్వం కన్నా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెరుగ్గా ఉన్నప్పటికీ ప్రతిపక్షాలు, ఓ వర్గం మీడియా పట్టించుకోకుండా కేవలం అప్పులంటూ దుష్ప్రచారం చేస్తుండటం గమనార్హం.

రాష్ట్రంలో ఏప్రిల్-జూలై మూల ధన వ్యయం (కాగ్ గణాంకాల మేరకు) ఇలా

నెల	మూల ధన వ్యయం (రూ.కోట్లలో)
ఏప్రిల్	5,588.00
మే	9,235.26
జూన్	12,669.11
జూలై	14,844.99

ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ప్రకారం ఏప్రిల్-జూన్ వరకు దేశం, ఇతర రాష్ట్రాల్లో మూల ధన వ్యయం

ప్రభుత్వం	మూల ధన వ్యయం శాతం
కేంద్రం	27.8
అన్ని రాష్ట్రాల సగటు	12.7
ఆంధ్రప్రదేశ్	40.8
బిహార్	13.3
ఛత్తీస్‌గఢ్	8.7
గుజరాత్	17.0
హరియాణ	15.9
హిమాచల్ ప్రదేశ్	11.7
జమ్మూ-కాశ్మీర్	3.0
జార్ఖండ్	8.5
కర్ణాటక	3.4
కేరళ	20.9
మధ్యప్రదేశ్	26.6
మహారాష్ట్ర	4.8
ఒడిశా	11.6
పంజాబ్	4.3
రాజస్థాన్	19.8
తమిళనాడు	11.7
తెలంగాణ	26.6
ఉత్తరప్రదేశ్	6.8
ఉత్తరాఖండ్	10.1
పశ్చిమ బెంగాల్	13.2

సంస్కారవంతమైన వ్యక్తిత్వానికి మించిన సమాజసేవ లేదు

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు

తెనాలి: ఏదైనా సిద్ధాంతాన్ని నేర్చుకుని ఆచరించటం కన్నా వ్యక్తిగత సంస్కారాన్ని కలిగి, మనతోపాటు తోటివారు బాగుండాలన్న ఆశయంతో జీవించటం, పిల్లల్ని ఆ దారినే నడిపించటానికి మించిన ప్రజాసేవ మరొకటి లేదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రఖ్యాత ట్రేడ్ యూనియన్ నేత ఎంవీఎస్ కపర్ది ది ఆ కోవకు చెందిన ప్రథమ కుటుంబంగా చెప్పారు. ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శనివారం రాత్రి 'ప్రజాస్వామ్యం–ప్రస్తుత పరిస్థితులు' అంశంపై కపర్ది స్మారకోపన్యాస సభకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షత వహించారు. సజ్జల మాట్లాడుతూ.. చదువు పూర్తిచేసుకుని హైదరాబాద్‌కు వెళ్లిన తనకు కొత్త ప్రపంచాన్ని చూపడంలో ఆలోచనల్ని పదునెక్కించటంలో కపర్ది బిడ్డలతో గల సాన్నిహిత్యం, పరోక్షంగా కపర్ది ఎంతగానో తోడ్పడ్డారని చెప్పారు. ప్రముఖ సంపాదకుడు ఆర్వీ రామారావు, 'దారిదీపం' పత్రిక సంపాదకుడు డీవీఎస్ వర్మలు ప్రసంగించారు. ప్రముఖ పాత్రికేయుడు మందలపర్తి కిషోర్ రచన 'నెమరు' పుస్తకాన్ని కుటుంబ సభ్యులు, అతిథుల సమక్షంలో ఆయన మనుమరాలు గిరిజ ఆవిష్కరించారు. ప్రముఖ రచయిత తల్లావజ్ఝల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

దేశ సగటును మించి రాష్ట్రంలో 'పాల' దిగుబడి

- ఆవు, గేదె పాల దిగుబడిలో నాల్గో స్థానంలో రాష్ట్రం
- రాష్ట్రంలో ఆవు పాల దిగుబడి రోజుకు 7.63 కిలోలు
- నీతి ఆయోగ్ నివేదిక వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పాడి అభివృద్ధి, పాల ఉత్పత్తి పెంపుదలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. పాల దిగుబడిలో రాష్ట్రం గణనీయమైన అభివృద్ధిని సాధిస్తోంది. రాష్ట్రంలో ఆవు, గేదె పాల రోజువారీ సగటు దిగుబడి దేశ సగటును మించినట్లు నీతి ఆయోగ్ నివేదిక పేర్కొంది. రాష్ట్రాలవారీగా చూస్తే ఆవు, గేదె పాలు రోజుకు దిగుబడిలో ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో ఉంది. ఆవు పాల దిగుబడిలో పంజాబ్, గేదె పాల దిగుబడిలో హరియాణ మొదటి స్థానాల్లో ఉన్నట్లు నివేదిక తెలిపింది. ఒక ఆవు పాలు దేశ సగటు దిగుబడి రోజుకు 5.15 కిలోలు, ఒక గేదె పాలు 5.90 కిలోలున్నట్లు నివేదిక తెలిపింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆవు పాల దిగుబడి రోజుకు 7.63 కిలోలు, గేదె పాలు 7.77 కిలోలున్నట్లు పేర్కొంది. భారత దేశం డెయిరీ అభివృద్ధిలో ఇప్పటికే ప్రపంచంలో అతి పెద్ద దేశంగా అవతరించిందని, అయితే దిగుబడి విషయంలో మాత్రం అభివృద్ధి చెందిన దేశాలకంటే వెనుకబడి ఉన్నట్లు తెలిపింది. దేశంలో ఆవు పాల దిగుబడి ప్రపంచ సగటులో 2/3వ వంతు మాత్రమేనని పేర్కొంది. దేశంలో చాలా రాష్ట్రాల్లో పాల దిగుబడి చాలా తక్కువగా ఉందని చెప్పింది. అసోం, అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, బీహార్ తదితర రాష్ట్రాల్లో ఆవు, గేదె పాల దిగుబడి రోజుకు కనీసం 5 కిలోలు కూడా లేదని తెలిపింది. దేశవ్యాప్తంగా పాల దిగుబడిని మరింతగా పెంచేందుకు చర్యలు తీసుకోవాలని నివేదిక సూచించింది. గత 50 సంవత్సరాల్లో పాల ఉత్పత్తిలో చాలా వరకు పెరుగుదలకు కారణం పాడి పశువులు గణనీయంగా పెరుగడమేనని నివేదిక తెలిపింది. దేశంలో పాడి పశువులు 1972లో 122.7 మిలియన్లు ఉండగా ప్రస్తుతం 246.7 మిలియన్లకు పెరిగాయని పేర్కొంది.

వివిధ రాష్ట్రాల్లో ఆవు, గేదె పాల దిగుబడి ఇలా

రాష్ట్రం	ఆవు పాల దిగుబడి (కేజీ/రోజు)	గేదె పాల దిగుబడి (కేజీ/రోజు)
పంజాబ్	13.31	9.46
కేరళ	9.96	5.20
హరియాణ	8.49	9.63
రాజస్థాన్	6.28	8.32
ఆంధ్రప్రదేశ్	7.63	7.77
గోవా	7.01	3.76
గుజరాత్	6.82	5.29
తమిళనాడు	6.63	3.54
మహారాష్ట్ర	6.38	5.26
కర్ణాటక	6.32	4.31

అక్టోబర్ చివరి నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ

మార్చి వరకు సేకరించనున్న పౌర సరఫరాల సంస్థ

- ప్రణాళిక సిద్ధం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- 3500 ఆర్బీకేల్లో కొనుగోలు కేంద్రాలు
- 40 లక్షల టన్నుల సేకరణ లక్ష్యం
- ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.163 పెంచిన ప్రభుత్వం
- సాధారణ రకానికి రూ.143 పెంపు
- 'ఏ' గ్రేడ్ మద్దతు ధర క్వింటాల్ రూ. 2,203
- సాధారణ రకానికి రూ.2,183గా నిర్ణయం
- లక్ష్యానికి మించి ధాన్యం వచ్చినా కొనడానికి సిద్ధం

సాక్షి, అమరావతి: మిల్లర్లు, దళారుల ప్రమేయం లేకుండా రైతన్నకు మద్దతు ధర అందించడమే లక్ష్యంగా ఖరీఫ్ ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ క్షేత్రం (ఫామ్ గేట్) నుంచే అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలుకు పౌర సరఫరాల సంస్థ సిద్ధమవుతోంది. అక్టోబర్ చివరి వారంలో ప్రారంభించి మార్చి నెలాఖరులోగా సేకరణ పూర్తి చేయనుంది. ఇటీవల ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు కనీస మద్దతు ధరను రూ.163 మేర పెంచి రూ.2,203గా ఖరారు చేసింది. సాధారణ వరి రకానికి రూ.143 పెంచి రూ.2,183గా నిర్ణయించింది. రాష్ట్రంలో వరి సాగైన విస్తీర్ణం, దిగుబడి అంచనా ప్రకారం 40 లక్షల టన్నుల ధాన్యం సేకరించాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఇందులో సుమారు 5 లక్షల టన్నులు బాయిల్డ్ వెరైటీలు కొనుగోలు చేయనుంది. ఈ ఖరీఫ్‌లో 3,500 ఆర్బీకే క్లస్టర్ల ద్వారా 10,500 మంది సిబ్బంది భాగస్వామ్యంతో ధాన్యం సేకరిస్తారు. రైతుల నుంచి కొన్న ధాన్యాన్ని 1,670 మిల్లుల్లో మర ఆడిస్తారు. ఇందులో 53 బాయిల్డ్, 550 డ్రయర్ సౌకర్యాలున్న మిల్లులు ఉన్నాయి. వర్షాలకు ఎక్కడైనా ధాన్యం తడిస్తే రైతుకు నష్టం కలగకుండా దానిని కూడా కొని డ్రయర్ ఉన్న మిల్లులకు తరలిస్తారు. గోనె సంచులతోపాటు హమాలీలు, రవాణా సౌకర్యాలను కూడా ప్రభుత్వమే అందిస్తుంది. రైతులే గోనె సంచులు ఏర్పాటు చేసుకుంటే వాటికయ్యే ఖర్చును రైతు ఖాతాల్లో జమ చేస్తుంది. ధాన్యం తరలింపునకు 5 వేల ట్రక్కులను సిద్ధం చేస్తున్నారు. అవి నిర్దేశిత మిల్లులకు వెళ్లేలా జీపీఎస్, మొబైల్ ట్రాకర్ల ద్వారా పర్యవేక్షిస్తారు. బియ్యం ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించడంతో బయట మార్కెట్‌లో ధాన్యం కొనుగోళ్లు తగ్గి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ఎక్కువ మొత్తంలో ధాన్యం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఇలా లక్ష్యానికి మించి ధాన్యం వచ్చినా కొనడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కేంద్రంకంటే ముందే..

ఈ ఏడాది ఖరీఫ్ నుంచి బయోమెట్రిక్ ఆధారిత కొనుగోళ్లు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు సూచించింది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020–21 ఖరీఫ్‌లోనే పారదర్శక విధానంలో ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. అవకతవకలకు ఆస్కారం లేకుండా వెబ్‌ల్యాండ్, కౌలు రైతులకు ఇచ్చే పంట సాగు హక్కు పత్రాల (సీసీఆర్సీ కార్డులు) ఆధారంగా చేసిన ఈ క్రాప్ నమోదు ప్రకారమే కొనుగోళ్లు చేపడుతున్నారు. తద్వారా దళారులు, మిల్లర్ల మోసాలను అరికట్టి రైతులకు మద్దతు దక్కేలా చేస్తున్నారు. గతంలో దళారులు రైతుల నుంచి తక్కువ రేటుకు ధాన్యం కొని తిరిగి అదే రైతుల పేరుతో ప్రభుత్వానికి విక్రయించి మద్దతు ధరను కొట్టేసేవారు. ఇటువంటివి జరగకుండా ధాన్యం కొనుగోలు సమయంలో రైతుకు ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీఓ) సమయంలో ఆధార్‌ను తప్పనిసరి చేశారు. ధాన్యం నగదు చెల్లింపులను సైతం ఆధార్ సీడింగ్ కలిగిన రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు.

రైతులను మిల్లర్లు ఇబ్బంది పెట్టకుండా చర్యలు



ధాన్యం కొనుగోళ్ల సమయంలో మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా చర్యలు చేపడుతున్నాం. ఆర్బీకే పరిధి నుంచి ధాన్యాన్ని దూరంగా తీసుకెళ్లాల్సిన పని లేకుండా ఆ మండలంలోని మిల్లులను ట్యాగ్ చేస్తాం. ఇప్పటికే జిల్లాలవారీగా సేకరణ అంచనాలను రూపొందిస్తున్నాం. గోనె సంచుల విషయంలో ప్రత్యేక దృష్టి సారించాం. రైతులకు నగదు చెల్లింపు సమయంలో బయోమెట్రిక్ తీసుకుంటామని చెప్పారు.

– వీరపాండియన్, ఎండీ, పౌరసఫరాల సంస్థ

కస్టమ్ మిల్లింగ్‌పై పర్యవేక్షణ



ఇప్పటికే 1,474 మిల్లుల్లో సీసీ కెమెరాల ద్వారా కస్టమ్ మిల్లింగ్‌ను పర్యవేక్షిస్తున్నాం. మిల్లుల సామర్థ్యం ఆధారంగా సీఎంఆర్ కేటాయిస్తున్నాం. మిల్లుల్లో విద్యుత్ వినియోగం లెక్కలనుబట్టి కస్టమ్ మిల్లింగ్ జరిగిందా లేదా అంచనా వేస్తున్నాం. ఈ ఏడాది ఫిబ్రవరిలో 49, మార్చిలో 33, ఏప్రిల్‌లో 118, మే – జూన్‌లో 53 మిల్లుల్లో డీవియేషన్‌ను గుర్తించాం. ఇందులో 31 మిల్లులపై చర్యలు తీసుకున్నాం. మిగిలిన వాటిపై విచారణ జరుగుతోంది.

– హెచ్.అరుణ్‌కుమార్, కమిషనర్, పౌర సరఫరాల శాఖ

దళారులు, మిల్లర్ల అక్రమాలకు చెక్



ధాన్యం సేకరణలో దళారులు, మిల్లర్ల పాత్రను పూర్తిగా తొలగించేలా సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేశాం. గతేడాది ఖరీఫ్‌లో 6.39 లక్షల మంది రైతుల నుంచి రూ.7,222 కోట్లు విలువైన 35.36 లక్షల టన్నుల ధాన్యాన్ని కొన్నాం. ప్రస్తుత ఖరీఫ్‌లో 15.25 లక్షల హెక్టార్లలో వరి సాగవగా 80 లక్షల టన్నుల దిగుబడిని అంచనా వేస్తున్నారు. ఇందులో 40 లక్షల వరకు సేకరణకు ప్రాథమిక లక్ష్యంగా నిర్దేశించారు. దీనిని కస్టమ్ మిల్లింగ్ చేస్తే 28 లక్షల టన్నులకు పైగా బియ్యం వస్తుందని ఆశిస్తున్నాం. రైతులు మద్దతు ధరలో పైసా కూడా నష్టపోకుండా, ఆర్బీకేల్లోనే ధాన్యం విక్రయించేలా పటిష్ఠ చర్యలు చేపడుతున్నాం.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి



దేవుడు నాకు ఎత్తయిన కోటగా ఉన్నాడు.
నా బలమా! నిన్నే కీర్తించెదను.
- క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** శు.ఏకాదశి సా.5.21 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.2.51 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ప.1.01నుండి 2.34 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.38 నుండి 5.26 వరకు, **అమృతఘడియలు:** రా.10.12 నుండి 11.54 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఎన్. బీరెన్ సింగ్ (మణిపూర్ సీఎం) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇంఫాల్ నుండి ఢిల్లీలోని కృష్ణ మీనన్ మార్గ్‌లో ఉన్న అమిత్ షా నివాసానికి వెళ్లేందుకు ఏమంతగా సమయం పట్టలేదు.

అమిత్ షా నివాసం నుండి తిరిగి ఇంఫాల్ చేరుకోడానికే బాగా ఆలస్యమైపోయి, ఫ్లయిట్ దిగేటప్పటికి చీకటి పడిపోయింది.

చీకట్లో మణిపూర్‌ను చూడాలంటే ఈ మధ్య నాకు భయంగా ఉంటోంది! అమిత్ షాను కలిసి, తిరిగి ఇంఫాల్ వస్తున్నప్పుడు... "దేవుడా! చీకటి పడే లోపు మమ్మల్ని మణిపూర్ చేర్చు, అలా కాకున్నా మణిపూర్‌లో దిగగానే మంటలేమీ కనిపించకుండా చెయ్యి..." అని దారంతటా ప్రార్థిస్తూనే ఉన్నాను.

నాతో పాటు మంత్రులు రంజన్, గోవింద్ దాస్ ఉన్నారు. "అమిత్‌షాను మేమూ చూస్తాం..." అని అంటే వారిని కూడా ఢిల్లీ వెంట బెట్టుకెళ్లాను. "అమిత్‌షాను చూడటం ఏంటి?" అని నేను వారిని అడగలేదు. ఈ మధ్య నేను ఎవర్నీ ఏమీ అడగలేకపోతున్నాను.

"ఎలా వచ్చారు?" అని అడిగారు అమిత్‌షా... మేము వెళ్లగానే!

"చార్టర్డ్ ఫ్లయిట్‌లో వచ్చాం అమిత్‌జీ!" అని చెప్పాను.



"షెడ్యూల్డ్ ఫ్లయిట్స్ లేవా?" అన్నారు.

"ఉన్నాయి అమిత్‌జీ! అయితే జర్నీ మధ్యలో ఎమర్జెన్సీగా తిరిగి మణిపూర్ వెళ్లవలసి వస్తే సొంత ఫ్లయిట్ అయితే బెటర్ కదా అని... రానూపోనూ మాట్లాడుకున్నాం" అని చెప్పాను.

"రానూపోనూ ఎందుకు బీరెన్‌జీ! ఢిల్లీ వచ్చేటప్పుడు మణిపూర్‌లో ఎమర్జెన్సీ అయితే తిరిగి వెళ్లడానికి సరే, మణిపూర్‌కి వెళ్లేటప్పుడు తిరిగి ఢిల్లీ వచ్చే ఎమర్జెన్సీ ఏముంటుంది?" అన్నారు అమిత్‌షా.

"అంటే అమిత్‌జీ... మీకేదైనా గుర్తొచ్చి... ఫోన్‌లో కాకుండా పర్సనల్‌గా మీరేదైనా చెప్పాలనుకుంటే అప్పుడు ఢిల్లీకి రావడం ఎమర్జెన్సీ అవుతుంది కదా అని బీరెన్‌జీ అనుకుని ఉంటారు..." అన్నారు రంజన్!

"అవును అమిత్‌జీ అందుకోసమే రానూపోనూ ఫ్లయిట్ బుక్ చేసుకున్నాం..." అన్నారు గోవింద్ దాస్.

అమిత్‌షాను చూస్తాం అని వచ్చినవారు అమిత్‌షాతో మాట్లాడేశారు కూడా!

"అమిత్‌జీ! ఆయన రంజన్, ఈయన గోవింద్ దాస్..." అని పరిచయం చేశాను.

"కూర్చోండి..." అన్నారు అమిత్‌షా ఆ ఇద్దరికీ సోఫాలు చూపిస్తూ.

నాకు తను కూర్చొని ఉన్న సోఫా చైర్ పక్కన... ఇంకో సోఫా చైర్‌ను చూపించాక, "ఏమిటిలా వచ్చారు?" అన్నారు.

వస్తున్నట్లు ముందే చెప్పాం కదా అమిత్‌జీ అని అనలేకపోయాన్నేను. ఈ మధ్య నేను ఎవర్నీ ఏమీ అనలేకపోతున్నాను.

"ఆగస్టు 29న మాన్‌సూన్ సెషన్స్ పెట్టుకున్నాం అమిత్‌జీ..." అన్నారు రంజన్.

"29 నుంచా?" అన్నారు అమిత్‌షా.

"కాదు అమిత్‌జీ, 29 ఒక్కరోజే! ఆ రోజు కూడా ఎమ్మెల్యేలు రాలేమంటున్నారు. ఎవరు ఎప్పుడు ఎక్కడ మీద పడి మంటల్లోకి తోసేస్తారోనని భయపడుతున్నారు. రాజ్యాంగం ప్రకారం సెప్టెంబర్ 2 లోపు సెషన్స్ జరగాలి కాబట్టి ఆ ఒక్కరోజైనా మేడమ్ గవర్నర్ ఒప్పుకున్నారు కానీ... లేకుంటే నో అనేవారే..." అని చెప్పారు గోవింద్ దాస్.

"ఇంకా ఏంటి సంగతులు..?" అన్నారు అమిత్‌షా, ఆగస్టు 29 పెద్ద సంగతే కాదన్నట్లు!

"మణిపూర్‌లో శాంతి సామరస్యాలు నెలకొనడానికి మీరూ, మోదీజీ ఇస్తున్న గైడెన్స్ చక్కగా పని చేస్తోంది అమిత్‌జీ. అందుకు థ్యాంక్స్ చెబుదామని వచ్చాం..." అన్నాను.

"అయితే ఆ... శాంతి సామరస్యాలను కొనసాగేలా చూసే బాధ్యత మాత్రం మీదే..." అని నవ్వారు అమిత్‌షా. ఆ నవ్వు రిటర్న్ జర్నీలో నాకు బాగా అలసటను తెప్పించింది.

"బీరెన్‌జీ! వచ్చేశాం దిగండి. ఏమిటి ఆలోచిస్తున్నారు?" అంటున్నారు రంజన్, గోవింద్ దాస్!

ఇంఫాల్‌లో ఫ్లయిట్ దిగుతుండగానే ఆకాశంలోకి నాలుగు వైపులా చూశాను. మంటలేం ఎగిసి పడటం లేదు!!

అందిన 'మామ' అందరివాడా?



జనతంత్రం

వర్ధెల్లి మురళి

అంతర్జాతీయ యవనికపై మన జాతీయ పతాకం సమున్నతంగా రెపరెపలాడిన దృశ్యం. భరతమాత ముద్దుబిడ్డల హృదయాలు ఎందుకు ఉప్పొంగవు? ఆబాల గోపాలం ఆనంద తరంగిణిలో ఎందుకు ఓలలాడదు? ఉరుము ఉరిమితేనే, మెరుపు మెరిస్తేనే, ఆకసాన హరివిల్లు విరిస్తేనే బాల్యం మురిసిపోతుందట! అవన్నీ తనకోసమేనని గంతులేస్తుందట! ఊహలు ఊరడం మొదలైన తొలిరోజు నుంచీ బాల్యానికి కథలు చెప్పే పుస్తకం చందమామ. కలలకు రెక్కలు తొడిగే నేస్తం చందమామ. అలాంటి చందమామ మన చేతికందిన దృశ్యం పిల్లల్ని పరవశింపజేయకుండా ఉంటుందా? ఆ పారవశ్యం కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కనిపించింది. పిల్లలకూ, పెద్దలకూ ఎన్నెన్నో సైన్స్ పాఠాలను నేర్పింది. ఓ పిడికెడు మందికి కామర్స్ పాఠాలు, బిజినెస్ పాఠాలు కూడా నేర్పి ఉండవచ్చు. అయినా ఆ శుభదినాన్ని (ఆగస్టు 23) 'జాతీయ స్పేస్ డే'గానే ప్రధాని ప్రకటించారు.

చంద్రగోళాన్ని క్షేమంగా తాకిన నాలుగు దేశాల్లో ఇప్పుడు భారత్ ఒకటి. అంటే అంతరిక్ష విజ్ఞానంలో తొలి నాలుగు స్థానాల్లో మనకు చోటు దక్కింది. అందులో క్లిష్టమైన దక్షిణ ధ్రువ ప్రాంతాన్ని ఎంచుకొని దిగిన తొలి దేశంగా మన దేశం రికార్డులకెక్కింది. ఘన రూపంలో అపార జల నిక్షేపాలు, ఖనిజ సంపద ఈ ప్రాంతంలో ఉన్నాయని ఇప్పటికే శాస్త్రవేత్తలు నిర్ధారించారు. భూగోళం పుట్టిన తొలిరోజుల్లో అంగారకుడి పరిమాణంలో ఉండే పదార్థం ఒకటి దాన్ని ఢీకొట్టిందట! ఫలితంగా కొన్ని భూశకలాలు భూమి నుంచి వేరుపడి ఆ తర్వాత ఒకచోటకు చేరి చందమామగా ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బహుశా అందుకే భూమాతకు తోబుట్టువుగా భావించి మనం మేన మామగా పిలుచుకుంటున్నామేమో! ఇక్కడ జరిగే పరిశోధనల ఫలితంగా తొలిరోజుల నాటి భూగర్భ రహస్యాలపై అధ్యయనం చేయవచ్చు. ప్రాథమికంగా భూభౌతిక పదార్థమే గనుక, నీళ్లు కూడా ఉన్నాయని చెబుతున్నారు కనుక మానవ ఆవాస యోగ్యమైన పరిస్థితులు సృష్టించడం కష్టం కాదనే భావన ఏర్పడింది.

దక్షిణ ధ్రువ ప్రాంతంలో దిగడం సవాళ్లతో కూడుకున్నది కనుకనే గతంలో అమెరికా, రష్యా, చైనా దేశాలు ఈక్వెటార్ ప్రాంతంలోనే దిగాయి. అంతరిక్ష రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న రష్యా మన చంద్రయాన్–3 కంటే రెండు రోజుల ముందు ఇక్కడ దిగడానికి విఫలయత్నం చేసిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్ కూడా ఇటువంటి ప్రయత్నంలో విఫలమైంది. నాలుగేళ్ల కింద మన చంద్రయాన్–2 ప్రయత్నం చివరి క్షణాల్లో విఫలం కావడం ఈ విజయానికి గుణపాఠంగా ఉపయోగపడింది. ఇక దక్షిణ ధ్రువంపై కాలూనడానికి ప్రపంచంలోని మిగిలిన అంతరిక్ష సంస్థలు కూడా పోటీపడతాయి. 2025లో ఆర్టెమిస్ అనే వ్యోమనౌకను అమెరికా ప్రయోగించబోతున్నది. ఇద్దరు మనుషుల్ని కూడా ఈ ప్రయోగం ద్వారా అమెరికా దించబోతున్నది. వారు ఒకటి రెండు వారాలపాటు అక్కడ గడుపుతారు. తాత్కాలిక స్థావరాన్ని కూడా ఏర్పాటు చేయబోతున్నారు. పోర్చుగీసు నావికుడైన వాస్కోడాగామా ఐరోపా నుంచి భారత్‌కు సముద్ర మార్గాన్ని కనుగొన్నాడని మనకు తెలుసు. ఫలితంగా పోర్చుగీసు వారు అప్పటికి సుసంపన్న దేశంగా ఉన్న భారత్ నుంచి సుగంధ ద్రవ్యాలను కారుచౌకగా తరలించుకొని వెళ్లి వ్యాపారాల్లో బాగా లాభపడ్డారు. కామధేనువు లాంటి ఇండియాకు మార్గం తెలిసింది కనుక ఐరోపాలో అంతకంటే బలవంతుడైన బ్రిటిష్‌వాడు ప్రవేశించాడు. పోర్చుగీసు వారిని తరిమేసి కామధేనువు మూలుగల్ని పీల్చిపారేశాడు. తాజా కథ కూడా దాదాపు ఇలాంటిదే కావచ్చేమో!

అంతరిక్ష విజ్ఞానం శాస్త్ర జిజ్ఞాస దశను దాటి వాణిజ్య దశలోకి ప్రవేశించింది. అంతరిక్ష ప్రయోగాలు చేయగలిగే దేశాలకు ఇప్పుడు చేతినిండా 'ఆర్డర్లు'. కమ్యూనికేషన్లు తదితర అవసరాల కోసం అన్ని దేశాలూ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపించుకోవాలి. కొన్ని ప్రైవేట్ సంస్థలకు కూడా అటువంటి అవసరాలున్నాయి. ఇవి వన్‌టైమ్ ఆర్డర్లు మాత్రమే కాదు, నిరంతరం ఉండేవి. అంతరిక్ష ప్రయోగాల నైపుణ్యం ఉన్న దేశాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. అందులో చౌకగా పనిచేసి పెట్టే దేశం భారత్. ఫలితంగా భారత అంతరిక్ష మార్కెట్ రూ.70 వేల కోట్లకు చేరుకున్నది. ఇంకో పదిహేనేళ్లలో ఈ మార్కెట్ మూడున్నర లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ఇప్పుడు చంద్రయాన్–3 విజయంతో భారతదేశ సామర్థ్యం పట్ల నమ్మకం పెరిగింది. అతి తక్కువ ఖర్చుతో ఉపగ్రహాలను ప్రయోగించగలిగే దేశం భారత్ మాత్రమే!

భారత ఆధునిక అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ ఇస్రోలో మొదటి నుంచి పొదుపును ఒక అలవాటుగా తీర్చిదిద్దారని చెబుతారు. అందుబాటులో ఉన్న వనరులను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవడంతోపాటు, పూర్తి స్వదేశీ పరికరాలనే ఇస్రో ఉపయోగిస్తున్నది. ప్రపంచంలోని మిగిలిన స్పేస్ సెంటర్లలో పనిచేసే వారితో పోలిస్తే మన ఇస్రో సిబ్బంది జీతాలు చాలా తక్కువ. మన దేశంలో ఐటీ

> భారత ఆధునిక అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ ఇస్రోలో మొదటి నుంచి పొదుపును ఒక అలవాటుగా తీర్చిదిద్దారని చెబుతారు. అందుబాటులో ఉన్న వనరులను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకోవడంతోపాటు, పూర్తి స్వదేశీ పరికరాలనే ఇస్రో ఉపయోగిస్తున్నది. ప్రపంచంలోని మిగిలిన స్పేస్ సెంటర్లలో పనిచేసే వారితో పోలిస్తే మన ఇస్రో సిబ్బంది జీతాలు చాలా తక్కువ. మన దేశంలో ఐటీ ఉద్యోగులతో పోల్చినా కూడా బాగా తక్కువే. ప్రయోగం విజయవంతమైన సమయంలో టీవీ ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వారిని దేశ ప్రజలందరూ గమనించారు. సాధారణ మధ్యతరగతి కుటుంబీకుల్లాగానే వారి ఆహార్యం కనిపించింది. జీతాల్లో, జీవితాల్లోనే వారు మధ్యతరగతి. విజ్ఞానంలో, అంకితభావంలో, దేశభక్తిలో వారు అత్యున్నత తరగతికి చెందినవారని పదేపదే నిరూపితమవుతూ వస్తున్నది. రాంచీలో ఉన్న హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ (హెచ్‌ఈసీ) వాళ్లు చంద్రయాన్ కోసం రాకెట్ లాంచ్ ప్యాడ్‌ను తయారుచేసి ఇచ్చారు. ఇది కూడా ప్రభుత్వరంగ సంస్థే. బహుశా ప్రైవేటీకరణ లిస్టులో ఉందేమో! ఇక్కడ ఇంజనీర్లకూ, ఉద్యోగులకూ 17 నెలలుగా జీతాలు లేవు. అయినా సరే దేశం కోసం చేసే పనిని దైవకార్యంగా భావించి ఉద్యోగులు జీతాలపై పట్టుబట్టకుండా ఇచ్చిన కాంట్రాక్టును గడువు లోపల పూర్తిచేసి పెట్టారు. సాధారణ ఉద్యోగులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తల త్యాగం పెట్టుబడిగా ఇప్పుడు భారత్ లక్షలకోట్ల మార్కెట్‌కు వల వేసింది. తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు ఇప్పుడు భారత అంతరిక్ష మార్కెట్ విధానం. 'ఆదిపురుష్' సినిమా కంటే తక్కువ ఖర్చుతో చంద్రయాన్–3 అనేది నినాదం!

ఉద్యోగులతో పోల్చినా కూడా బాగా తక్కువే. ప్రయోగం విజయవంతమైన సమయంలో టీవీ ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వారిని దేశ ప్రజలందరూ గమనించారు. సాధారణ మధ్యతరగతి కుటుంబీకుల్లాగానే వారి ఆహార్యం కనిపించింది. జీతాల్లో, జీవితాల్లోనే వారు మధ్యతరగతి. విజ్ఞానంలో, అంకితభావంలో, దేశభక్తిలో వారు అత్యున్నత తరగతికి చెందినవారని పదేపదే నిరూపితమవుతూ వస్తున్నది. రాంచీలో ఉన్న హెవీ ఇంజనీరింగ్ కార్పొరేషన్ (హెచ్‌ఈసీ) వాళ్లు చంద్రయాన్ కోసం రాకెట్ లాంచ్ ప్యాడ్‌ను తయారుచేసి ఇచ్చారు. ఇది కూడా ప్రభుత్వరంగ సంస్థే. బహుశా ప్రైవేటీకరణ లిస్టులో ఉందేమో! ఇక్కడ ఇంజనీర్లకూ, ఉద్యోగులకూ 17 నెలలుగా జీతాలు లేవు. అయినా సరే దేశం కోసం చేసే పనిని దైవకార్యంగా భావించి ఉద్యోగులు జీతాలపై పట్టుబట్టకుండా ఇచ్చిన కాంట్రాక్టును గడువు లోపల పూర్తిచేసి పెట్టారు. సాధారణ ఉద్యోగులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తల త్యాగం పెట్టుబడిగా ఇప్పుడు భారత్ లక్షలకోట్ల మార్కెట్‌కు వల వేసింది. తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు ఇప్పుడు భారత అంతరిక్ష మార్కెట్ విధానం. 'ఆదిపురుష్' సినిమా కంటే తక్కువ ఖర్చుతో చంద్రయాన్–3 అనేది నినాదం!

లక్షల కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెట్టే కొత్త మార్కెట్ ఇది. న్యూ ఎకానమీ. కొత్త ఆర్థిక రంగానికి ద్వారాలు తెరిచినప్పుడు పరమ పవిత్రమైన పెట్టుబడిదారీ వ్యవస్థ సంప్రదాయాల ప్రకారం ముందుగా ప్రైవేట్ రంగం కుడికాలు మోపి లోపలికి ప్రవేశించాలి. అందుకు అనుగుణంగా మన అంతరిక్ష రంగాన్ని ప్రైవేటీకరించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించింది. సాంకేతిక నైపుణ్య అభివృద్ధికీ, పరిశోధనలకూ ఇస్రోను పరిమితం చేస్తారు కాబోలు! ఉపగ్రహాలు ప్రయోగించడం, ముందుముందు అంతరిక్ష, చంద్రగ్రహ టూరిజం అభివృద్ధి చెందితే వ్యోమ నౌకలను ప్రైవేట్ ట్రావెల్స్ పేరుతో నడపడం వంటివన్నీ ప్రైవేట్ చేతికి వెళ్తాయి. ఆవు శిరస్సు భాగం ప్రభుత్వ నిర్వహణలో ఉంటుంది. దానికి గడ్డి వేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. పొదుగు భాగం ప్రైవేట్‌కు వెళ్తుంది. పాలు పిండుకునే కర్తవ్యం వారిది. ముందుముందు ఈ రంగంలో భారీ పెట్టుబడుల అవసరం ఉంటుంది కనుక ప్రైవేట్‌రంగం ప్రవేశించక తప్పదని ప్రభుత్వం వాదన. ఇందుకు వారు 'నాసా'ను మార్గదర్శిగా ఎంచుకున్నారు.

భూగర్భంలోని ఖనిజాలు, చమురు–వాయువులు, భూమ్మీద కొండలు గుట్టలు, అడవులు, ఆకాశయానాలతో సహా అన్నిటా ఇప్పటికే ప్రైవేటు రంగం ప్రవేశించింది. స్పేస్ టెక్నాలజీ సృష్టించిన న్యూ ఎకానమీని కూడా ప్రైవేట్ రంగానికి అప్పగించాలా? మౌలిక రంగాల్లో, సంక్షేమ రంగాల్లో ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నది కదా! దీనికి డబ్బెక్కడి నుంచి రావాలి? మనం కట్టే పన్నులేనా? సాధారణ ప్రజలు పన్నులు కట్టాలి... బడాబాబులు బ్యాంకులు లూటీ చేయాలా? ఇదెక్కడి న్యాయం? ఇటువంటి సందేహాలు సగటు కుటుంబరావులకు సహజంగా కలుగుతుంటాయి. వారికి ఆర్థిక సూత్రాలు, వాటి లోతుపాతులు అర్థంకావు. అర్థం కాదు కాబట్టే దాన్ని ఆర్థిక శాస్త్రం అన్నారు. ప్రభుత్వాలకూ, పెట్టుబడులకూ సరిగ్గా అర్థమవుతాయి. లాభాలు ఏ రంగంలో వచ్చినా సరే దేశ జీడీపీ పెరుగుతుంది. అది పెరుగుతున్నకొద్దీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. తలసరి ఆదాయాలు పెరుగుతాయి, తలసరి విద్యుత్ వినియోగం పెరుగుతుంది. ఇటువంటి లెక్కలేవో చెబుతారు.

కార్మికులు, ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, శ్రామికులు, కష్టాలు, కన్నీళ్లు, దోపిడీ, పీడన, బ్యాంకుల లూటీ, ఎర్రజెండాలు, ధర్నా చౌకులు... వగైరా పదజాలాన్ని కాస్సేపు పక్కనబెడదాం. చంద్రయాన్–3 ప్రయోగ విజయం న్యూ ఎకానమీ వృద్ధికి తోడ్పడుతుందనేది నిర్వివాదాంశం. ఈ విజయం ఆర్థిక రంగానికి మాత్రమే పరిమితం కాలేదు. జీ–20 అధ్యక్ష హోదాలో ఉన్న సమయంలోనే వచ్చిన అవకాశం. దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తుంది. ఆర్థికరంగం, శాస్త్ర విజ్ఞాన రంగం, రక్షణ పాటవం... ఈ మూడు రంగాల్లో ఏ దేశం ఆధిపత్యం వహిస్తుందో అదే అగ్రరాజ్యం. ఈ మూడు రంగాల్లో కూడా ఇంచుమించు టాప్–5 లోకి భారత్ ప్రవేశించిన సూచనలు కనిపిస్తున్నాయి. మరో మూడు నాలుగేళ్లలో టాప్ త్రీలోకి చేరుతామని ప్రధాని చెబుతున్నారు. అందుకు చంద్రయాన్ విజయం లాంటివి ఉపకరిస్తాయి. అందుకే కాబోలు ఈ ప్రయోగం మీద ప్రధాని ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. 'బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొంటున్నప్పటికీ నా మనసంతా ఇక్కడే ఉంద'ని ఇస్రో శ్రేణులతో సంతోషాన్ని పంచుకున్నారు. ఇండియాకు వచ్చిన తర్వాత స్వయంగా ఇస్రో కేంద్రానికి వెళ్లి సిబ్బందిని అభినందించారు. ల్యాండర్ దిగిన ప్రదేశానికి 'శివశక్తి'గా నామకరణం చేశారు.

ప్రయోగాల ముందు పూజలు, దేవుళ్ల పేరుతో నామకరణాలు వగైరాల పట్ల అభ్యంతరం చెబుతున్నవారు కూడా తక్కువేమీ కాదు. మూఢ నమ్మకాలు సైన్స్ పురోగతికి ప్రతిబంధకాలే. కానీ మూఢ నమ్మకాలు వేరు, విశ్వాసాలు వేరు. ఈ సృష్టికి కారణమేమిటి? అనే ప్రశ్నకు సైన్స్ ఇప్పటికీ సంతృప్తికరమైన సమాధానాన్ని ఇవ్వలేదు. సైన్స్ ఆ సమాధానం చెప్పనంతవరకూ ఎవరి విశ్వాసం వారికుంటుంది. ఆ విశ్వాసాల మేరకు ప్రార్థనలూ, పూజలూ ఉంటాయి. కాకపోతే రాజ్యాంగబద్ధంగా మనది సెక్యులర్ దేశం కనుక ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎటువంటి పూజా విధానాలను అనుసరించాలి అనే అంశంపై ఆమోదయోగ్యమైన మార్గదర్శకాలు అవసరం. అంతరిక్షంతోపాటు సమస్త విజ్ఞానమంతా వేదాల్లోనే ఉన్నదని హిందూ చరిత్రకారులు ఢంకా భజాయిస్తారు. 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయట' అంటూ వారిని కొందరు వేళాకోళం చేస్తుంటారు. వేళాకోళం చేయవలసిన అవసరమయితే కనిపించడం లేదు. రుగ్వేద కాలం నాటికే మనకు అంతరిక్ష పరిజ్ఞానం ఉన్నది. ఈ విశ్వం అనంతమైనదని, ఎక్కడ మొదలైందో, ఎక్కడ అంతమవుతుందో తెలియదని ఖగోళ శాస్త్రం చెబుతున్నది. ఆది మధ్యాంత రహితమని వేదం కూడా చెప్పింది. విశ్వం ఆవిర్భవించడానికి కారణంగా బిగ్‌బ్యాంగ్ థియరీని శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. ఇది ఇరవయ్యో శతాబ్దం ప్రథమార్ధం నాటి సంగతి. అంతకంటే సుమారు నాలుగు వేల ఏళ్లకు పూర్వం రుగ్వేదంలోని నాసదీయ సూక్తం కూడా దాదాపు ఇదే ప్రతిపాదన చేసింది. 'హిరణ్యగర్భం'లో సంభవించిన బ్రహ్మాండ విస్ఫోటనం వల్ల నక్షత్ర మండలాలు ఏర్పడ్డాయని ఈ సూక్తం చెబుతున్నది. రుగ్వేద కాలం నాటికి అంతరిక్ష పరిజ్ఞానం ఉన్నదనే మాట కేవలం హిందూ చరిత్రకారులు మాత్రమే చెప్పడం లేదు. హేతువాది, బౌద్ధ మతావలంబి, కమ్యూనిస్టు ఆలోచనాపరుడైన మహాపండితుడు రాహుల్ సాంకృత్యాయన్ కూడా తన 'రుగ్వేద ఆర్యులు' పుస్తకంలో ఈ సంగతి నిర్ధారించారు.

విశ్వం మీద ప్రసిద్ధ రచనలు చేసిన కార్ల్ సేగన్ అభిప్రాయం ప్రకారం ఆధ్యాత్మికతకూ, సైన్స్‌కూ వైరుధ్యం లేదు. పైగా ఆధ్యాత్మిక ఆలోచనలకు సైన్స్ గొప్ప ప్రేరణ కూడా! మనకు దృగ్గోచరమైన జగత్తులో సూర్యుడు ప్రసరించే కోటానుకోట్ల కిరణాల్లో ఒక కిరణం వెదజల్లే అనంతకోటి ధూళి రేణువుల్లో ఒకదాన్ని చూడండి. అదే మన ఇల్లు. అక్కడే మన చరిత్ర. మన సంస్కృతి. అక్కడే రాజులూ–రాజ్యాలు, నాగరికత నిర్మాతలు – విధ్వంసకులు, ప్రేమలు – పగలు, తల్లీదండ్రీ, ఆనందాలు – ఉద్వేగాలు, కష్టాలు–కన్నీళ్లు, మతాలు–ప్రార్థనలు, నీతులు చెప్పే పంతుళ్లు – అవినీతి గోతులు తీసే నాయకులు, సూపర్ స్టార్లు – సుప్రీమ్ లీడర్లు, సాధువులు – పాపులు... అన్నీ.. అందరూ అక్కడే ఆ ధూళి రేణువుపైనే అంటాడు. సూర్యకాంతిలోని ఓ ధూళి రేణువంత భూగోళంలో ఉన్న మనం ఈ అనంత విశ్వాసాన్ని ఎప్పుడు ఎట్లా అర్థం చేసుకోవాలి!

మహా అయితే ఇంకో వందేళ్లకో, రెండొందల ఏళ్లకో మనం ఈ భూమిని ఖాళీ చేయవలసిందే! ఆ తర్వాత ఇంకెంతమాత్రం భూగోళం ఆవాసయోగ్యం కాదని స్టీఫెన్ హాకింగ్ చేసిన హెచ్చరిక పదేపదే చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. అంతగా ధ్వంసం చేశారు భూదేవిని! 'సముద్రవసనే దేవీ, పర్వతస్తన మండలే, విష్ణుపత్నీ నమస్తుభ్యం, పాదస్పర్శం క్షమస్వమే' అని పూజించిన భూమిని కొందరు స్వార్థం కోసం పీల్చి పిప్పిచేశారు. దురాశతో, కక్కుర్తితో, కండూతితో నిస్సారంగా మార్చారు. అందువల్ల మరో గ్రహాన్వేషణ తప్పదట! మరో గ్రహంలో తలదాచుకోకపోతే మానవజాతి అంతరించిపోక తప్పదట. అదిగో అందుకోసం కూడా ఈ చంద్రయానం తప్పనిసరి. ఇది మొదటి అడుగు.

చందమామపై నివాసంతోపాటు దాన్ని అంతరిక్ష గేట్‌వేగా ఉపయోగించుకొని అంగారక గ్రహానికి (మార్స్) వలస పోవాలని ప్రయత్నాలు ప్రారంభమవుతున్నాయి. ఈ 'స్పేసి'నేని ట్రావెల్స్ ప్రభుత్వరంగంలో కాక ప్రైవేట్‌రంగంలో ఉండబోతున్నది కనుక ప్రయాణం చేయగలిగినవాడు కోటీశ్వరుడై ఉండాలి. యుగాంతంపై తీసిన '2012' సినిమా గుర్తుకొస్తున్నది. సౌరతాపం వల్ల భూకేంద్రకం వేడెక్కి సముద్రాలు ఉప్పొంగుతాయని హెచ్చరికలు వస్తాయి. కొన్ని దేశాలు కలిసి బలిష్ఠమైన పడవల్లాంటి ఆశ్రయాలను హిమాలయాలపై నెలకొల్పుతాయి. వీటిలో 40 లక్షల మందే పడతారు. వారంతా ఖరీదైన టిక్కెట్లు కొనుక్కొని ప్రాణాలు కాపాడుకుంటారు. మిగిలిన 700 కోట్ల జనాభా మునిగిపోతుంది. 'టైటానిక్' సినిమా కూడా అంతే కదా! పడవ మునగబోతున్నది, లైఫ్ బోట్లలో 700 మందే పడతారు. పెద్దటిక్కెట్లు కొన్నవారిని క్షేమంగా లైఫ్ బోట్లలో తరలిస్తారు. పేద టిక్కెట్ల బ్యాచ్ 1,500 మంది జలసమాధి అవుతారు. భూ విధ్వంసానికి ఎవరైతే కారకులయ్యారో వారే స్పేస్ ట్రావెల్స్ టిక్కెట్లు కొనుక్కొని బతికి బయటపడవచ్చు... కొనలేని వారి పరిస్థితి? 'మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది, పదండి ముందుకు పదండి తోసుకు' అంటూ శ్రీశ్రీ శ్రామిక లోకానికి పిలుపునిచ్చారు. ఇంకో వందేళ్లకు సంపన్నులందరూ తోసుకుంటూ దూసుకుంటూ మరో ప్రపంచానికి వెళ్తారు కాబోలు! చందమామా నువ్వు అందరివాడివా? కొందరివాడివా?

vardhelli1959@gmail.com

జాతీయోద్యమ కెరటాలు నాటి తెలుగు పత్రికలు



విశ్లేషణ

వి.వి. రమణ

భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికలు గణనీయమైన పాత్ర పోషించాయి. 'వందేమాతరం' ఉద్యమం నుండి 'క్విట్ ఇండియా' ఉద్యమం దాకా సుమారుగా నాలుగు దశాబ్దాల పాటు స్వాతంత్ర్య ఉద్యమ బాటలో నడిచాయి. మొదట్లో మత పరమైన పత్రికలు తెలుగునేలపై ఆవిర్భవించాయి. వీరేశలింగం పంతులు 1874లో 'వివేక వర్ధని' పత్రికను వెలువరించడంతో తెలుగు సమాజంలో నూతన శకం ఆరంభమైంది. 20వ శతాబ్దం ప్రారంభం నాటికి తెలుగు పత్రికా రంగం వికాస దశను అందుకుంది. ఈ దశలో అవి ప్రజల్లో ఒక వంక ఆంధ్రాభిమానాన్నీ, మరో వంక జాతీయ భావాన్నీ పెంపొందించాయి.

కొండా వెంకటప్పయ్య వంటి దేశభక్తుల కృషి ఫలితంగా 'కృష్ణా జిల్లా సంఘం' ఆధ్వర్యంలో మచిలీ పట్నంలో నెలకొన్న 'కృష్ణా పత్రిక' (1902) తెలుగు పత్రికా రంగంలో ఒక మైలు రాయిలా నిలిచింది. ముట్నూరి కృష్ణారావు దీని ప్రధాన సంపాదక బాధ్యతలను చేపట్టి జాతీయోద్యమానికి సంబంధించిన వ్యాసాల ద్వారా ఆంధ్రుల్ని ఉత్తేజితుల్ని చేశారు. తెలుగు ప్రాంతంలో కాశీనాథుని నాగేశ్వరరావు స్థాపించిన 'ఆంధ్ర పత్రిక' కూడా (1908) జాతీయ ఉద్యమంలో భాగస్వామి అయింది. బోడి నారాయణరావు, పింగళి లక్ష్మీనారాయణలతో కలిసి గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1908లో బెజవాడ నుండి 'స్వరాజ్య' వార పత్రికను ప్రారంభించారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా రచనలు చేశారని ఈయనకు మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించారు. ఒక రచనతో జైలు పాలైన మొదటి దక్షిణాది వ్యక్తి గాడిచర్ల.

1923లో 'ఆంధ్ర పత్రిక', 'కృష్ణా పత్రిక', 'కాంగ్రెస్' వంటి పత్రికలు నిషేధానికి గురైనాయి. 1925లో 'మాతృసేవ', 'పశ్చిమాంధ్ర', 'శారద', 'స్వధర్మ', 'స్వతంత్ర' పత్రికలకూ అదే గతి పట్టింది. కమ్యూనిస్టు పార్టీని నిషేధించక ముందు గద్దె లింగయ్య కృష్ణా జిల్లా నుండి 'ప్రభ' పత్రిక తొలి సంచికను 1935లో విడుదల చేశారు. అయితే అది బ్రిటిష్ వారు విధించిన రూ. 8,000 జరిమానా చెల్లించలేక మూతపడింది. సోషలిస్ట్ పార్టీ తరపున 'నవశక్తి' పత్రిక అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో వెలువడింది. ఆ తర్వాత దీనిని పుచ్చలపల్లి సుందరయ్య, చంద్రశేఖరరావు, మరికొంతమంది కలిసి నడిపారు. రెండవ ప్రపంచ యుద్ధం మొదలైనప్పుడు 'నవశక్తి' పత్రికను కూడా బ్రిటిష్ వారి కఠిన నిర్ణయాల వలన ఆపివేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

'గోల్కొండ పత్రిక' ద్వారా సురవరం ప్రతాపరెడ్డి జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు. నరసింహారావు 'రయ్యత్' దినపత్రిక ద్వారా ఉద్యమంలోకి వచ్చారు. గద్దె లింగయ్య 'ప్రభ' పత్రిక, మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో 'నవశక్తి', కాశీపట్నం



కొండయ్య 'వీరభారత్' పోషించిన పాత్ర అమోఘం. కాంద్రేగుల రామచంద్రారావు, చుండ్రుపట్ల హనుమంతరావు తమదైన శైలిలో పత్రికల ద్వారా ప్రజలను ఉత్తేజ పరుస్తూ ఉద్యమాన్ని నడిపారు. ప్రకాశం పంతులు 'స్వరాజ్య' ఆంగ్ల దినపత్రిక ప్రజలను ఉద్యమం వైపు నడిపించింది. అంతేకాదు పప్పూరు రామాచార్యులు 1922లో మిత్రుల సహాయంతో 'పినాకిని' పత్రికను అనంతపురంలో ప్రారంభించారు. దీనితో పాటే 'శ్రీసాధన' పత్రికను కూడా నడిపారు. ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక, శ్రీసాధన పత్రికలతో తాము బలవంతులమయ్యామని స్వయంగా వావిలాల గోపాలకృష్ణయ్య అన్నారు. సర్కారులో కొండా వెంకటప్పయ్య, రాయలసీమలో పప్పూరు రామాచార్యులు, తెలంగాణలో మాడపాటి హనుమంతరావు ముఖ్యులుగా ఉన్నారని కూడా వావిలాల చెప్పారు. ఇక ముట్నూరి కృష్ణారావు, కాశీనాథుని నాగేశ్వరరావు, కందుకూరి వీరేశలింగం – ఈ ముగ్గురిని కలిపితే సురవరం ప్రతాపరెడ్డి అవుతారని అనుకునే వాళ్లు. ఆంధ్ర, కృష్ణా పత్రికలను కలిపితే 'గోల్కొండ పత్రిక' అవుతుందని కూడా!

'జన్మభూమి' పత్రిక కోసం రాసిన వ్యాసం కారణంగా నార్ల వెంకటేశ్వరరావును పోలీసులు చితక బాదారు. గాడిచర్ల హరి సర్వోత్తమరావు, ఖాసా సుబ్బారావు, కోటంరాజు రామారావు, పప్పూరు రామాచార్యులు కఠినమైన జైలు శిక్షలు అనుభవించారు. అనిబీసెంట్ అరెస్టును 'దేశమాత' పత్రికలో ఖండించారని చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుకు వెయ్యి రూపాయల అపరాధ రుసుము విధించారు. ఆ యా పత్రికలు దేశకాల పరిస్థితులకు అనుగుణంగా తెలుగువారి మనోభావాల్ని మలచడంలో చరిత్రాత్మక పాత్రను పోషించాయి. అనేకమంది పత్రికా సంపాదకులు తమ శక్తికి మించి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు.

వ్యాసకర్త ఉపాధ్యాయుడు

క్లుప్తంగా...

విశాఖలో శబరిమల సమాచార కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అనంతగోపన్

సీతంపేట (విశాఖ ఉత్తరం): శబరిమల ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ఆధ్వర్యంలో దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి సమాచార కేంద్రం విశాఖపట్నంలోని శంకరమఠంలో ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు, అడ్వొకేట్ అనంతగోపన్ శనివారం ప్రారంభించారు. అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ సహకారంతో శంకరమఠం ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ఒప్పందంతో ఈ సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్టు అనంతగోపన్ తెలిపారు. వసతి గదులు, వర్చువల్ క్యూలైన్, పూజలు, కైంకర్యాలు, ప్రత్యేక కార్యక్రమాలు తదితర సమాచారం ఈ కేంద్రంలో లభిస్తుందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రాంతాల్లో సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వెలమల సిమ్మన్నకు జీవిత సాఫల్య పురస్కారం

- 29న ప్రదానం చేయనున్న ఏపీ అధికార భాషా సంఘం



దొండపర్తి: బహుగ్రంథకర్త, ప్రముఖ భాషా శాస్త్రవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రొఫెసర్ వెలమల సిమ్మన్నను ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించనుంది. తెలుగు భాషా వారోత్సవాల్లో భాగంగా తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా ఈ నెల 29న విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో సిమ్మన్నను సత్కరించనున్నారు. ఆయన ఇప్పటి వరకు 85 రచనలు చేసి 45 వరకు అవార్డులు, పురస్కారాలు, బిరుదులు అందుకున్నారు.

'ఏకలవ్య'సాంస్కృతిక సంబరాలు ప్రారంభం



సాంస్కృతిక సంబరాలను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకర్రావు

అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ రూరల్ మండలంలోని యండపలివలస ఏకలవ్య పాఠశాల ప్రాంగణంలో శనివారం రాష్ట్ర స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ నాలుగవ సాంస్కృతిక సంబరాలు ప్రారంభమయ్యాయి. వీటిని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. క్రీడా సంబరాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 28 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈఎంఆర్ఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రమణమూర్తి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమ చక్రవర్తి, అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి శనివారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

బాబు, రామోజీ వక్రీకరిస్తే అబద్ధాలు నిజాలైపోవు

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): నీతి, నిజాయతీతో రాజకీయాలు చేస్తున్నాను కాబట్టే జనం తనకు ఓట్లేసి గెలిపిస్తున్నారని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. తానేంటో తన ప్రజలందరికీ తెలుసన్నారు. చంద్రబాబు, రామోజీరావులు వక్రీకరించినంత మాత్రాన అబద్ధాలు నిజాలు కావని చెప్పారు. వారి మాదిరిగా తాను అవినీతి, అక్రమాలు చేసి బతకడం లేదన్నారు. తనపై బురదజల్లేలా అబద్ధపు రాతలు రాస్తే ప్రజలు నమ్మబోరని తెలిపారు. తన వ్యాపార దృక్పథాన్ని అర్థం చేసుకోకుండా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీకాకుళంలోని కత్తెరవీధిలో శనివారం మంత్రి ధర్మాన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నగరాభివృద్ధికి నిరంతరం ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబు ఈ ప్రాంత అభివృద్ధికి, ప్రజలకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ ఏం చేశారో రాష్ట్రంలో ఎవరిని అడిగినా చెబుతారన్నారు.



ఉనికి కోల్పోతున్న బొక్కు సొర చేప

సాక్షిప్రతినిధి, కాకినాడ: సముద్ర కాలుష్య నివారణలో కీలక పాత్ర పోషించే బొక్కు సొర చేప కాలక్రమేణా ఉనికిని కోల్పోతోంది. వేల్ షార్క్‌గా పిలిచే ఈ చేప 'రిన్ కో డాంటిడే' జాతికి చెందింది. ఏళ్ల సంవత్సరాల కిందట డైనోసార్‌లతో సముద్ర జలాల్లో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన అతి ప్రాచీన సముద్ర జీవిగా ప్రసిద్ధి. 65 కోట్ల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ సాధు జీవి మనుగడ కోసం ప్రస్తుతం పోరాడుతోంది.

ఈ జీవి ప్రపంచవ్యాప్తంగా 20వేల వరకు ఉండగా ప్రస్తుతం 10 వేలకు తగ్గిపోయనట్లు 'ఐయూసీఎన్(ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) తన నివేదికలో పేర్కొంది. అలాగే తన నివేదికలో ఇది అంతరించిపోతున్న జాతుల్లో ఒకటిగా రెడ్‌బుక్‌లో పేర్కొంది.

నిశ్శబ్ద జలాల్లోనే నివాసం..

ఈ చేపలు నిశ్శబ్దంగా ఉండే సముద్ర జలాల్లోనే ఉండటానికి ఇష్టపడతాయి. ఎప్పుడైన ఓడలు, బోట్లు ఫ్యాన్‌లు తగిలితే తప్ప బయటకు వచ్చే అవకాశం లేదు. చూస్తే భయంతో వణికిపోయేలా భారీ ఆకారంతో తిమింగలానికి నాలుగు రెట్లు అధికంగా ఉండే వేల్ షార్క్(బొక్కు సొర) ఎవరికీ ఏ హాని తలపెట్టదు. ఈ చేపలు 13 మీటర్లు(42 అడుగులు) పొడవు, 20 నుంచి 25 మెట్రిక్ టన్నుల బరువుతో భారీ ఆకారంతో ఉంటాయి. ప్రపంచంలోనే అతి పెద్ద చేపగా వేల్‌షార్క్‌కు పేరుంది. తీరం నుంచి 50 నుంచి 60 కిలో మీటర్లు (డీప్‌సీ) దూరంలో సముద్రంలో సుమారు ఐదు కిలోమీటర్ల లోతులో ఇవి ఉంటాయి. సముద్ర ఉపరితలంపై ఎక్కడా కనిపించవు. లోతు జలాల్లో ఉండే అరుదైన జలచరం ఇది.

రెండేళ్ల కిందట విశాఖలో ప్రత్యక్షం

ఈ చేప చమురు, మాంసం, రెక్కలు, అంతర్జాతీయంగా వాణిజ్య విలువలతో మంచి డిమాండ్ ఉంది. ఉష్ణ మండలం, సమశీతోష్ణ సముద్ర జలాల్లో కనిపిస్తుంటాయి. సేనిగల్ నుంచి గునియా, న్యూయార్క్ నుంచి కరేబియన్, మెక్సికో నుంచి టోంగా, తూర్పు ఆఫ్రికా నుంచి థాయిలాండ్, ఎర్ర సముద్రం, యూఎస్‌ఏ, అరేబియన్, గల్ఫ్, జపాన్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, పిలిపీన్స్ సముద్ర జలాల్లో ఇవి విస్తరించి ఉన్నాయి. దేశంలో గుజరాత్, తమిళనాడు, ఒడిశాతో పాటు మన రాష్ట్రంలోని విశాఖ, నెల్లూరు, ఉప్పాడ, కోనపాపపేట, కాకినాడ కుంభాభిషేకం, భైరవపాలెం తదితర తీరప్రాంతాల్లో వేట సమయంలో సముద్రంలో మత్స్యకారులకు కనిపిస్తుంటాయి. రెండేళ్ల కిందట విశాఖబీచ్‌కు వచ్చిన బొక్కు సొరను రక్షించి తిరిగి సముద్రంలో విడిచిపెట్టారు.

వేల్‌షార్క్ సంరక్షణపై అవగాహన..

గతంలో ఈ చేపలను చూసి భయంతో వేటకు వెళ్లే మత్స్యకారులు చంపేసేవారు. అటవీశాఖ వన్యప్రాణి విభాగం కల్పిస్తోన్న అవగాహనతో తీర ప్రాంతంలో కొంతవరకు సత్ఫలితాలన్నిస్తున్నాయి. తూర్పు తీరంలో పరిరక్షణ కోసం వన్యప్రాణి సంరక్షణ విభాగం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. వేల్‌షార్క్ సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా తూర్పు తీరంలోని మత్స్యకార గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం, అవగాహన కార్యక్రమాలు ప్రారంభించి ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తోంది.

నేరుగా పిల్లలను పెట్టే ఒకే ఒక చేప..

దక్షిణాఫ్రికా తీరంలో మొట్టమొదటిసారి ఈ తిమింగలం సొరను డాక్టర్ ఆండ్రూ స్మిత్ గుర్తించాడు. 70 నుంచి 100 సంవత్సరాల జీవితకాలం కలిగిన ఈ చేపలు లైంగిక పరిపక్వతకు రావడానికి 30 సంవత్సరాలు పడుతుంది. సహజంగా చేపలన్నీ గుడ్లు పెట్టి చేప పిల్లలుగా రూపాంతరం చెందుతాయి. కానీ బొక్కు సొర మాత్రం నేరుగా పిల్లలను పెడుతుంది. అదీ కూడా రెండు, మూడు చేప పిల్లలను మాత్రమే పెట్టడం ప్రత్యేకం. ఇది గుడ్లు పెట్టినా బయటకు రిలీజ్ చేయదు. తన అంతర్భాగంలోనే దాచుకుంటుంది. ఒకేసారి 200-300 గుడ్లు వరకు పెడుతుంది. 2-3 ఏళ్ల అనంతరం నేరుగా పిల్లల రూపంలో బయటకు వదులుతుంది.

ఫైటో ప్లాంటాన్స్ అనే మొక్కలే ఆహారం..

సముద్ర కాలుష్యాన్ని తగ్గించడంలో ఈ చేపలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. ఫైటో ప్లాంటాన్స్(సృష్టిలో మొదటిగా వచ్చాయి) అనే మొక్కలను పోలిన జీవులను ఆహారంగా తీసుకుంటాయి. ఫైటో ప్లాంటాన్స్ ఎక్కువగా పెరిగితే సముద్రంలో పైకి తెట్టులా పెరిగిపోయి ఆక్సిజన్ తగ్గిపోయే ప్రమాదం ఉంది. ఈ బొక్కు సొర దానిని తినడం వల్ల సముద్రంలో ఫైటో ప్లాంటాన్స్ పెరగకుండా సముద్ర కాలుష్యాన్ని తగ్గిస్తోంది. సముద్రంలోని సూక్ష్మ మృత జీవరాశులు, సముద్రకాలుష్యాన్ని శుద్ధి చేయడంలో ముఖ్య భూమిక పోషిస్తుంటుంది.

పులులతో సమాన హోదా...



వన్యప్రాణి పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బొక్కు సొర చేపను పరిరక్షిస్తున్నాం. గత కొన్నేళ్లుగా తీర ప్రాంత ప్రజల్లో, మత్స్యకారుల్లో అవగాహన కల్పిస్తున్నాం. అడవుల్లో ఉండే పులులకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామో అంతే ప్రాధాన్యం బొక్కు సొరకు ఇస్తున్నాం. బొక్కు సొరను చంపినా, శరీర భాగాలను విక్రయించినా వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 సెక్షన్ 50, 51 ప్రకారం ఏడేళ్ల జైలు శిక్ష, అధిక మొత్తంలో జరిమానా విధిస్తాం.

– ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వన్యప్రాణి విభాగం

జగనన్న పాలనలోనే బహుజనులకు న్యాయం

1,063వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: కుల, మత, ప్రాంతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తూ.. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్న జగనన్న పాలనలోనే బహుజనులకు న్యాయం జరుగుతుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,063వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పలువురు మాట్లాడారు. భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా మహిళలకు పెద్దపీట వేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను ప్రాధాన్యతా పదవుల్లో నియమించిన ఘనత జగన్‌కే దక్కుతుందని తెలిపారు. రాజధానిపై ఈనాడు విషప్రచారం చేయడం సిగ్గుచేటని, 5 సంవత్సరాలు అధికారమిస్తే కనీసం రైతులకు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేని బాబు.. ఇప్పుడు అమరావతిని అడ్డుపెట్టుకుని దొంగ రాజకీయాలకు దిగడం సిగ్గుచేటన్నారు. రామోజీకి దమ్ముంటే తన చిట్‌ఫండ్ సంస్థలో జరిగిన మోసాలపై రాసుకోవాలని, ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాలపై తప్పుడు రాతలు రాస్తే ప్రజలు క్షమించరని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. మూడు రాజధానులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, పులి దాసు, కుంట రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ఏకీకరణతో సుస్థిరాభివృద్ధి

జీ-20 దేశాల సాంస్కృతిక శాఖల మంత్రుల సమావేశంలో కిషన్‌రెడ్డి

వారణాసి నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి: సాంస్కృతిక ఏకీకరణ ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకుంటూనే, ప్రపంచంలోని భిన్న సంస్కృతులను కాపాడుకునే దిశగా జీ 20 దేశాల సాంస్కృతిక శాఖల మంత్రుల సమావేశం కాశీ కల్చరల్ పాత్‌వేకు ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. కాశీలో మూడు రోజులపాటు జరిగిన జీ20 దేశాల సాంస్కృతిక శాఖల మంత్రుల సమావేశాలు శనివారంతో ముగిశాయి. ప్రపంచంలోని వైవిధ్యమైన సంస్కృతి మనందరినీ కలుపుతుందని సమావేశంలోని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా భారత కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి తన సహచర దేశాల మంత్రులను ఉద్దేశించి మాట్లాడుతూ...అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చే శక్తి సంస్కృతి, సంప్రదాయాలకే ఉందన్నారు. 'కల్చర్ యునైట్స్ ఆల్' అని వ్యాఖ్యానించారు. భిన్న ప్రాంతాల్లో భిన్న సంస్కృతుల నిలయమైన భారతదేశం 'భిన్నత్వంలో ఏకత్వాన్ని' ప్రదర్శిస్తున్నట్లే.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సాంస్కృతిక వైవిధ్యత అన్ని దేశాలను ఒకేతాటిపైకి తీసుకొచ్చేందుకు, ఒకరినొకరు సంస్కృతి, సంప్రదాయాలను మరొకరు గౌరవించుకునేందుకు వీలవుతుందన్నారు. యావత్ మానవాళిని ఏకం చేసే విషయంలో సంస్కృతి కీలకపాత్ర పోషిస్తోందని, విలువలు, భాషలు, కళలు మొదలైనవి దేశాలు, ప్రజల మధ్య సత్సంబంధాలకు బాటలు వేస్తాయని మంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ సమావేశానికి ఒకరోజు ముందు జరిగిన నాలుగో వర్కింగ్ గ్రూప్ సమావేశంలోనూ ఈ అంశాలపై మరింత విస్తృతమైన చర్చ జరిగిందని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశాల్లో చర్చించిన అంశాల ఆధారంగా 'కాశీ కల్చరల్ పాత్‌వే'కు రూపకల్పన జరిగిందని ఆయన వెల్లడించారు. రోమ్ డిక్లరేషన్, బాలి డిక్లరేషన్‌లలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు అంశాలు, సభ్యుల అభిప్రాయాల ఆధారంగానే 'కాశీ కల్చరల్ పాత్‌వే'ను రూపొందించినట్లు కిషన్ రెడ్డి వివరించారు.

కాశీ కల్చరల్ పాత్‌వే'లోని కొన్ని ముఖ్యాంశాలు...

- సాంస్కృతిక ఆస్తులకు పునర్వైభవాన్ని కల్పించడం, వాటిని ఆయా దేశాలకు తిరిగి అప్పగించడం ద్వారా సామాజిక న్యాయంతోపాటు నైతిక విలువలకు పట్టం గట్టాలని నిర్ణయించారు. • సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు సంస్కృతి, సంప్రదాయాలకు ఉన్న శక్తి, సామర్థ్యాలను గుర్తెరిగి సరైన ప్రాధాన్యత కల్పించాలి. • సంస్కృతికి, పర్యావరణ పరిరక్షణకు మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తిస్తూ.. మారుతున్న వాతావరణ పరిస్థితులకు సరైన పరిష్కారాలను కనుగొనడం. • అన్ని సభ్యదేశాల మధ్య సమయానుగుణంగా చర్చలు జరుపుతూ.. అందరినీ భాగస్వాములను చేస్తూ ముందుకెళ్లడం.
- ఈ సమావేశంలో పాల్గొన్న సాంస్కృతిక శాఖ మంత్రులు.. ఆయా దేశాలకు ప్రతినిధులుగానే కాకుండా.. ఆయా దేశాలలో సాంస్కృతిక సంరక్షకులుగా ప్రపంచ సాంస్కృతిక పరిరక్షణకు ఏకతాటిపైకి వచ్చి పని చేయాలి.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

- జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మన ఆస్పత్రుల్లో వసరులు
- విశాఖ ఛాతీ, మానసిక ఆస్పత్రులకు ఎన్ఏబీహెచ్ గుర్తింపు
- రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆస్పత్రుల్లో జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వసరులు కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే విశాఖపట్నంలోని ఛాతీ, మానసిక ఆస్పత్రులకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్‌హాస్పిటల్స్,హెల్త్‌కేర్‌ప్రొవైడర్స్(ఎన్ఏబీహెచ్) గుర్తింపు దక్కినట్లు పేర్కొంది. ఈ గుర్తింపు 2027 ఆగస్టు నెల వరకు ఉంటుందని తెలిపింది. సుమారు 10 చాప్టర్లు, 100 ప్రమాణాలు, 503 లక్ష్యాలతో పనిచేస్తున్న ఆస్పత్రులు ఎన్ఏబీహెచ్ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకుంటాయని, తనిఖీల అనంతరం వాటికి గుర్తింపు మంజూరు చేస్తారని వివరించింది. మన ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందాలని సీఎం వైఎస్ జగన్ పలుమార్లు అధికారులను ఆదేశించారని, అందుకు తగ్గట్టుగా వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల నుంచి బోధనాస్పత్రుల వరకూ అన్నిచోట్ల నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాష్) ప్రమాణాలను పాటిస్తున్నామని తెలిపింది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు 537 పీహెచ్‌సీలు, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఇతర ఆస్పత్రులు ఎన్‌క్వాష్ గుర్తింపు పొందినట్లు పేర్కొంది. 2023-24 సంవత్సరానికి 2,956 ఆస్పత్రులకు ఎన్‌క్వాష్ గుర్తింపు లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టంచేసింది. 2022-23 సంవత్సరంలో దేశంలో 2,041 ఆస్పత్రులకు ఎన్‌క్వాష్ గుర్తింపు లభించగా, అందులో ఏపీ నుంచి 18 శాతం ఉన్నాయని వెల్లడించింది.

అరుదైన వ్యాధికి అద్భుత చికిత్స

- విజయవాడ జీజీహెచ్ వైద్యుల ఘనత
- జీబీ సిండ్రోమ్‌తో నడవలేని స్థితిలో ఆస్పత్రిలో చేరిన బాలుడు
- రూ.3.60 లక్షలు వెచ్చించి ఇంజక్షన్ల కొనుగోలు
- నాణ్యమైన వైద్యంతో పూర్తిగా కోలుకున్న చిన్నారి



కోలుకున్న బాలుడితో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్, పిడియాట్రిక్ వైద్యులు అనిల్, సునీత

లబ్బీపేట(విజయవాడతూర్పు): అరుదైన గిలియన్ బ్యారీ సిండ్రోమ్(జీబీ సిండ్రోమ్) వ్యాధి సోకిన 12 ఏళ్ల బాలుడికి విజయవాడ ప్రభుత్వాస్పత్రి(జీజీహెచ్) వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. ఖరీదైన వైద్యాన్ని రూపాయి ఖర్చు లేకుండా అందించి బాలుడికి స్వస్థత చేకూర్చడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్ కథనం మేరకు.. ఏలూరు జిల్లా నూజివీడు కొత్తపేటకు చెందిన నాగభూషణం, మౌనిక దంపతులు రోడ్డు పక్కన టిఫిన్ బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి 12 ఏళ్ల కుమారుడు సాయిలోకేశ్ స్థానిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈ నెల ఆరో తేదీన జ్వరం, విరేచనాలు, ఆ తర్వాత కాళ్లు చచ్చుబడి పోవడంతో విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే ఇది అరుదైన వ్యాధి అని, చికిత్సకు రూ.8 లక్షలు అవుతుందని అక్కడి వైద్యులు చెప్పారు. అంత ఖర్చుచేసి వైద్యం చేయించే స్థోమత లేక వారు ఇంటికి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో మంచి వైద్యం అందుతుందని తెలుసుకుని ఈ నెల 9న పాత ఆస్పత్రిలోని పిల్లల విభాగంలో సాయిలోకేశ్‌ను చేర్చారు. అక్కడి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సునీత బాలుడిని పరీక్షించి వెంటనే ఇమ్యునోగ్లోబలిన్ ఇంజక్షన్ల కోసం ఇండెంట్ పెట్టి తెప్పించారు. ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.18 వేల వరకూ ఉంది. బాలుడికి 20 ఇంజక్షన్స్ ఇచ్చారు. అంటే దాదాపు రూ.3.60 లక్షల ఖరీదైన ఇంజక్షన్లు చేశారన్నమాట. దీంతో క్రమేపీ నరాల పట్టు రావడంతో పాటు, మూడు రోజులకు బాలుడు నడవడం ప్రారంభించాడు. ప్రస్తుతం పూర్తిగా కోలుకోవడంతో శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. కాగా, ప్రభుత్వాస్పత్రిలో ఇంత బాగా చూస్తారని అనుకోలేదని బాలుడి తల్లిదండ్రులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.

వేధిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేయించిన 'దిశ'

- వ్యక్తి వేధింపులు తాళలేక దిశ ఎస్ఓఎస్‌ను ఆశ్రయించిన మహిళ
- నిమిషాల వ్యవధిలోనే మహిళ ఇంటికి చేరుకున్న పోలీసులు



మహిళ ఇంటి వద్దకు వెళ్లిన పోలీసు

తెనాలిరూరల్ : వ్యక్తి వేధింపులు తాళలేని ఓ మహిళ దిశ యాప్ ఎస్ఓఎస్ ద్వారా పోలీసులను ఆశ్రయించింది. ఆ వ్యక్తిని దిశ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన గుంటూరు జిల్లా తెనాలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలిలో నివాసముండే మహిళ తన కుమార్తె పెళ్లి ఖర్చుల నిమిత్తం శ్రీనివాసరావు అనే వ్యక్తి నుంచి రూ.రెండు లక్షలు అప్పుగా తీసుకుంది. కొన్ని నెలల తర్వాత వడ్డీతో సహా చెల్లించింది. అయినా శ్రీనివాసరావు ఆ మహిళకు కాల్ చేసి అసభ్యంగా మాట్లాడేవాడు. గతంలో అప్పు కోసం తన ఆఫీస్‌కు వచ్చినప్పటి ఫొటోలు, కాల్ రికార్డ్‌లు న్నాయని బెదిరించేవాడు. బాధిత మహిళ తన భర్తకు, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పినా శ్రీనివాసరావు ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం బాధిత మహిళకు, ఆమె భర్తకు మార్ఫింగ్ ఫొటోలు పంపి వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు దిశ ఎస్ఓఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. తెనాలి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న బాధిత మహిళ ఇంటికి దిశ పోలీసులు ఆరు నిమిషాల్లో చేరుకున్నారు. ఆమెకు శ్రీనివాసరావు పంపించిన అసభ్యకర సందేశాలను, అప్పు చెల్లించినట్టు ఉన్న వివరాలను పోలీసులు సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావుపై ఐపీసీ సెక్షన్ 354 ఈ, 506 కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

శ్రీవారి పవిత్రోత్సవాలకు అంకురార్పణ

తిరుమల: శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలకు శనివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణం జరిగింది. ముందుగా సేనాధిపతిని ఆలయ మాడవీధుల గుండా ఊరేగింపుగా వసంతమండపానికి వేంచేపు చేశారు. అనంతరం మృత్సంగ్రహణం, ఆస్థానం నిర్వహించారు. ఆ తర్వాత ఆలయంలోని పవిత్ర మండపంలో అంకురార్పణ వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న జలసంక్షోభం

- వాతావరణ మార్పుల నేపథ్యంలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు
- 2030 నాటికి ప్రపంచంలో నీటి కొరతను ఎదుర్కొనున్న 560 కోట్ల మంది
- ఐరాస విశ్వవిద్యాలయం 'ప్రపంచ జలభద్రత' నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: ప్రపంచంలో 2030 నాటికి భారత్, చైనాసహా 113 దేశాల్లోని 560 కోట్ల మంది (72 శాతం) ప్రజలను నీటి కష్టాలు చుట్టుముడతాయా? పాకిస్తాన్, ఇథియోపియా, హైతీ తదితర 24 దేశాల్లోని 6.42 కోట్ల మంది (8 శాతం) ప్రజలకు తాగడానికి పరిశుభ్రమైన గుక్కెడు తాగునీళ్లు దొరకవా? జలసంక్షోభంతో తీవ్రమైన ఆహార కొరత ఏర్పడటం వల్ల ఆకలిచావులు తప్పవా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానం చెబుతోంది ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయం(యూఎన్‌యూ) ఇటీవల విడుదల చేసిన ప్రపంచ జలభద్రత నివేదిక. ప్రపంచ జనాభాలో సుమారు వంద కోట్ల మంది (20 శాతం) మందికి మాత్రమే తగినన్ని పరిశుభ్రమైన నీళ్లు అందుబాటులో ఉంటాయని నివేదికలో పేర్కొంది. పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా భూతాపాన్ని తగ్గించడం.. మురుగునీటిని శుభ్రపరిచి పునర్వినియోగంలోకి తేవడం.. పంటల సాగులో యాజమాన్య పద్ధతుల ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడం ద్వారా జలసంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చునని ఆ నివేదికలో సూచించింది. వివరాల్లోకి వెళితే.. ప్రపంచంలోని 193 దేశాలకు ఐరాసలో సభ్యత్వం ఉంది. నానాటికీ పెరుగుతున్న కాలుష్యం తీవ్రత.. వర్షపాతంలో తగ్గుదల.. తీవ్రమవుతున్న ఆహార కొరత తదితరాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల అభ్యున్నతి కోసం ఐరాస 17 సుస్థిరాభివృద్ధి సూచికలను ప్రపంచ దేశాలకు నిర్దేశించింది. ఇందులో ప్రధానమైనది అందరికీ సరిపడా పరిశుభ్రమైన నీటిని అందుబాటులో ఉంచడం (ఒక మనిషికి రోజుకు కనీసం 50 లీటర్లు). ఐరాస నిర్దేశించిన ఈ లక్ష్యంపై ఐఎన్‌యూ 186 దేశాల్లో నివసిస్తున్న 778 కోట్ల ప్రజలకు 2030 నాటికి పరిశుభ్రమైన నీరు ఏ మేరకు అందుబాటులో ఉంటుందనే అంశంపై అధ్యయనం చేసింది. అందులో వెల్లడైన అంశాలతో ప్రపంచ జలభద్రత నివేదిక (గ్లోబల్ వాటర్ సెక్యూరిటీ రిపోర్ట్)ను ఇటీవల విడుదల చేసింది.

ఆసియా-పసిఫిక్ దేశాలపై తీవ్ర ప్రభావం

రుతుపవనాలపై అత్యధికంగా ఆధారపడేది ఆసియా, పసిఫిక్ దేశాలే. ఎల్ నినో, లానినా ప్రభావం అత్యధికంగా పడేది ఈ దేశాలపైనే. ఈ పరిస్థితుల వల్ల ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని 113 దేశాల్లోని 560 కోట్ల మంది ప్రజలకు నీటి కష్టాలు చుట్టుముడతాయి. పాకిస్తాన్, ఇథియోపియా, హైతీ, లైబీరియా, మడగాస్కర్ తదితర 24 దేశాల్లోని 6.42 కోట్ల మందికి తాగడానికి పరిశుభ్రమైన గుక్కెడు నీళ్లు కూడా అందుబాటులో ఉండవు. ఫిన్‌ల్యాండ్, అమెరికా, న్యూజిలాండ్, నార్వే, యూకే, స్వీడన్, స్విట్జర్లాండ్, లక్సెంబర్గ్, లాత్వియా తదితర దేశాల్లోని వంద కోట్ల మందికి మాత్రమే తగినన్ని పరిశుభ్రమైన నీళ్లు అందుబాటులో ఉంటాయి.

ఆ నివేదికలో ప్రధానాంశాలు ఇవీ..

- నానాటికీ పెరుగుతున్న భూతాపంతో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఒడిదొడుకులకు లోనవుతున్నాయి.
- ఇది ఎల్ నినో.. లానినా పరిస్థితులకు దారితీస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా రుతుపవనాల గమనాన్ని ఎల్ నినో, లానినాలు దెబ్బతీస్తున్నాయి.
- వర్షం కురిస్తే కుంభవృష్టిగా కురవడం.. లేదంటే రోజుల తరబడి వర్షాలు కురవకపోవడం (డ్రై స్పెల్) వంటి పరిస్థితులు నీటి కొరతకు ప్రధాన కారణం.
- వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలుగా మార్చడంపై ప్రపంచ దేశాలు దృష్టిపెట్టకపోవడం, భూగర్భజలాలను ఇష్టారాజ్యంగా తోడేయడం కూడా నీటి కొరతకు దారితీస్తోంది.
- పంటల సాగులో నీటి యాజమాన్య పద్ధతులను పాటించక పోవడం కూడా ఎద్దడికి దారితీస్తోంది.

తిరుమలలో ముగిసిన కారీరిష్టి యాగం

టీటీడీ చైర్మన్ భూమన • తిరుమలలో ముగిసిన కారీరిష్టి యాగం

తిరుమల: ప్రపంచ మానవాళి సంక్షేమం, శ్రీవారి దయతో సమృద్ధిగా వర్షాలు కురవాలని కారీరిష్టి-వరుణ జపం-పర్జన్యశాంతి హోమం నిర్వహించామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుమల ధర్మగిరి వేద పాఠశాలలో ఐదు రోజుల పాటు జరిగిన యాగాలు శనివారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి టీటీడీ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ భూమన మీడియాతో మాట్లాడుతూ వరుణదేవుని ఆశీస్సులు కోరుతూ 32 మంది రుత్వికులు ధర్మగిరిలో నిష్టగా యాగాలు నిర్వహించారని తెలిపారు. అనంతరం ధర్మగిరి వేద పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్.అవధాని కారీరిష్టి-వరుణజప-పర్జన్యశాంతి మంత్రాలను పఠించి అందరితో పలికించారు. కాగా, తిరుమలలోని ఎంబీసీ సమీపంలో ఎంఆర్కేఆర్ సమస్త ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన అతిథి గృహానికి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ట్రంప్‌తో కలిసి పోటీ పడడానికి సిద్ధమే

ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంపికైనా ఓకేనన్న వివేక్ రామస్వామి



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష అభ్యర్థి రేసులో అనూహ్యంగా పుంజుకొని అందరి దృష్టిని ఆకర్షిస్తున్న భారత సంతతికి చెందిన వివేక్ రామస్వామి తన రూటు మార్చారు. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి రేసులో ఉన్న ఆయన ఇన్నాళ్లూ ఉపాధ్యక్ష పదవికైతే పోటీ పడనని చెబుతూ వస్తున్నారు. అధ్యక్ష పదవి తప్ప తనకు దేనిపైనా ఆసక్తి లేదని గతంలో చెప్పిన ఆయన ఇప్పుడు డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష అభ్యర్థి నామినేషన్‌ను గెలుచుకుంటే ఆయనతో కలిసి పోటీ చేయడానికి సిద్ధమేనని స్పష్టం చేశారు. బ్రిటన్‌కు చెందిన జీబీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రామస్వామిని ట్రంప్‌కు ఉపాధ్యక్షుడిగా పోటీ చేయడం మీకు సంతోషమేనా అని ప్రశ్నించగా ఇప్పుడు తన వయసుకు అది మంచి పదవేనని చెప్పారు. ''అమెరికాని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసి పునరేకీకరణ చేయాల్సిన అవసరం ఉంది. వైట్‌హౌస్‌లో ఒక నాయకుడిగా ఉంటేనే ఆ పని నేను చెయ్యగలను''అని చెప్పారు. 38 ఏళ్ల రామస్వామి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల చర్చలో తన సత్తా చూపించి రేసులో ట్రంప్ తర్వాత స్థానంలో దూసుకుపోతున్నారు. రామస్వామిని ట్రంప్ శిబిరం కూడా ప్రశంసించింది. అప్పట్నుంచి ట్రంప్, రామస్వామిలు అధ్యక్ష, ఉపాధ్యక్ష అభ్యర్థులుగా అంతిమంగా బరిలో నిలుస్తారన్న చర్చ పార్టీలో జరుగుతోంది.

సజావుగా ప్రజ్ఞాన్ రోవర్ ప్రయాణం, పనులు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రయాన్‌–3 ప్రాజెక్టులో భాగంగా చంద్రుడిపై ప్రజ్ఞాన్ రోవర్ సజావుగా ముందుకు సాగుతోందని ఇస్రో ప్రకటించింది. ఇందుకు సంబంధించిన వీడియో, ఫొటోలను తన వెబ్‌సైట్‌లో శనివారం విడుదల చేసింది. విక్రమ్ ల్యాండర్ ర్యాంప్ నుంచి చంద్రుని ఉపరితలానికి చేరిన రోవర్ ఇప్పటికి 8 మీటర్ల దూరం ప్రయాణించింది. చంద్రుడి ఉపరితలం మూలకాల కూర్పును అధ్యయనం చేయడానికి రోవర్‌లో రెండు పరికరాలను అమర్చడం తెల్సిందే. ఈ సమాచారాన్ని భూమికి చేరవేస్తోంది. చంద్ర దినం అంటే.. ఏకధాటిగా 14 రోజులపాటు సూర్యకాంతి ఉండే కాలంలో రోవర్ 500 మీటర్ల దూరం మాత్రమే ప్రయాణించనుంది. 'తొలి టాస్క్ అయిన ల్యాండర్ సేఫ్, సాఫ్ట్ ల్యాండింగ్ పూర్తయింది. రోవర్ సాధారణ కదలిక టాస్క్ సక్సెస్ అయింది. మూడోదైన.. శాస్త్రీయ ప్రయోగ ప్రక్రియలు కొనసాగుతున్నాయి' అని ఇస్రో శనివారం ట్వీట్‌చేసింది.

2న ఆదిత్య–ఎల్‌1 ప్రయోగం!



బెంగళూరు: చంద్రయాన్‌–3 విజయవంతం కావడంతో జోరుమీదున్న భారత అంతరిక్ష అధ్యయన సంస్థ (ఇస్రో) మరో ప్రయోగానికి సిద్ధమవుతోంది. సౌర వాతావరణం అధ్యయనానికి ఆదిత్య–ఎల్‌1 ఉపగ్రహాన్ని మరో వారం రోజుల్లో పంపడానికి సన్నాహాలు చేస్తోంది. ఈ ప్రయోగం మొదటి ప్రయత్నంలో విజయవంతమయ్యేలా ఇస్రో అన్ని జాగ్రత్తలు తీసుకుంది. శ్రీహరి కోట నుంచి పీఎస్‌ఎల్‌వీ సీ57 వాహక నౌక ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు. ''ఆదిత్య–ఎల్‌1 ప్రయోగం సెప్టెంబర్ 2న జరగడానికి అవకాశాలు అధికంగా ఉన్నాయి. రెండు వారాల క్రితమే ఉపగ్రహాన్ని బెంగళూరు నుంచి శ్రీహరి కోటకు తీసుకువచ్చాం'' అని ఇస్రో అధికారి ఒకరు వెల్లడించారు.

ప్రయోగం విశేషాలివే..

- భూమికి 15 లక్షల కిలోమీటర్ల దూరంలో వున్న సూర్య వలయం లాంగ్రేజియన్ పాయింట్‌–1 (ఎల్‌1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి ఈ ఉపగ్రహాన్ని ప్రవేశపెడతారు
- భూమి నుంచి లాంగ్రేజియన్ పాయింట్‌కి చేరుకోవడానికి ఆదిత్య ఉపగ్రహానికి 175 రోజులు పడుతుంది
- లాంగ్రేజియన్1 పాయింట్‌లో ఆదిత్య ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టడం వల్ల గ్రహణాలు వంటివి పరిశోధనలకి అడ్డంకిగా మారవు.
- ఆదిత్య ఎల్‌–1 ఉపగ్రహం బరువు 1,500 కేజీలు
- సూర్యుడిలో మార్పులు, సౌర వాతావరణం ఎందుకు వేడిగా ఉంటుంది, అంతరిక్ష వాతావరణం, భూవాతావరణంపై దాని ప్రభావం వంటివన్నీ ఆదిత్య–ఎల్‌1 అధ్యయనం చేస్తుంది.
- సూర్యుడి వెలువల పొరలు, సౌరశక్తి కణాలు, ఫొటోస్ఫియర్ (కాంతి మండలం) క్రోమోస్ఫియర్ (వర్ణమండలం), కరోనా వలయంలో పెరుగుతున్న వేడి వంటి వాటిపైన అధ్యయనం జరుగుతుంది.
- మొత్తం ఏడు పే లోడ్లను ఇది మోసుకుపోతుంది. ఈ పేలోడ్లతో విజిబుల్ ఎమిషన్ లైన్ కొరోనాగ్రాఫ్ పేలోడ్ ద్వారా సూర్యగోళం నుంచి ప్రసరించే కాంతి ప్రభావాన్ని అధ్యయనం చేస్తుంది.

ఈ ఏడాది రికార్డే

- ఇస్రో చరిత్రలో 2023 ఒక రికార్డుగా మిగిలిపోనుంది. సూర్య చంద్రుల లోతుల్ని తెలుసుకోవడానికి రెండు నెలల వ్యవధిలో రెండు ప్రయోగాలు చేయడం చరిత్రే మరి. చంద్రయాన్‌–3 జాబిల్లి దక్షిణ ధ్రువంపై విజయవంతంగా దిగడంతో ఇప్పుడు అన్ని దేశాలు భారత్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయి. ఆదిత్య–ఎల్‌1 ప్రయోగం కచ్చితంగా విజయవంతమవుతుందనే విశ్వాసం ఏర్పడింది. 2024 చివరికి అంతరిక్షంలోకి మనుషుల్ని పంపి భారతీయుల మరో స్వప్నాన్ని తీర్చాలని ఇస్రో లక్ష్యంగా పెట్టుకుంది.

'శివశక్తి'గా పిలుచుకుందాం

చంద్రుడిపై ల్యాండర్ దిగిన ప్రాంతానికి నామకరణం చేసిన మోదీ

ఆగస్ట్ 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినోత్సవంగా పాటిద్దామని పిలుపు

శివాజీనగర: చందమామ దక్షిణ ధ్రువంపై చంద్రయాన్‌–3 ల్యాండర్ దిగిన ప్రాంతం ఇకపై 'శివశక్తి' పేరుతో ఖ్యాతికెక్కనుందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఇస్రో సాధించిన ఈ అద్భుత విజయానికి గుర్తుగా ల్యాండింగ్ జరిగిన రోజు(ఆగస్ట్ 23వ తేదీ)ను ఇకపై జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకోవాలని ఆయన దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ఏథెన్స్ నుంచి తిరుగు పయనమైన మోదీ శనివారం బెంగళూరుకు చేరుకున్నారు. చంద్రయాన్‌–3 విజయవంతమైన సందర్భంగా బెంగళూరులో ఇస్రో వారి టెలిమెట్రీ ట్రాకింగ్, కమాండ్ నెట్‌వర్క్ సెంటర్‌లో ఇస్రో శాస్త్రవేత్తలను కలిశారు. విజయం కోసం అహర్నిశలు శ్రమించిన వారిని మనసారా అభినందించారు. వారి సమక్షంలో భావోద్వేగంతో మాట్లాడారు. ' భారత అంతరిక్ష ప్రయోగాల పథాన్ని ఈ విజయం నిజంగా అసాధారణమైన ఆనందంతో నింపేసింది. విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతాన్ని 'శివశక్తి'గా, 2019లో చంద్రయాన్‌–2 చంద్రునిపై కూలిన ప్రదేశాన్ని తిరంగా పాయింట్‌గా పిలుచుకుందాం. శివశక్తిలోని శివ.. మానవత్వం శ్రేయస్సుకు ప్రతీక. శక్తి.. మానవాళి సంక్షేమ ఆకాంక్షలకు తగిన ధైర్యం, స్థైర్యాన్ని అందిస్తుంది. అందుకే ఆ ప్రాంతానికి శివశక్తిగా నామకరణం చేశా' అని అన్నారు. 'భారతీయ గ్రంథాల్లోని ఖగోళ సూత్రాలను శాస్త్రీయంగా రుజువుచేసేందుకు నవతరం ముందుకు రావాలి. వాటిని అధ్యయనం చేయాలి. ఇది మన వారసత్వానికి, శాస్త్రానికి ఎంతో ముఖ్యం. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులపై ఇందుకు సంబంధించి రెట్టింపు బాధ్యత ఉంది. వందల ఏళ్ల బానిసత్వం కారణంగా భారత ఉజ్వల శాస్త్రీయ విజ్ఞానం మరుగునపడింది. 'ఆజాదీ కా అమృత్' కాలంలో ఆ విజ్ఞాన నిధిని మళ్లీ వెలికితీసి ప్రపంచానికి చాటి చెప్పాలి' అని మోదీ అభిలషించారు.



చంద్రయాన్‌–3 మిషన్‌ను విజయవంతం చేసిన మహిళా శాస్త్రవేత్తలతో శనివారం బెంగళూరులోని ఇస్రో సెంటర్‌లో ప్రధాని మోదీ, ఇస్రో చైర్మన్ సోమనాథ్

ఇబ్బంది పడొద్దనే సీఎం, గవర్నర్‌లను వద్దన్నా

మొదట బెంగళూరు హెచ్‌ఏఎల్ విమానాశ్రయంలో దిగిన మోదీ అక్కడి నుంచి కాన్వాయ్‌లో ప్రజలకు చేతులు ఊపుతూ మినీ రోడ్‌షో నిర్వహించారు. అభిమానులకు, ప్రజలకు అభివాదం చేస్తూ ఇస్రో కార్యాలయానికి చేరుకున్నారు. బెంగళూరులో ప్రధానికి స్వాగతం పలికేందుకు కర్ణాటక గవర్నర్, ముఖ్యమంత్రి రాలేదు. ఇందుకు కారణాన్ని మోదీనే వివరించారు. ' గ్రీస్ నుంచి సుదూర ప్రయాణం కారణంగా సరిగ్గా ఎన్ని గంటలకు విమానం ల్యాండ్ అవుతుందో తెలీదు. గవర్నర్ గెహ్లాట్, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డెప్యూటీ సీఎం డీకే శివకుమార్ నాకోసం అనవసరంగా చాలా సేపు వేచిఉండాల్సి రావొచ్చు. అందుకే స్వాగతం పలికేందుకు రావద్ద ని ముందే తెలియజేశా' అని మోదీ స్పష్టత నిచ్చారు. కాగా, మోదీ వివరణపై కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ మండిపడ్డారు. 'మోదీ కంటే ముందే ఇస్రో శాస్త్రవేత్తలను సీఎం, డెప్యూటీ సీఎం ఘనంగా సత్కరించారు. అది మోదీకి సుతరాము నచ్చలే దు. అందుకే ఈసారి ఆయన వచ్చినపుడు సీఎంను రావొద్దని చెప్పారు' అని ఆరోపించారు. తర్వాత ఢిల్లీకి చేరుకున్న మోదీ పాలెం ఎయిర్‌పోర్టులో తనకు స్వాగతం పలికిన బీజేపీ చీఫ్ నడ్డా, పార్టీ శ్రేణులతో మాట్లాడారు. 'చంద్రయాన్ విజయంతో వెల్లువెత్తిన ఉత్సాహాన్ని.. యువతరంలో శాస్త్రీయ విజ్ఞానంపై మక్కువ పెంచేందుకు ఉపయోగించాలి. అప్పుడే 2047కల్లా అభివృద్ధి చెందిన భారత్ అనే కల నెరవేరుతుంది' అని అన్నారు.

జై విజ్ఞాన్.. జై అనుసంధాన్

'చంద్రయాన్‌–3 విజయం తర్వాత ఇక్కడికొచ్చేందుకు, మిమ్మల్ని అభినందించేందుకు ఎంతో ఆత్రుతగా ఎదురుచూశా. పని పట్ల మీ అంకితభావం, నిబద్ధత, ధైర్యసాహసాలు, తెగువకు నా సెల్యూట్' అని బెంగళూరులో ఇస్రో శాస్త్రవేత్తలపై మోదీ ప్రశంసల జల్లు కురిపించారు. 'చందమామను భారత్ చేరుకుంది. ల్యాండర్, రోవర్ రూపంలో మన జాతి గౌరవం చంద్రుడిపై సగర్వంగా అడుగుపెట్టింది. ఈ ప్రాజెక్టులో పాలుపంచుకున్న మహిళా శాస్త్రవేత్తలను చూసి గర్విస్తున్నా. దేశ నారీశక్తి ఈ ప్రాజెక్టులో పెద్దపాత్ర పోషించింది. మనోధైర్యం ఉంటే విజయం గ్యారెంటీ. శాస్త్ర, సాంకేతిక, నవకల్పనల నుంచి స్ఫూర్తి పొందేందుకు ఆగస్ట్ 23వ తేదీని జాతీయ అంతరిక్ష దినంగా జరుపుకుందాం' అని మోదీ అన్నారు. 'జై విజ్ఞాన్...జై అనుసంధాన్ అనే నినాదం ఇచ్చారు. 'విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై దిగిన సమయంలో దక్షిణాఫ్రికాలో ఉన్నాను. అయినా నా మనస్సు, ఆలోచన మొత్తం ఇక్కడే ఉన్నాయి. అందుకే గ్రీస్ దేశం నుంచి మిమ్మల్ని కలవడానికే నేరుగా ఇక్కడికొచ్చా. ఇప్పటి వరకు భారత్‌లోని ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడేది. ఇకపై చంద్రునిపైనా త్రివర్ణ పతాకం వెలుగులీనుతుంది. ప్రస్తుతం సాధించిన అంతరిక్ష విజ్ఞానంతో ఎన్నో ఫలితాలు అందుకోవాలి. ఆ ఫలితాలు కీలకమైన వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఉపయోగపడాలి' అని మోదీ అన్నారు.

ఆ మూడ్రోజులు 'ఢిల్లీ'కి సెలవు..

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ జీ–20 శిఖరాగ్ర సదస్సుకు సమాయత్తమవుతోంది. సెప్టెంబర్ 8, 9, 10వ తేదీల్లో జరిగే ఈ సదస్సును అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కేంద్రం ప్రయత్నాలు ప్రారంభించింది. సదస్సు దృష్ట్యా వచ్చే నెల 8 నుంచి మూడ్రోజుల పాటు ఢిల్లీలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవులు ప్రకటించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సదస్సుకు హాజరవుతున్న భాగస్వామ్య దేశాల నేతల భద్రత దృష్ట్యా ఆ మూడు రోజులూ లుటియన్స్ ఢిల్లీలోని అన్ని మాల్స్, మార్కెట్లను మూసి ఉంచాలన్న పోలీసు శాఖ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి కేజ్రీవాల్, లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ సక్సేనా ఆమోదం తెలిపారు. అంతేకాకుండా, రాజధానిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బ్యాంకులు, దుకాణాలు, వాణిజ్య వ్యాపార సంస్థలను మూసివేయనున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సుప్రీంకోర్టు, సెంట్రల్ సెక్రటేరియట్ సహా కొన్ని మెట్రో స్టేషన్లు మూసివేయనున్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్దేశిత ప్రాంతాల్లో ప్రభుత్వ బస్సుల రాకపోకలను గణనీయంగా తగ్గించనున్నారు. సదస్సుకు 20 దేశాల అధినేతలు సహా 14 అంతర్జాతీయ సంస్థల అధిపతులు హాజరయ్యే అవకాశం ఉంది. హాజరయ్యే ముఖ్యుల్లో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, యూకే ప్రధాని రిషి సునాక్, జపాన్ ప్రధాని ఫ్యూమియో కిషిదా, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌ల తదితరులున్నారు.

హోటళ్లకు పెరిగిన గిరాకీ...

జీ20 సదస్సు నేపథ్యంలో ఢిల్లీ సహా, గురుగ్రామ్, నోయిడాల్లోని పెద్ద హోటళ్లకు గిరాకీ పెరిగింది. ప్రపంచ నాయకులతో పాటు వారి ప్రతినిధి బృందాలు, భారీ రక్షణ, మీడియా బృందాలు ముందుగానే భారత్ చేరుకుంటుండటంతో టాప్ ఫైవ్ స్టార్ హోటళ్లలో బుకింగ్‌లు పెరిగాయి. సెప్టెంబర్ 6 నుంచి 12 మధ్య అన్ని ఫైవ్ స్టార్ హోటళ్లు పూర్తిగా బుక్ అయ్యాయని తెలుస్తోంది. హోటల్ గదుల ధరలు కూడా భారీగా పెరిగాయి. ఎయిర్‌పోర్ట్‌కి సమీపంలోని ఏరోసిటీలోని హోటల్‌లో ఉత్తమమైన సూట్ ఒక రాత్రికి రూ.20 లక్షల చొప్పున కోట్ చేశారని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. పార్లమెంట్‌కు కూతవేటు దూరంలోని జన్‌పథ్ సమీపంలోని ఒక హోటల్‌లో ప్రధాన సూట్‌కు ఒక్క రాత్రికి రూ.15 లక్షలకు బుక్ అయిందని అవి వెల్లడించాయి.

మదురై రైలు బోగీలో మంటలు

- తమిళనాడులో ఘోర ప్రమాదం
- 9 మంది మృత్యువాత మరో 20 మందికి గాయాలు
- కోచ్‌లో గ్యాస్ స్టౌపై టీ కాచడంతో పేలిన సిలిండర్
- మృతులంతా యూపీ వాసులు



సాక్షి, చెన్నై: తమిళనాడులోని మదురైలో శనివారం ఘోర రైలు ప్రమాదం చోటు చేసుకుంది. మదురై ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌లో నిలిచి ఉన్న ఒక ప్రైవేటు కోచ్‌లో మంటలు చెలరేగి తొమ్మిది మంది మరణించారు. మృతులందరూ ఉత్తరప్రదేశ్‌కు చెందినవారే. కోచ్‌లోకి అక్రమంగా గ్యాస్ సిలిండర్ తీసుకువెళ్లి టీ కాచుకోవాలని ప్రయత్నించడంతో ఈ ప్రమాదం జరిగిందని దక్షిణ రైల్వే అధికారులు వెల్లడించారు. శనివారం తెల్లవారుజామున 5.15 గంటలకు టీ కాచుకోవాలని స్టౌ ముట్టించగా, సిలిండర్ పేలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయని విచారణలో తేలింది. బోగీలో ఉన్న ప్రయాణికులు ప్రాణ రక్షణ కోసం ప్లాట్‌ఫారమ్ పైకి పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మంటల్లో చిక్కుకొని మరణిస్తే, మరో 20 మంది కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది స్టేషన్‌కు చేరుకొని మంటల్ని అదుపు చేయడానికి రెండు గంటలు పట్టింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన 63 మందితో కూడిన బృందం లక్నో నుంచి ఈనెల 17న ఐఆర్‌సీటీసీ ద్వారా రిజర్వు చేసుకున్న ప్రత్యేక రైలు బోగీలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు బయలుదేరారు. తమ పర్యటన లో భాగంగా శుక్రవారం తమిళనాడు లోని కన్యాకుమారిలో పర్యటించారు. ఈ బోగీని నాగర్‌కోయిల్ నుంచి పునలూరు రైలుకు అనుసంధానించి మదురైకు పంపించారు. ఈ రైలు శనివారం వేకువజామున 3.45 గంటలకు మదురైకు చేరుకుంది. పునలూరు రైలు నుంచి ఈ బోగిని వేరు చేసి స్టాబ్లింగ్ లైన్‌లో ఉంచారు. 5.15 గంటల సమయంలో ఈ బోగిలో మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు చుట్టుముట్టి బోగి మొత్తం కాలిపోయింది. ఆదివారానికి ప్రయాణికులు రామేశ్వరం వెళ్లాల్సి ఉంది. పర్యాటక ప్రాంతాల సందర్శన తర్వాత వారంతా లక్నోకు తిరుగు ప్రయాణమవుతారు. అయితే ప్రయాణికులు రైల్వే అధికారుల కళ్లు గప్పి గ్యాస్ స్టౌ, సిలిండర్, వంట చేయడానికి వాడే కలప, వంట సామాగ్రి వంటివన్నీ ఆ కోచ్‌లోకి తీసుకువెళ్లడం వారి ప్రాణాల్ని హరించింది. ప్రమాదం జరిగినప్పుడు కోచ్‌లో 63 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రైల్వే శాఖ మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం ప్రకటించింది. తమిళనాడు సీఎం స్టాలిన్ రూ.3 లక్షలు, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ఐఆర్‌సీటీసీ వెబ్ పోర్టల్ ద్వారా ఎవరైనా పార్టీ కోచ్‌ను బుక్ చేసుకోవచ్చు. అయితే గ్యాస్ సిలిండర్, మండే గుణం కలిగిన పదార్థాలను తీసుకువెళ్లడంపై నిషేధం ఉంది.

రెడ్ డైరీలో రాజస్తాన్ ప్రభుత్వ అక్రమాలు

సీఎం గెహ్లాట్ రాజీనామా చేయాలి • హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు

జైపూర్: రాజస్తాన్ ప్రభుత్వం అవినీతి, అక్రమాల రహస్యాలన్నీ రెడ్ డైరీలో ఉన్నాయని, దీనిపై సీఎం అశోక్ గెహ్లాట్ రాజీనామా చేయాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. గంగాపూర్‌లో శనివారం జరిగిన 'సహకార కిసాన్ సమ్మేళన్'ను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. ఆయన ప్రసంగం ప్రారంభించగానే కొందరు నినాదాలు ప్రారంభించారు. వారినుద్దేశించి మంత్రి మాట్లాడుతూ..'నినాదాలు చేసేందుకు కొందరిని పంపించినంత మాత్రాన ఒరిగేదేమీ ఉండదని గెహ్లాట్‌కు చెప్పాలనుకుంటున్నా. ఆయనకు సిగ్గుంటే, రెడ్ డైరీ వ్యవహారంపై రాజీనామా చేసి, ఎన్నికలకు వెళ్లి ఉండేవారు'అని వ్యాఖ్యానించారు. 2020లో కాంగ్రెస్ నేత ధర్మేంద్ర రాథోడ్ ఇంటిపై ఆదాయపన్ను శాఖ అధికారులు జరిపిన దాడుల్లో 'రెడ్ డైరీ'దొరికింది. దాన్లో సీఎం గెహ్లాట్ ఆర్థిక లావాదేవీల వివరాలన్నీ ఉన్నట్లు మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయిన రాజేంద్ర గూఢా చేసిన ఆరోపణలను అమిత్ షా తన ప్రసంగంలో ప్రస్తావించారు.

నూహ్‌లో మళ్లీ ఇంటర్నెట్ సేవలు బంద్

శోభాయాత్ర దృష్ట్యా హరియాణా ప్రభుత్వం నిర్ణయం

చండీగఢ్: శోభాయాత్ర పిలుపు నేపథ్యంలో నూహ్ జిల్లాలో ఈ నెల 28 వరకు మొబైల్ ఇంటర్నెట్ సేవలపై నిషేధం విధించడంతోపాటు నిషేధాజ్ఞలు అమలు చేయాలని హరియాణా ప్రభుత్వం నిర్ణయించింది. జూలై 31వ తేదీన జరిగిన మతపర ఘర్షణల నేపథ్యంలో ఈ మేరకు చర్యలు చర్యలు తీసుకున్నట్లు వివరించింది. నూహ్‌లో సోమవారం తలపెట్టిన శోభాయాత్రకు అనుమతులు నిరాకరించామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఢిల్లీలో సెప్టెంబర్ 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే జీ–20 షెర్పా సమావేశాలను కూడా దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు నిర్ణయించామన్నారు. మొబైల్ ఇంటర్నెట్‌తోపాటు ఎస్‌ఎంఎస్ సర్వీసులపైనా నిషేధం విధించామన్నారు. సంఘ విద్రోహ శక్తులు సామాజిక మాధ్యమాల ద్వారా వదంతుల వ్యాప్తి చేయకుండా అడ్డుకోవడమే లక్ష్యమని చెప్పారు. ఈ నెల 26–28 తేదీల మధ్య 144వ సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని డీజీపీ శత్రుజీత్ కపూర్ చెప్పారు.

ఎన్నికల వేళ.. మధ్యప్రదేశ్ కేబినెట్ విస్తరణ

భోపాల్: అసెంబ్లీ ఎన్నికలు మరికొద్ది నెలల్లో జరగనున్న వేళ మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ తన మంత్రివర్గాన్ని విస్తరించారు. కొత్తగా బీజేపీకే చెందిన ఎమ్మెల్యేలు రాజేందర్ శుక్లా, గౌరీశంకర్ బిసెన్, రాహుల్ లోధిలను కేబినెట్‌లోకి తీసుకున్నారు. కుల, ప్రాంతీయ సమీకరణాల్లో సమతూకం పాటించే లక్ష్యంతో ఒక బ్రాహ్మణ, ఇద్దరు ఇతర వెనుకబడిన కులాల(ఓబీసీ) వీరికి తాజాగా ప్రమోషన్ ఇచ్చినట్లు భావిస్తున్నారు. శనివారం ఉదయం రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ మంగుభాయ్ పటేల్ ముగ్గురితో మంత్రులుగా ప్రమాణం చేయించారు. తాజా విస్తరణతో మంత్రుల సంఖ్య 34కు చేరింది.

నాలుగు దేశాలు.. నలుగురు వ్యోమగాములు

స్పేస్ ఎక్స్ రాకెట్‌లో ఐఎస్ఎస్‌కు పంపిన నాసా



కేప్ కెనవెరాల్: నాలుగు వేర్వేరు దేశాలకు చెందిన నలుగురు వ్యోమగాములతో స్పేస్ ఎక్స్ రాకెట్ శనివారం కేప్ కెనవెరాల్ నుంచి నింగిలోకి దూసుకెళ్లింది. కక్ష్యలో పరిభ్రమిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోకి ఆదివారం నలుగురు వ్యోమగాములు అడుగిడుతారు. మార్చి నెల నుంచి అక్కడే విధులు నిర్వర్తిస్తున్న వ్యోమగాముల స్థానంలో వీరు బాధ్యతలు చేపడతారు. ఆరు నెలలపాటు అక్కడుంటారు. నలుగురిలో ఒకరు నాసాకు చెందిన వారు కాగా, మిగతా ముగ్గురు డెన్మార్క్, జపాన్, రష్యా దేశస్తులు. అమెరికా ఇలా ఒకే అంతరిక్ష నౌకలో వేర్వేరు దేశాలకు చెందిన వారిని ఐఎస్ఎస్‌కు పంపించడం ఇదే మొదటిసారి. ఇప్పటి వరకు నాసా పంపించిన స్పేస్ ఎక్స్ ట్యాక్సీ రాకెట్లలో ఇద్దరు లేదా ముగ్గురు అమెరికన్లు ఉండేవారు. తాజా బృందానికి నాసాకు చెందిన జాస్మిన్ మొఘబెలి అనే మెరైన్ పైలట్ నాయకత్వం వహిస్తున్నారు. జాస్మిన్ తల్లిదండ్రులు ఇరాన్ దేశస్తులు. 1979లో ఇరాన్ విప్లవం సమయంలో జర్మనీ వెళ్లిపోయారు. అక్కడే జాస్మిన్ పుట్టారు. న్యూయార్క్‌లో పెరిగారు. అమెరికా మెరైన్స్ చేరి అఫ్గానిస్తాన్‌లో యుద్ధ హెలికాప్టర్లు నడిపారు. ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధించవచ్చని ఇరాన్ బాలికలకు చూపుతున్నానని ఆమె అంటున్నారు.

పార్టీ చీలదు

- కొందరు ఎమ్మెల్యేలంటే మొత్తం పార్టీ కాదు
- ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ వ్యాఖ్య

కొల్హాపూర్: ఎన్సీపీలో చీలిక రాబోతోందంటూ వినవస్తున్న ఊహాగానాలకు పార్టీ అధినేత శరద్ పవార్ అడ్డుకట్టవేశారు. 'పార్టీలో చీలిక అనే సమస్యే లేదు. ఒక వేళ నిజంగానే పార్టీ ఎమ్మెల్యేలు కొందరు పార్టీని వీడితే అది అంతవరకే పరిమితం. అంతేగానీ అది మొత్తం పార్టీకి వర్తించదు. ఎమ్మెల్యేలు అంటే అర్థం మొత్తం పార్టీ అని కాదు. పార్టీకి జాతీయ అధ్యక్షుడిని నేనే. మహారాష్ట్ర రాష్ట్ర విభాగానికి జయంత్ పాటిల్ సారథ్యం కొనసాగుతుంది. తిరుగుబాటు శాసనసభ్యులకు ఎందుకంత ప్రాధాన్యత ఇస్తారు?' అని మీడియా ప్రతినిధులను ఎదురు ప్రశ్నించారు. శుక్రవారం పవార్ కూతురు, ఎన్సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుప్రియా సూలే మాట్లాడుతూ.. ' అజిత్ పవార్, కొందరు ఎమ్మెల్యేలు షిండే సర్కార్‌లో భాగస్వామ్యం అయినా సరే ఎన్సీపీ చీలిపోలేదు. అజిత్ ఎన్సీపీ నేతగానే కొనసాగుతారు' అని తెలిపారు. దీనిపై శరద్ స్పందిస్తూ.. ' అవును అది నిజమే. ఇందులో వివాదం ఏం లేదు' అని అన్నారు. కానీ కొద్ది సేపటికే అలా అనలేదంటూ మాటమార్చారు.

తోటి విద్యార్థులతో కొట్టించి... మత వివక్ష నూరిపోసి

- యూపీ స్కూల్లో మైనర్ బాలుడిపై టీచర్ దారుణం
- వైరల్‌గా మారిన వీడియో
- బడిలో విద్వేషాలు నూరి పోస్తున్నారన్న రాహుల్

ముజఫర్‌నగర్: ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లో ఖుబ్బాపూర్ గ్రామంలోని పాఠశాలలో రెండో తరగతి చదువకుంటున్న మైనర్ విద్యార్థిపై దారుణం జరిగింది. ఎక్కాలు సరిగా నేర్చుకోలేదని క్లాస్ టీచర్ తృప్తి త్యాగి తోటి విద్యార్థులతో ఆ బాలుడి చెంపలు వాచేలా కొట్టించింది. అయిదో ఎక్కం సరిగా అప్పచెప్పకపోవడంతో ఆ బాలుడిని నిల్చోమని చెప్పిన ఆ టీచర్ పిల్లలందరూ వరుసగా వచ్చి కొట్టండంటూ ఆజ్ఞాపించింది. ఎవరైనా నెమ్మదిగా కొడితే ''ముస్లింలందరినీ కొట్టాలని నిర్ణయించుకున్నా. గట్టిగా కొట్టండి. నడుం మీద కూడా కొట్టండి'' అంటూ పిల్లల్ని రెచ్చగొట్టి కొట్టించడంపై కలకలం రేగుతోంది. దీనికి సంబంధించిన వీడియోలో బాలుడు నిస్సహాయంగా కళ్లనీళ్లతో తలవంచుకొని కనిపించడం కలచివేస్తోంది. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. టీచర్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది.

గంటకు పైగా కొట్టారన్న బాలుడు

టీచర్ ఆదేశాలతో తోటి పిల్లలు గట్టిగా కొట్టడంతో బుగ్గలన్నీ ఎర్రగా వాచిపోయి ఉన్న ఆ బాలుడు కన్నీటిపర్యంతమైపోయాడు. అయిదో ఎక్కం సరిగా చెప్పకపోవడంతో టీచర్ తోటి పిల్లలతో కొట్టించిందన్నాడు. గంటసేపు ఆగకుండా వారు కొడుతూ ఉన్నారని చెప్పాడు. ఈ ఘటనతో ఏడేళ్ల వయసున్న తమ అబ్బాయి భయపడిపోతున్నా డని తండ్రి పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ బాలుడి కజిన్ నదీమ్ స్కూల్లో ఏదో పని ఉందని వెళ్లి టీచర్ చేష్టలతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఆ టీచర్ తన సోదరుడ్ని కొట్టించడం వీడియో తీసి ట్విట్టర్‌లో ఉంచడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఘటనపై విచారణ జరుపుతున్నామని జిల్లా మెజిస్ట్రేట్ అరవింద్ మల్లప్ప వెల్లడించారు.

విద్వేషాల పాఠశాలగా మారుస్తారా? రాహుల్ ధ్వజం

అమాయకులైన పిల్లల మెదళ్లను వివక్ష అనే విషంతో నింపేస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పవిత్రమైన పాఠశాలను విద్వేష దుకాణంగా మార్చేశారని ఆరోపించారు. ఒక టీచర్ ఈ దేశానికి ఇంతకంటే హాని ఏమీ చెయ్యలేదని ట్వీట్ చేశారు.

సమర్థించుకుంటున్న టీచర్

ఆ స్కూల్‌కి ప్రిన్సిపాల్ కూడా అయిన తృప్తి త్యాగి తాను చేసిన పనిని సమర్థించుకుంటున్నారు. ఆ వీడియోని ఎడిట్ చేసి మతం రంగు పులిమారని ఆరోపించారు. తమ స్కూలులో హిందూ, ముస్లిం పిల్లలు సోదరభావంతో ఉంటారని చెప్పుకొచ్చారు.

స్టేడియంలో తొక్కిసలాట..12 మంది మృతి

అంటననరివో(మడగాస్కర్): క్రీడాపోటీల ప్రారంభం సందర్భంగా స్టేడియంలో జరిగిన తొక్కిసలాటలో 12 మంది చనిపోగా మరో 85 మంది గాయపడ్డారు. ఈ విషాద ఘటన హిందూ మహా సముద్ర ద్వీప దేశం మడగాస్కర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. కొమరోస్, మాల్దీవులు, మారిషస్, రీయూనియన్, సెషెల్స్, మయెట్ వంటి ద్వీపదేశాల ఆటల పోటీలు శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. ఆ సమయంలో, మహమసినా స్టేడియం ప్రధాన ద్వారం వద్ద భారీగా జనం గుమికూడటం తొక్కిసలాటకు దారితీసిందని అధికారులు తెలిపారు. క్షతగాత్రుల్లో 11 మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు.



భూకంపంతో దెబ్బతిన్న ఫుకుషిమా అణు రియాక్టర్ నుంచి వ్యర్థ అణు జలాలను జపాన్ సముద్రంలోకి వదలడాన్ని నిరసిస్తూ శనివారం దక్షిణకొరియా రాజధాని సియోల్‌లో నిరసన తెలుపుతున్న వేలాది మంది జనం.

గవర్నర్లు రబ్బర్ స్టాంప్ కాదు

– తమిళిసై వ్యాఖ్య

సాక్షి, చెన్నై: గవర్నర్లు రబ్బర్‌స్టాంప్‌లు కాదని పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ వ్యాఖ్యానించారు. కోయంబత్తూర్ విమానాశ్రయంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. గవర్నర్ వద్ద ఓ ముసాయిదా ఉందంటే, అందుకు వెయ్యి కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు. గవర్నర్‌లు అన్నింటిని పరిశీలించే నిర్ణయాలు తీసుకుంటారని, రబ్బర్‌స్టాంప్‌లు మాత్రం కాదన్నారు. తమిళ సీఎం అల్పాహార పథకం గురించి పేర్కొంటూ, కేంద్ర విద్యావిధానంలో ఈ అంశం ఉందని, అందులో నుంచే కాపీ కొట్టారని విమర్శించారు. కేంద్ర విద్యావిధానాన్ని వీరు అంగీకరించరని, అయితే, అందులోని అంశాలు బిట్లుబిట్లుగా కాపీ కొడతారని ఎద్దేవా చేశారు. నీట్ పేరిట తమిళనాట రాజకీయం జరుగుతోందని, విద్యార్థులకు ద్రోహం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

న్యూస్‌రీల్

డిసెంబర్‌లో డీఎంకే యువజన మహానాడు

- జిల్లాల పర్యటనలో ఉదయనిధి



సాక్షి, చెన్నై: డీఎంకే యువజన మహానాడు డిసెంబర్ 17వ తేదీ జరగనుంది. బలోపేతం దిశగా ఆ విభాగం ప్రధాన కార్యదర్శి, మంత్రి ఉదయనిధి స్టాలిన్ జిల్లాల బాటకు శ్రీకారం చుట్టారు. యువజన బలోపేతం నినాదంతో శనివారం నుంచి ఆయన నాగపట్నం, పుదుకోట్టై, తిరుచ్చి, పెరంబలూరు, అరియలూరు జిల్లాల పర్యటనలో నిమగ్నయ్యారు. శనివారం నాగపట్నం యువజన నేతలతో సమావేశమయ్యారు. ఆదివారం నాగపట్నం, పుదుకోట్టై జిల్లాల్లోని యువజన కార్యదర్శులు, ముఖ్యనేతలతో సమావేశం అవుతారు. సోమవారం మైలాడుతురై, తంజావూరు జిల్లాలోని యువజన వీరులతో సమావేశం కావడంతో పాటు కేడర్‌తో మమేకమయ్యే విధంగా జరిగే కార్యక్రమానికి హాజరవుతారు, అదేరోజు సాయంత్రం నుంచి, 29వ తేదీన అరియలూరు, పెరంబలూరు, కడలూరు జిల్లాల్లో ఉదయ నిధి పర్యటించనున్నారు. డిసెంబర్‌లో జరగనున్న యువజన మహానాడు విజయవంతం లక్ష్యంగా ఇక, ఉదయనిధి జిల్లాల పర్యటన విస్తృతం చేయనున్నారు.

మహానాడులో స్వామిమలై నటరాజ విగ్రహం

- 28 అడుగులతో సిద్ధం
- 8 లోహాలతో రూపకల్పన
- ఢిల్లీకి తరలింపు



నటరాజ స్వామి (ఫైల్)

సాక్షి, చెన్నై: జీ20 మహానాడు వేదికపై తమిళనాడులోని స్వామిమలైలో రూపుదిద్దుకున్న నటరాజ విగ్రహం ప్రతిష్ఠించనున్నారు. 28 అడుగులతో ఎనిమిది లోహాలతో తీర్చిదిద్దిన ఈ విగ్రహాన్ని శనివారం ఢిల్లీకి తరలించారు.

ఢిల్లీ వేదికగా సెప్టెంబర్ 9,10 తేదీల్లో జీ20 దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రుల సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఇందుకోసం ఢిల్లీ ప్రగతి మైదానంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. అమెరికా, చైనా దేశాల అధ్యక్షులు ఈ మహానాడుకు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ మహానాడులో ప్రత్యేక ఆకర్షణగా విదేశీయులు అమితంగా మెచ్చే నటరాజ స్వామి విగ్రహం కొలువు దీరనుంది.

స్వామిమలైలో రూపకల్పన..

ప్రగతి మైదానంలోని భారత్ మండపంలో బ్రహ్మాండ నటరాజస్వామి విగ్రహాన్ని కొలువు దీర్చనున్నారు. దీనిని తంజావూరులోని స్వామిమలైలో సిద్ధం చేశారు. బంగారు, వెండి, కంచు సహా 8 లోహాలతో ఈ నటరాజ స్వామి విగ్రహం రూపుదిద్దుకుంది. సుందర్ స్థపతి, ఆయన సోదరులు రాధాకృష్ణన్, స్వామినాథన్‌ల బృందం ఈ విగ్రహాన్ని సిద్ధం చేశారు. దీని బరువు 19 టన్నులు. 22 అడుగుల నటరాజ స్వామి నాట్యం చేస్తున్నట్టు, మరో ఆరు అడుగులు పీఠంగా మొత్తం 28 అడుగులతో ఈ విగ్రహం సిద్ధం చేశారు. దీనికి రూ.10 కోట్లు ఖర్చు పెట్టారు. చిదంబరం ఆలయం విగ్రహం, చోళ కాలం నాటి అంశాలతో ప్రత్యేక రూపు రేఖలతో ఈ విగ్రహాన్ని సిద్ధం చేశారు. ఈ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో స్వామిమలై నుంచి ఢిల్లీకి తరలించారు. ఢిల్లీలో ప్రతిష్ఠించినానంతరం ఈ విగ్రహానికి మెరుగులు దిద్దేందుకు ప్రత్యేక బృందం బయలుదేరి వెళ్లింది.

యువకుడు దారుణ హత్య

- ముగ్గురి అరెస్ట్



పురుషోత్తమన్(ఫైల్)

వేలూరు: ఆలయ జాతరలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. వేలూరు జిల్లా అనకట్టు సమీపంలోని చిన్న ఊలై గ్రామంలో మారియమ్మన్ ఆలయంలో శుక్రవారం జాతర జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి కరగం ఊరేగింపు జరిగింది. అదే గ్రామానికి చెందిన పురుషోత్తమన్(23) హొసూరులోని ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్. జాతర కోసం గ్రామానికి వచ్చాడు. ఇతను, స్నేహితుడు దీపన్ వీరిద్దరూ ఎదురింటికి చెందిన బాలగణేశన్, యోగానందన్, శ్రీనాద్, మునస్వామి కలిసి కరగం ఊరేగింపులో మేళం కొట్టేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఇరు వర్గాల మధ్య డ్యాన్స్ విషయంగా ఘర్షణ జరిగింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన సుబ్రమణి కుమారుడు బాలగణేశన్, యోగానందన్‌తో పాటు బంధువులు కలిసి పురుషోత్తమన్, దీపన్‌లపై కత్తితో దాడి చేశారు. దాడిలో పురుషోత్తమన్ అక్కడికక్కడే మృతిచెందాడు. దీపన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అనకట్టు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి బాలగణేశన్, యోగానందన్, శ్రీకాంత్‌లను అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు. పరారీలో ఉన్న మునస్వామి, సుమన్‌ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

విషాద యాత్ర!

ఉత్తరాది వాసుల రైలుయాత్ర విషాదానికి దారి తీసింది. పర్యాటక రైలు బోగిలో చెలరేగిన మంటలతో మదురై రైల్వేస్టేషన్‌లో శనివారం ఉదయం కలకలం బయలుదేరింది. మంటల్లో తొమ్మిది మంది ఉత్తరాదివాసులు ఆహుతి అయ్యారు. రైల్వే, తమిళనాడు రాష్ట్ర అధికార యంత్రాంగం సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం ఉత్తరప్రదేశ్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. మృతుల కుటుంబాలకు రైల్వే, తమిళనాడు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియో ప్రకటించింది.

- పర్యాటక రైలు బోగిలో మంటలు
- మదురై రైల్వేస్టేషన్‌లో కలకలం
- 9 మంది ఉత్తరాదివాసులు మృతి
- సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి
- విచారణకు ప్రత్యేక బృందాలు



దగ్ధమవుతున్న రైలు బోగి



బుగ్గిపాలైన రైలు లోపలి భాగం

సాక్షి, చెన్నై: ఉత్తరప్రదేశ్‌లోని చిట్పోర్ ప్రాంతానికి చెందిన 63 మందితో కూడిన బృందం ప్రత్యేక రైలుబోగీలో పలు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను ఈనెల 17 నుంచి సందర్శిస్తూ వచ్చారు. లక్నో నుంచి బయలుదేరిన ఈ రైలు బోగీలో చిన్న పిల్లలు కూడా ఉన్నారు. రామేశ్వరం తర్వాత శుక్రవారం ఈ బృందం కన్యాకుమారిలో పర్యటించింది. ఈ బృందం రిజర్వు చేసుకున్న ప్రత్యేక పర్యాటక బోగీని ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ఆయా మార్గాలకు వెళ్లే రైళ్లకు చివర్లో అనుసంధానించడం జరుగుతూ వచ్చింది. కన్యాకుమారి పర్యటన ముగించుకున్న ఈ బృందం బోగీని నాగర్‌కోయిల్ నుంచి పునలూరుకు వెళ్లే రైలుకు అనుసంధానించారు.

మంటలతో కలకలం

శనివారం వేకువజామున 3.45 గంటలకు పునలూరు రైలు మదురై జంక్షన్‌కు చేరుకుంది. ఈరైలు నుంచి బోగీని వేరు చేసి స్టాబ్లింగ్ లైన్‌లో ఉంచారు. ఇందులోని ప్రయాణికులు అనేక మంది గాఢ నిద్రలో ఉన్నారు. 5.15 గంటల సమయంలో ఈ బోగిలో మంటలు చెలరేగాయి. మంటల వ్యాప్తితో మదురై రైల్వేస్టేషన్‌లో కలకలం బయలుదేరింది. ఈబోగీలోని ప్రయాణికులు ప్రాణాలను రక్షించుకునేందుకు బయటకు పరుగులు తీశారు. ఓ మార్గం మూసి ఉండడంతో మరో మార్గం గుండా బయటకు దూకేశారు. అప్పటికే మంటలు క్రమంగా వ్యాపించడంతో ఇందులో పలువురు ప్రయాణికులు చిక్కుకున్నారు.

సహాయక చర్యలు..

సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేయడానికి రెండున్నర గంటలు శ్రమించారు. గాయపడ్డ వారిని మదురై రాజాజీ, రైల్వే ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది విగత జీవులయ్యారు. ఇందులో నలుగురు మహిళలు ఉన్నారు. గుర్తు పట్టలేంతగా కొన్ని మృతదేహాలు కాలిపోయాయి. ఇందులో ఐదుగురిని గుర్తించారు. గాయపడ్డ వారిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరగా ఉంది. ప్రాణాలతో, స్వల్పంగా గాయపడ్డ వారి పరిస్థితి దయనీయంగా మారింది. రైలు బోగీలో తమ వస్తువులన్నీ ఆహుతి కావడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. భాషాపరంగా సమస్య తలెత్తడంతో మనోవేదనలో పడ్డారు. అధికార యంత్రాంగం రంగంలోకి దిగి ఉత్తరాది వాసులను ప్రత్యేక శిబిరానికి తరలించారు. వీరికి మదురై కలెక్టర్ సంగీత తక్షణం వస్త్రాలను సిద్ధం చేసి అందజేశారు. రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖా మంత్రి మూర్తి, ఐటీ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను విస్తృతం చేయించారు. ఆయన బాధితులను పరామర్శించి ఓదార్చారు.

విషాదంతో..

ఎంతో ఆనందంగా ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తూ వచ్చిన ఈ బృందంలో ఒక్కసారి విషాదం చోటుచేసుకుంది. శనివారం ఒక్క రోజు గడిచి ఉంటే, ఆదివారం చెన్నైకు చేరుకుని లక్నోకు ఈ బృందం తిరుగు పయనం అయ్యేవారు. ఇంతలో ఈప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదం గురించి బోగీలో ఉన్న ధీరజ్ గుప్తా, శుక్లా పేర్కొంటూ నిద్రపోతున్న సమయంలో హఠాత్తుగా మంటలు వచ్చాయని పేర్కొన్నారు. ఓ మార్గం మూసి ఉండడంతో మరో మార్గం గుండా బయటకు దూకేశామని వివరించారు. కొందరు వృద్ధులు అయితే, బోగీ నుంచి బయటకు రాలేక మంటలకు ఆహుతి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఈ ప్రమాదానికి కారణం నిర్వాహకులు తెచ్చుకున్న గ్యాస్ సిలిండర్ అని విచారణలో తేలింది. ఈ బోగీలోని ప్రయాణికులకు టీ, కాఫీ తయారీకి రహస్యంగా సిలిండర్ తెచ్చుకున్నట్టు వెలుగుచూసింది. ఉదయం టీ తయారీ సమయంలోనే గ్యాస్ సిలిండర్ కారణంగా ప్రమాదం జరిగినట్టు విచారణలో నిర్ధారణ అయింది. ఈ ఘటనపై ఓ వైపు రైల్వే యంత్రాంగం, మరో వైపు అగ్నిమాపక శాఖ విచారణకు ఆదేశించింది. రైల్వే అధికారి సోమనాథ్ నేతృత్వంలో, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ అభాష్‌కుమార్ పర్యవేక్షణలో ఈ విచారణ జరుగుతోంది. రైల్వే ఎస్పీ సెంథిల్‌కుమార్ నేతృత్వంలోని బృందం కూడా విచారణ జరుపుతోంది. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహణ నిమిత్తం డాక్టర్లు చంద్రశేఖరన్, సదాశివం నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ నియమించింది. చెన్నై నుంచి మదురైకు చేరుకున్న ఆరోగ్యశాఖా మంత్రి ఎం సుబ్రమణియన్ ఆస్పత్రుల్లోని బాధితులను పరామర్శించి, మెరుగైన వైద్య చికిత్సకు ఆయన ఆదేశించారు.

సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి..

ఈ ప్రమాద సమాచారంతో సీఎం ఎంకే స్టాలిన్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. హుటాహుటిన మంత్రులను మదురైకు పంపించారు. సహాయక చర్యలను విస్తృతం చేయించారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తమిళనాడు ప్రభుత్వం తరపున రూ. 3 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. అలాగే, రైల్వే యంత్రాంగం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించింది. ఈ ప్రమాద ఘటనపై మదురై రైల్వే పోలీసులు ఓ వైపు, మదురై నేర విభాగం పోలీసులు మరో వైపు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ బోగిలో మంటలు చెలరేగిన సమయంలో పక్కనే ఉన్న ఓ ట్రాక్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు వెళ్లడంతో మంటలు ఎక్కడ వ్యాపిస్తాయో అన్న ఉత్కంఠ తప్పలేదు.



నిప్పునార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది



ప్రమాద స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఆరుగురి గుర్తింపు

రైలు బోగి దగ్ధంలో గుర్తుపట్టనంతగా మృతదేహాలు కాలిపోయాయి. ఇందులో ఆరుగురిని గుర్తించారు. ఇందులో ఉత్తరప్రదేశ్‌లోని హర్‌దోయ్ గ్రామానికి చెందిన పరమేశ్వర్ దయాళ్ గుప్తా(55), సీతాపూర్‌కు చెందిన శత్రుదమన్ సింగ్(65), మిథిలేష్ కుమారి(62), లక్మీపూర్‌కు చెందిన శాంతిదేవి(67), లక్నోకు చెందిన మనోరమ అగర్వాల్(80), హిమాని బన్సాల్(22)ల మృతదేహాలను అధికారులు గుర్తించారు. మిగిలిన ముగ్గురి మృతదేహాలను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి సుబ్రమణ్యం



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి మూర్తి, కలెక్టర్ సంగీత



మీడియాతో మాట్లాడుతున్న దక్షిణ రైల్వే అదనపు డైరెక్టర్ వనిత



మృతదేహాన్ని తరలిస్తున్న వైద్యసిబ్బంది

అన్నదాతకు అండగా ఉండండి

- అధికారులకు సీఎం ఆదేశం
- 'ఈశాన్యం' సీజన్‌లోపు పనుల ముగింపు
- నాలుగు జిల్లాల్లో ఫీల్డ్ సర్వే





అధికారులు, మంత్రులతో సీఎం స్టాలిన్ సమావేశం

సాక్షి, చెన్నై: అన్నదాతలకు అండగా ఉండాలని, వారికి అందుబాటులో ఉండి కావాల్సిన సహకారం అందించాలని జిల్లా స్థాయి అధికారులను సీఎం ఎంకే స్టాలిన్ ఆదేశించారు. ఈశాన్య రుతుపవనాల సీజన్ నాటికి అన్ని పనులు ముగించాలన్నారు. సీఎం ఎంకే స్టాలిన్ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆయా జిల్లాల్లో ప్రగతి పనులు, పథకాల తీరు తెన్నులను అధ్యయనం చేస్తున్న విషయం తెలిసిందే. డెల్టా జిల్లాల పర్యటనలో భాగంగా శనివారం నాగపట్నం కలెక్టరేట్‌లో అధికారులతో సీఎం స్టాలిన్ సమావేశమయ్యారు. నాగపట్నం, తిరువారూర్, తంజావూరు, మైలాడుతురై జిల్లాల కలెక్టర్లు, జిల్లా స్థాయిలోని వివిధ విభాగాల అధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఆయా విభాగాల వారీగా పనితీరును సమీక్షించారు. సీఎం స్టాలిన్ మాట్లాడుతూ తాను తమిళనాడు ముఖ్యమంత్రిగానేకాదు, ఈ డెల్టా జిల్లాలకు చెందిన వ్యక్తిగా ఇక్కడికి వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ జిల్లాల అభివృద్ధి, వ్యవసాయం, రైతులకు ప్రోత్సాహంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ జిల్లాలో ప్రధాన వృత్తి వ్యవసాయం మాత్రమే అని గుర్తు చేస్తూ, రైతులకు అందుబాటులో ఉండాలని, అండగా ఉంటూ, వారికి కావాల్సిన సహకారం, ప్రోత్సాహం అందించాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు.

మద్దతు ధర..

రైతులు పండించే పంటకు మార్కెట్‌లో మద్దతు ధర దక్కే విధంగా ప్రత్యేక చొరవ చూపించాలని సూచించారు. ఈ జిల్లాలో పిల్లల్లో పౌష్టికాహారలోపం కనిపిస్తున్నదని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, విద్యార్థుల ఆరోగ్యసంక్షేమం లక్ష్యంగా చర్యలు విస్తృతం చేయాలని ఆరోగ్య అధికారులను సీఎం ఆదేశించారు. అలాగే, ఈశాన్య రుతుపవనాల సీజన్ వస్తున్నదని, అంతలోపు గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు పనులు విస్తృతం చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని పనులు ముగించాలని ఆదేశించారు. మంత్రులు ఎంఆర్‌కే పన్నీరుసెల్వం, ఉదయనిధి స్టాలిన్, రఘుపతి, అన్బిల్ మహేశ్ పొయ్యామొళి, శివ మెయ్యనాథన్, టీఆర్‌పీ రాజా, కలెక్టర్లు పాల్గొన్నారు. అనంతరం నాగపట్నంలో సామాజిక సేవా రంగంలో రాణిస్తున్న 8 మంది ప్రభుత్వ ఉద్యోగులు, నలుగురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సీఎం స్టాలిన్ సత్కరించారు.

సవాళ్లను అధిగమించాలి..

కొన్ని చోట్ల పథకాల అమల్లో సవాళ్లు ఎదురవుతున్నట్టు సమాచారం వచ్చిందని, వీటన్నింటిని అధిగమించాలని సూచించారు. ఉపాధి పథకం, కలైంజ్ఞర్ అన్ని గ్రామాలకు మెరుగు పరిచిన వ్యవసాయ అభివృద్ధి పథకం, అన్నా పునరుజ్జీవన పథకం, సీఎం గ్రామీణ రోడ్డు అభివృద్ధి పథకాలకు ప్రాధాన్యతను పెంచాలని వివరించారు. వ్యవసాయం సాగు విస్తీర్ణం తగ్గుతున్న ప్రాంతాలను గుర్తించి, ఇక్కడ వ్యవసాయ ఉత్పత్తుల ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి పెట్టే ప్రయత్నాలు చేయాలన్నారు. కూరగాయలు, పండ్ల ఉత్పత్తి పెంపునకు చర్యలు తీసుకోవాలన్నారు. కొబ్బరిచెట్లు ఈ జిల్లాలో తగ్గుతున్నాయని గుర్తు చేస్తూ, ఇటీవల కాలంగా ప్రకృతి వైపరీత్యాలతో పాటు ఆదాయం తగ్గడంతో రైతులు కొబ్బరిపై దృష్టి పెట్టడం లేదని తాను భావిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇలాంటి వారిని కలిసి కొబ్బరి చెట్ల విస్తీర్ణం పెంపునకు , వారికి కావాల్సిన సహకారం, ప్రోత్సాహం అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

డిజిటల్ ఇండియాతో అవినీతికి చెక్

- గవర్నర్ ఆర్ఎన్ రవి



సాక్షి, చెన్నై: డిజిటల్ ఇండియా రూపంలో దేశంలో అవినీతికి కేంద్రం చెక్ పెట్టినట్టు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి తెలిపారు. తిరుచ్చిలోని ఐఐఎంలో శనివారం జరిగిన సదస్సుకు గవర్నర్ హాజరయ్యారు. ఇందులో ఆయన ప్రసంగిస్తూ ప్రజలకు ప్రభుత్వం ఒక్క రూపాయి కేటాయిస్తే, లబ్ధిదారులకు కేవలం 15 పైసలు మాత్రమే దరిచేరుతుండేదన్నారు. మిగిలిన 85 పైసలు అవినీతిపరుల చేతుల్లోకి చేరేదని చెప్పారు. ఈ అవినీతికి చెక్ పెట్టడం లక్ష్యంగా డిజిటల్ ఇండియాను తీసుకొచ్చారని వివరించారు. డిజిటల్ ఇండియా రూపంలో లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాలోకి నేరుగా ప్రభుత్వ పథకాలకు సంబంధించిన మొత్తాలు జమ అవుతున్నాయని వివరించారు. దేశంలో 5 మిలియన్ జన్ ధన్ బ్యాంక్ ఖాతాలు ఉన్నాయని ఇందులో 56 శాతం మహిళలు అని గుర్తు చేశారు. ప్రస్తుతం మహిళల బ్యాంక్ ఖాతాల్లోకి నగదు జమ అవుతోందని, దళారులు, అవినీతిపరులకు చెక్ పెట్టడంలో డిజిటల్ ఇండియా కీలక భూమిక పోషిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఉత్తమ నాయకుడు..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇలాంటి సదస్సులు కొత్త సామర్థ్యాలకు, కొత్త అంశాలు, అపార అనుభవాలు, అభిప్రాయాలను పంచుకునేందుకు ఎంతో ఉపయోగకరంగా పేర్కొన్నారు. ఉత్తమ నాయకుడు మార్పు కోసం ఎదురుచూడడని, మార్పును సృష్టిస్తాడని వివరించారు. తమిళనాడులోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న గ్రామీణ విద్యార్థి సౌరశక్తితో పనిచేసే ఐరన్ బాక్స్‌ను రూపొందించాడని గుర్తు చేస్తూ, ఇలాంటి పరిశోధనలు విస్తృతం కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విజన్‌తో ముందుకెళ్తోందని, అందుకే దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందన్నారు.

కోవైకు స్మార్ట్ అవార్డు

సాక్షి, చెన్నై: కోయంబత్తూరుకు కేంద్ర ప్రభుత్వ స్మార్ట్ అవార్డు వరించింది. స్మార్ట్ సిటీలపై కేంద్రం దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. ఆయా నగరాల్లో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పలు అంశాల ఆధారంగా స్మార్ట్ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. చెరువులు, కొలను అభివృద్ధి, రోడ్ల మెరుగులు అంశాలకు సంబంధించి ఈ ఏడాది రాష్ట్రంలోని కోయంబత్తూరుకు అవార్డు దక్కింది.

బాధిత కుటుంబానికి భరోసా

- రూ. 25 లక్షల ఆర్థికసాయం

కొరుక్కుపేట: తిరుచ్చిలో గస్తీ విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి రూ. 25 లక్షలు ఆర్థిక సాయం అందజేస్తామని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రకటనలో తిరుచ్చి సిటీలోని అరియమంగళం ట్రాఫిక్ కంట్రోల్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీధర్ (45) గత నెల 30న మృతిచెందాడు. రైల్వే బ్రిడ్జి వద్ద రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కారు ఢీకొనడంతో మృతిచెందాడు. దీంతో సీఎం స్టాలిన్ శ్రీధర్ మృతిపై సంతాపం తెలిపారు. శ్రీధర్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలియజేస్తూ ఆయన కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించారు.

ఆరు బస్టాండ్ల ఆధునికీకరణ

కొరుక్కుపేట: ఉత్తర చెన్నైలోని తిరువీకానగర్‌తో పాటు ఆరు బస్‌స్టేషన్లను ఆధునిక సౌకర్యాలతో అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు సీఎండీఏ అధికారులు తెలిపారు. చెన్నైలోని ప్రధాన బస్టాండ్‌ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. తిరువికానగర్, తాండయార్ పేట, కన్నదాసన్ నగర్, ముల్లై నగర్ (సీఎండీఏ) పెరియార్ నగర్, అంబత్తూర్ ఎస్టేట్ వద్ద ఆరు బస్టాండ్‌లను పునరుద్ధరించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసినట్టు సీఎండీఏ అధికారులు తెలిపారు.

సామాజిక మాధ్యమాలకు 30 వేల మంది

తమిళసినిమా: నటుడు విజయ్ ప్రజాసంఘం ఇప్పుడు సామాజిక మాధ్యమాలను వాడుకుంటూ మరింత బలంగా ముందుకు సాగే ప్రయత్నానికి సిద్ధం అవుతోంది. ఇది చూస్తుంటే విజయ్ రాజకీయాల్లోకి రంగప్రవేశం చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈయన అభిమానులు ఇప్పటికే రాజకీయాల్లో ఉన్న విషయం తెలిసింది పంచాయతీ ఎన్నికల్లో పలు వార్డుల్లో పోటీ చేసి గెలుపొందారు. విజయ్ రంగప్రవేశమే తదుపరి అనే ప్రచారం జోరుగా సాగుతుంది. విజయ్ ఆంజనేయ సంఘం ఇప్పటికే ప్రజాసంఘంగా మార్చి రాష్ట్రవ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లోకి చొచ్చుకుపోతోంది. కాగా ఈ సంఘం ద్వారా పలు విభాగాలను ఏర్పాటు చేశారు. తాజాగా సామాజిక మాధ్యమాలను వాడుకునే ప్రయత్నం చేశారు. ఇందులోభాగంగా శనివారం ఉదయం విజయ్ అభిమాన సంఘం కార్యదర్శి బుస్సీ ఆనంద్ నేతృత్వంలో పనైయూర్‌లోని విజయ్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు ఇందులో రాష్ట్రంలోని 234 నియోజకవర్గాలకు చెందిన అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సామాజిక మాధ్యమాల కోసం 30 వేల మందిని నియమించారు. బుస్సీ ఆనంద్ మాట్లాడుతూ విజయ్ ప్రజాసంఘాన్ని మరో స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నామని, అందులో భాగంగా సామాజిక మాధ్యమాలను వాడుకోవాలని పేర్కొన్నారు. తమ సంఘానికి చెందిన ప్రతి విషయాన్ని ప్రజల్లోకి చేరే విధంగా వాట్సాప్‌లను వినియోగించాలని చెప్పారు. అదే విధంగా 234 నియోజకవర్గాల్లో జరిగే విషయాలను క్లుప్తంగా వీడియోలో చిత్రీకరించి సంఘం ప్రధాన నిర్వాకానికి పంపించాలని కోరారు. అలాంటి వాటిని ప్రధాన నిర్వహణ లేకుండా ప్రచారం చేయరాదన్నారు. అదేవిధంగా ఏ విషయంలోనూ కుల,మత వివక్షతకు పాల్పడరాదన్నారు.



మాట్లాడుతున్న బుస్సీ ఆనంద్

చెన్నై ఆదివారం । 27 । ఆగస్టు । 2023 సాక్షి

క్లుప్తంగా

విద్యతోనే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న వీరరాఘవరావు

కొరుక్కుపేట: విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ వీరరాఘవరావు అన్నారు. తాంబరం వద్ద ముడిచ్చూర్ రోడ్డులో ఉన్న టీఎంజీ కాలేజ్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో వీరరాఘవరావు పాల్గొని పిల్లలకు భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవాలి అనే అంశం మాట్లాడారు. జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి విద్యే ఆయుధం అని హితవుపలికారు. కళాశాల చైర్మన్ డాక్టర్ గుణరాజా, డాక్టర్ శివ కుమారి, ప్రిన్సిపల్ డాక్టర్ పద్మిని పాల్గొన్నారు.

ఘనంగా బీపీ మండల్ జయంతి



బీపీ మండల్ చిత్రపటానికి నివాళి

కొరుక్కుపేట: తమిళనాడు యాదవ మహాసభ ఆధ్వర్యంలో బిహార్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మండల్ కమిషన్ మాజీ చైర్మన్ బీపీ మండల్ 105వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చెన్నై టీ.నగర్‌లోని సర్ పిట్టి. త్యాగరాయహాలులో శనివారం జరిగిన వేడుకలకు ద్రావిడ దేశం అధ్యక్షుడు వి.కృష్ణారావు హాజరయ్యారు. ముందుగా బీపీ మండల్ చిత్రపటానికి కార్యనిర్వాహకులు నివాళులర్పించారు. తమిళనాడు యాదవ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ నాసే రామచంద్రన్ అధ్యక్షత వహించారు. కృష్ణారావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేసి బడుగు బలహీన వర్గాల వారికి ఉద్యోగ అవకాశాలు లేకుండా చేస్తున్నారని, దీన్ని ప్రతిఘటిస్తూ ప్రతిఒక్కరూ రెండవ మండల్ ఉద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో యాదవ్ మహాసభ కార్యనిర్వాహకులు కే.ఎత్తిరాజ్, ఎంఎండీఏ గోపి, డాక్టర్ ముత్తులక్ష్మి, రామదాసు, నాగరాజన్, సేతు మాధవన్, సైదై మనోహరన్, కాశీనాథన్ పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌తో నీటి నిల్వకు చర్యలు

• మంత్రి దురైమురుగన్



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి దురైమురుగన్

వేలూరు: పొన్నై సమీపంలోని పాలారు నదిలో చెక్ డ్యామ్ నిర్మించి నీటిని నిల్వ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని మంత్రి దురైమురుగన్ అన్నారు. కాట్పాడి నియోజకవర్గం పొన్నై గ్రామంలో పురాతన ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ శనివారం ఉదయం జరిగింది. హాజరైన దురైమురుగన్ మాట్లాడుతూ ఇక్కడి అనంత పద్మనాభ స్వామి ఆలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందన్నారు. దీంతో స్థానికులు ఆలయం నిర్మించాలని కోరడంతో మూడు నెలల క్రితం దేవదాయశాఖ మంత్రిని రప్పించి ఆలయ నిర్మాణ పనులకు నిధులు విడుదల చేయించామన్నారు. ప్రస్తుతం రూ.41.50 లక్షలతో ఆలయ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే రాజగోపురం నిర్మాణ పనులకు ప్రత్యేక నిధులు తీసుకొస్తామన్నారు. పొన్నై ప్రజలు వర్షాలు కురిసిన సమయంలో పాలారులో నీరు రావడంతో బ్రిడ్జి లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల బ్రిడ్జి పనులు చేపట్టామని చెప్పారు. అదేవిధంగా సేర్‌కాడులో 300 పడకల ప్రభుత్వాస్పత్రిని నిర్మిస్తున్నామన్నాని చెప్పారు. సేర్‌కాడులో సిప్‌కాడ్ ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగాలు పొందే విధంగా ప్రత్యేక పథకాలను తీసుకొచ్చి ఈ పనులను శంకుస్థాపన కూడా చేశామన్నారు. రాష్ట్రంలో ఏ నియోజక వర్గంలో జరగని అభివృద్ధి పనులు కాట్పాడిలో జరుగుతున్నాయన్నారు. కలెక్టర్ కుమరవేల్ పాండియన్, దేవదాయ శాఖ జిల్లా చైర్మన్ అశోకన్, కాట్పాడి యూనియన్ చైర్మన్ వేల్‌మురుగన్, పార్టీ యూనియన్ చైర్మన్లు శరవణన్, తనికాచలం, ఆలయ చైర్మన్ వెంకటేశన్, దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ రమణి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం



సిమెంట్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్

తిరువళ్లూరు: పట్టణంలో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే రాజేంద్రన్ తెలిపారు. బజారురోడ్డులో ఇటీవల నిర్మించిన సిమెంట్ రోడ్డును మున్సిపల్ కమిషనర్ సురేందర్‌షాతో కలిసి శనివారం ఉదయం పరిశీలించారు. తిరువళ్లూరు బజారువీధి నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక్కడ వ్యాపార దుకాణాలు, కూరగాయలు, పూల మార్కెట్లు ఉండడంతో ప్రజల రాకపోకలు ఎక్కువగా సాగిస్తున్నారు. అయితే ఈ రోడ్డులో సబ్‌వే మరమ్మతుల కోసం తవ్వకాలను చేపట్టారు. దీంతో రోడ్డు దెబ్బతింది. వర్షం పడితే బురదమయంగా మారుతోంది. ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఇదే సమయంలో వర్షపు నీరు వెళ్లే కాలువల్లో సైతం మట్టి పేరుకుపోయింది. దీంతో సిమెంట్ రోడ్డు నిర్మాణంతో పాటు వర్షపు నీటి కాలువల్లో ఉన్న మట్టిని వెలికితీసి ఎత్తును పెంచాలని వ్యాపారులు కోరారు. ఎమ్మెల్యే నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణం, వర్షపు నీరు వెళ్లే కాలువల ఎత్తు పనులను పూర్తి చేశారు. పనులు పూర్తయిన ప్రాంతాలను రాజేంద్రన్, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. నాణ్యత విషయంపై ఆరా తీశారు. డీఎంకే నేతలు మోతీలాల్, అరుణజైకృష్ణ, పాన్‌పాండ్యన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవిందరాజు ఉన్నారు.

చంద్రవిలాసపురంలో వైద్యశిబిరం



స్టాల్స్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి: చంద్రవిలాసపురంలో ఆరోగ్యశాఖ వైద్య శిబిరం నిర్వహించింది. ఆర్కేపేట యూనియన్ చంద్రవిలాసపురం ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలలో మండల వైద్యధికారి తమిళసెల్వన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 500 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారు. తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ శిబిరాన్ని ప్రారంభించారు. ఏర్పాటు చేసిన ఆరోగ్య శాఖ స్టాల్స్ ను ప్రారంభించారు. అలాగే గర్భిణులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పౌష్టికాహార కిట్ అందజేశారు. అవసరమైన వారిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోహన్, యూనియన్ చైర్‌పర్సన్ రంజిత, బీడీఓ కలైసెల్వి పాల్గొన్నారు

• ఒప్పందం...



విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు అవకాశాల కల్పన దిశగా చెన్నైలోని జెరూసలేం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎన్ఎస్సీ మెంటరింగ్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా శనివారం ఇంటర్ సెల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పంద పత్రాలపై ఠాగూర్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎం మాల , ఇంటర్ సెల్ సీఈఓ అరుణాభ్ వర్మ సంతకం చేశారు. - సాక్షి, చెన్నై

• ఆవిష్కరణ



ఎంవీ హాస్పిటల్ ఫర్ దయాబెటీస్ కొత్త లోగోను ఆవిష్కరించింది. దివంగత ప్రొఫెసర్ ఎం విశ్వనాథన్ శతజయంతిని పురస్కరించుకుని శనివారం జరిగిన వేడుకలో చెన్నై కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్, రాయపురం ఎమ్మెల్యే ఐడ్రీమ్స్ మూర్తి లోగోను ఆవిష్కరించారు. సింగార చెన్నైలో భాగంగా నగర సుందరీకరణకు తమ తరపుపెద్ద ఎత్తున మొక్కలను ఈసందర్భంగా ఆస్పత్రి హెడ్ డాక్టర్ విజయ్ విశ్వనాథన్ చెన్నై కార్పొరేషన్‌కు అందజేశారు. - సాక్షి, చెన్నై

ఓటేరిలో చోరీ

తిరువొత్తియూరు: చెన్నై ఓటేరులో ఇంటి తాళాలు తెరిచి 14 గ్రాముల బంగారం, నగలు చోరీ చేశారు. జమాలియా హైదర్ గార్డెన్‌కు చెందిన అంకయ్య (50), లక్ష్మి (43) దంపతులు కూలీలు. శుక్రవారం ఉదయం ఇంటికి తాళం వేసి పనికి వెళ్లారు. సాయంత్రం వచ్చి చూడగా ఇంటి తలుపు తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా 14 గ్రాముల బంగారు నగలు, రూ.5 వేల నగదు అదృశ్యమైనట్లు గుర్తించారు. ఫిర్యాదు మేరకు ఓటేరి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

మూడు దశాబ్దాలకు నెరవేరిన కల

• రూ.6.72 లక్షలతో సిమెంట్ రోడ్డు



కొత్తగా వేసిన సిమెంట్ రోడ్డు

కొరుక్కుపేట: మూడు దశాబ్దాలకు పెరంబూర్‌లోని శ్రీనివాసరాఘవన్ వీధిలో నివాసం ఉంటున్న ప్రజల కల నెరవేరింది. ఎన్నో ప్రభుత్వాలు మారినా ఎట్టకేలకు రూ.6.72 లక్షలతో సిమెంట్ రోడ్డు వేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొలత్తూర్ నియోజకవర్గ పరిధి పెరంబూరులోని సెంబియం, డివిజన్ 70, జయగార్డెన్స్ శ్రీనివాస రాఘవన్ వీధిలో మూడు దశాబ్దాలుగా కార్పొరేషన్ అధికారులకు అనేక మార్లు రోడ్డు వేయాలని స్థానికులు విన్నవించారు. సంవత్సరాలు గడిచినా, ప్రభుత్వాలు మారినా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో అది ఒక కలగానే మిగిలిపోయింది. ఈ క్రమంలో స్థానిక కౌన్సిలర్ శ్రీధని అధికారులతో మాట్లాడి ఎట్టకేలకు కొత్త రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో సిమెంట్ రోడ్డు వేశారు. రోడ్డు వేయడానికి కృషిచేసిన కౌన్సిలర్ శ్రీధనికి ఆ ప్రాంత ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

డీఎంకే-కాంగ్రెస్ కూటమితోనే మైనారిటీలకు రక్ష



సీఎస్‌కండ్రిగ గ్రామంలో ప్రచారం చేస్తున్న డీఎంకే నాయకులు

పళ్లిపట్టు: డీఎంకే-కాంగ్రెస్ కూటమితోనే మైనారిటీలకు రక్షణ ఉంటుందని డీఎంకే నాయకుడు ఈరోడ్డు ఇరైవన్ అన్నారు. పళ్లిపట్టు యూనియన్ సీఎస్.కండ్రిగ ముస్లిం గ్రామంలో ఆ పార్టీ నాయకులు లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీఎంకే మండల కార్యదర్శి సీజీ. శ్రీనివాసన్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. బీజేపీ మతాలు, కులాలుగా విడగొట్టి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. పేదల జీవితాలు మెరుగుపడాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాల్సిందేనని తెలిపారు. అన్నీ వర్గాల ప్రజలు కాంగ్రెస్-డీఎంకే కూటమిని ఆదరించాలని కోరారు. నేతలు దండపాణి, తిరుమలై లోకనాథం, నాగవేలు పాల్గొన్నారు.

కోలీవుడ్ టాక్స్



కిరణ్

తప్పుడు నిర్ణయంతో జీవితం నాశనం

తమిళసినిమా: కోలీవుడ్‌లో విక్రమ్‌కు జంటగా నటించి మెరిసిన ఉత్తరాది భామ కిరణ్. ఆ తరువాత అజిత్, కమలహాసన్ వంటి ప్రముఖ నటులతో నటించి అగ్రస్థాయికి చేరుకుంది. అందాలారబోతకు వెనుకాడని నటి ఈ అమ్మడు. అలా మంచి ఫామ్‌లో ఉన్న కిరణ్ అనూహ్యంగా సినిమాలకు దూరమైంది. అలా చాలాకాలం తర్వాత మళ్లీ సోషల్ మీడియాలో యాక్టివ్ అయ్యింది. ఆ మధ్య కార్తీ కథానాయకుడిగా నటించిన శకుని చిత్రంలో చిన్న పాత్రలో నటించింది. తాజాగా నటుడు విజయ్ కథానాయకుడుగా నటిస్తున్న లియో చిత్రంలో నటించినట్లు కిరణ్ పేర్కొంది. ఆమె మాట్లాడుతూ తాను ఒక వ్యక్తిని పిచ్చిగా ప్రేమించానని చెప్పింది. అతన్నే పెళ్లి చేసుకోవాలని కోరుకున్నానంది. అయితే ఆ ప్రేమ ఫెయిల్ అయ్యిందని చెప్పింది. దాంతో తన మనసు ముక్కలైపోయిందని పేర్కొంది. సినిమాలు కొద్ది కాలం లేకపోవడానికి ప్రేమలో ఓడిపోవడమే కారణం అని చెప్పింది. అప్పుడు సరిగా ఉన్నట్లయితే నటిగా మంచి స్థాయికి చేరుకునేదానినంది. తప్పుడు నిర్ణయం కారణంగానే తమ జీవితం నాశనమైందని ఆవేదనను వ్యక్తం చేసింది. ఇప్పుడు మళ్లీ నటించాలని కోరుకుంటున్నానని అయితే ఎవరు అవకాశాలు ఇవ్వడం లేదని చెప్పింది. తాను మొదట్లో ఐదు విజయవంతమైన చిత్రాలు నటించినా ఇప్పుడు ఒక్కరు కూడా తనను నటించడానికి పిలవకపోవడం బాదాకరమన్నారు. కొత్త దర్శకుల చిత్రాల్లో నటించడానికి కూడా రెడీ అని కిరణ్ పేర్కొంది.

నేను ఎవరినీ అవకాశాలు అడగలేదు



చంద్రముఖి-2 చిత్ర ఆడియో ఆవిష్కరణ

తమిళసినిమా: గతంలో రజనీకాంత్ కథానాయకుడు నటించిన చంద్రముఖి చిత్రం ఘనవిజయాన్ని సాధించిన విషయం తెలిసిందే. 18 ఏళ్ల తర్వాత దానికి సీక్వెల్‌గా రూపొందుతున్న చిత్రం చంద్రముఖి-2. ఆ చిత్ర దర్శకుడు పి.వాసు దీనికి దర్శకత్వం వహించారు. లారెన్స్ కథానాయకుడిగా నటించిన ఇందులో బాలీవుడ్ బ్యూటీ కంగనా రనౌత్ చంద్రముఖిగా నటించడం విశేషం. నటుడు వడివేలు ముఖ్యపాత్ర పోషించారు. ఆస్కార్ అవార్డు గ్రహీత ఎంఎం కీరవాణి సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి ఆర్డీ రాజశేఖర్ అందించారు. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈ భారీ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తిచేసుకుని వినాయక చతుర్థి సందర్భంగా సెప్టెంబర్ 15న తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి చెన్నైలోని ఒక విశ్వవిద్యాలయంలో చంద్రముఖి-2 చిత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఎం కీరవాణి మాట్లాడుతూ తనను మళ్లీ తమిళ చిత్ర పరిశ్రమకు తీసుకువచ్చిన లైకా ప్రొడక్షన్స్‌కు, పి.వాసుకు కతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ఈ చిత్రంలో ఐదు పాటలు ఉంటాయని చెప్పారు. నిర్మాత సుభాస్కరన్ తమిళ సినిమాకు దక్కిన భాండాగారం అని దర్శకుడు పి.వాసు పేర్కొన్నారు. కంగనారనౌత్ మాట్లాడుతూ తన జీవితంలో ఇప్పటివరకు ఎవరి వద్ద ఎలాంటి అవకాశాన్ని కోరలేదు అన్నారు అలాంటిది దర్శకుడు పి. వాసు వద్ద చంద్రముఖిగా నటించడానికి తాను నప్పుతానా అని అడిగాను అన్నారు. అందుకు ఆయన కొంచెంసేపు ఆలోచించి ఓకే అని చెప్పారన్నారు. లారెన్స్ మాట్లాడుతూ తాను సహాయ నృత్య కళాకారుడుగా నటిస్తున్నప్పుడే పి వాసు దర్శకత్వం వహించిన చిత్రాలకు పనిచేశానన్నారు. ఆ తర్వాత నృత్య దర్శకుడుగా, నటుడుగా, దర్శకుడుగా చిత్రాలు చేసిన తాను కథానాయకుడిగా నటించిన చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారన్నారు. ఇలా 40 ఏళ్లకుపైగా పి వాసు సక్సెస్‌ఫుల్ దర్శకుడుగా కొనసాగుతున్నారని అన్నారు. తాను ఈ చిత్రంలో వేట్టైయాన్ పాత్రలో నటించానని, దీనికి లభించే ప్రశంసలన్నీ ఆయనకే చెందుతాయని లారెన్స్ పేర్కొన్నారు.

అలాంటి చిత్రాలే హిట్టవుతున్నాయి



రెడ్ శాండిల్ ఉడ్ చిత్ర యూనిట్

తమిళసినిమా: విభిన్న కథా చిత్రాలను ఎంపిక చేసుకుని నటిస్తున్న నటుడు వెట్రి తాజాగా నటించిన చిత్రం రెడ్ శాండిల్ వుడ్. జేఎస్ సినిమాస్ పతాకంపై జే పార్థసారథి నిర్మించిన విచిత్రానికి గురు రామానుజమ్ దర్శకత్వం వహించారు. నటుడు ఎంఎస్ భాస్కర్ గణేష్ వెంకట్రాం కేజీఎఫ్ ఫేమ్ రామ్ కబాలి విశ్వ ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈసందర్భంగా శుక్రవారం సాయంత్రం చిత్ర ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఇందులో నటుడు నిర్మాత కె రాజన్, దర్శకుడు పేరరసు, ఆర్వీ ఉదయ్‌కుమార్, వీజెడ్.దురై, వాణిజ్య సంఘం అధ్యక్షుడు విక్కీ రామరాజ ముఖ్యఅతిథులుగా పాల్గొని చిత్ర ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఇది ఎర్రచందనం స్మగ్లింగ్ ఆరోపణలు పేరుతో బలేనా అమాయకుల నేపథ్యంలో సాగే యథార్థ సంఘటనల ఇతివృత్తంతో కూడిన కథా చిత్రం అని దర్శకుడు తెలిపారు. 2015లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ఆయన చెప్పారు. చిన్నపిల్లలు ఆడుకునే బొమ్మలను తయారు చేసి క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే గంధపు చెక్కలను విదేశాలకు చేస్తూ చైనా నుంచి ప్లాస్టిక్ బొమ్మలను దిగుమతి చేసుకునే పరిస్థితి నెలకొందని చిత్ర కథానాయకుడు వెట్రి పేర్కొన్నారు. ఇలాంటి పలు ఆసక్తికరమైన రెడ్ శాండిల్ వుడ్ చిత్రాన్ని అందరూ చూడాల్సిన అవసరం ఉందన్నారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ చిత్ర ట్రైలర్ చూడగానే మనసు ద్రవించిందన్నారు. ఎక్కడ చూసినా సమస్యలు, అకారణంగా బాధింపునకు గురైన, శిక్షించబడిన వారే కనిపిస్తున్నారన్నారు. అలాంటి సంఘటన వెనుక ఎవరో ఉంటున్నారన్నారు. వారి వల్ల అమాయకపు తమిళ ప్రజలే బాధింపునకు గురవుతున్నారు అన్నారు. ఇప్పుడు పెద్ద హీరోలు నటించిన చిత్రాలు లేదా, సహజత్వంతో కూడిన చిత్రాలు మాత్రమే విజయాన్ని సాధిస్తున్నాయన్నారు. అలా ఈ చిత్రం జాతీయ అవార్డులు అందుకోవాలని కోరుకుంటున్నాను అని పేరరసు పేర్కొన్నారు.

ప్రజన్ స్టార్‌గా ఎదుగుతారు



అక్కు చిత్ర ఆడియో ఆవిష్కరణ

తమిళసినిమా: నటుడు ప్రజన్ కథానాయకుడిగా నటించిన చిత్రం అక్కు. నటి గాయత్రి నాయికగా నటించిన ఈ చిత్రాన్ని అంబికాపతి మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. వి స్టాలిన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమం పూర్తిచేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా శనివారం ఉదయం చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక సాలిగ్రామం లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించారు. ఇందులో నిర్మాత దర్శకుడు సీవీ.కుమార్, మోహన్ జి ,తిరుమలై, లొల్లుసభ జీవా పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. దర్శకుడు మోహన్ జి మాట్లాడుతూ నటుడు ప్రజన్ హీరోగా తాను వన్నియార్ పేట్టై చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో నిర్మించానన్నారు. ఆ చిత్రం 2011లో విడుదలైందన్నారు. ఆ చిత్రానికి ప్రజన్ అందించిన సహకారం ఎప్పటికీ మర్చిపోలేను అన్నారు. ఆయనలో మంచి నటుడు ఉన్నారని ఎందుకో గాని స్టార్ అంతస్తు ఇంకా రాలేదని అన్నారు. అందుకోసం ఆయన నిరంతరం పోరాడుతూనే ఉన్నారని ఖచ్చితంగా కథానాయకుడి స్థాయికి చేరుకుంటారని అన్నారు. అది ఈ అక్కు చిత్రంతోనే కావచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చిత్ర దర్శకుడు ది స్టాలిన్ మాట్లాడుతూ తాను ఒక బ్యాంకు ఉద్యోగం మానేసి దర్శకుడుగా పరిచయమయ్యానన్నారు. ఈ చిత్రాన్ని రూపొందించడానికి చాలా కష్టాలను ఎదుర్కొన్నా మని చెప్పారు. తనను నమ్మి అవకాశాన్ని కల్పించిన నిర్మాతకు ధన్యవాదాలు చెప్పుకుంటున్నానన్నారు. అయితే ఎన్ని సమస్యలను ఎదుర్కొన్నా చిత్రం బాగా వచ్చిందని, ఇది విజయాన్ని సాధిస్తుందనే నమ్మకం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పోరాడితే ఫలితం ఉంటుందనే అభిప్రాయాన్ని ప్రజన్ వ్యక్తం చేశారు.



తమన్నా

నా గ్లామర్ రహస్యం ఇదే!

తమిళసినిమా: అం దం తిన్నానండి. అందుకే ఇలా ఉన్నాయండి అని ఒక పాటలో తన అందం గురించి తానే పొగుడుకున్న నటి తమన్నా భాటియా. అది నిజం కాకపోయినా ఈమె అందగత్తె అన్నది ముమ్మాటికీ నిజం అన్నది ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నటిస్తూ ఇప్పటికే బిజీగా ఉన్న తమన్నా వయసు 33 ఏళ్లు. నటిగా గత 18 ఏళ్లుగా తన అందాలను రకరకాల కోణాల్లో తెరపై ఆరబోస్తూనే ఉన్నారు. ఇటీవల నటించిన జైలర్ చిత్రంలో కూడా తాజా అందాలతో మెరిసిపోయి, ప్రేక్షకులను మైమరిపించారు. అంతగా అభిమానులకు కిక్ ఇస్తున్న తన అందం రహస్యాన్ని తమన్నా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొంటూ ఈ గ్లామర్ ప్రపంచంలో ఫిట్నెస్‌గా ఉండడం చాలా అవసరం అన్నారు. అందుకు శారీరక కసరత్తులు ఎంత ముఖ్యమో, ఆహారపు అలవాట్లు అంతే ముఖ్యమని పేర్కొన్నారు. తాను ఆహారపు అలవాట్లకు ప్రాముఖ్యతనిస్తానన్నారు. ఉదయం నట్స్, ఖర్జూరపండ్లు, అరటి పండ్లను సమానంగా తీసుకుని తింటానని చెప్పారు. మధ్యాహ్నం భోజనంలో బ్రౌన్ రైస్, పప్పు, కాయకూరలు తీసుకుంటానన్నారు. అదే విధంగా సాయంత్రం 5.30 డిన్నర్ ముగించేస్తానని, ఆ తరువాత మళ్లీ మరుసటి రోజు ఉదయం ఏమీ తిననని చెప్పారు. ఇలా 12 గంటలు తినకుండా ఉంటానన్నారు. దీంతో చర్మం కాంతులీనుతుందని చెప్పారు. ఇక గ్రీన్ టీ, ఆమ్లాజ్యూస్ వంటివి తన ఆరోగ్య రహస్యం ఒక భాగం అని మిల్కీ బ్యూటీ పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఊపిరి ఆడక గర్భిణి మృతి

అన్నానగర్: ఊపిరి ఆడక నిండు గర్భిణి మృతి చెందిన ఘటన శనివారం వ్యాసర్‌పాడిలో జరిగింది. చెన్నైలోని సెంగున్రం ప్రాంతానికి చెందిన సంతోష్ కుమార్ (30) భార్య ఇందుమతి(25) నిండు గర్భిణి. ప్రసవం కోసం వ్యాసర్‌పాడి ఎంకేపీ నగర్ తూర్పు 16వ క్రాస్ వీధిలోని పుట్టింటికి వచ్చింది. శుక్రవారం రాత్రి ఇంటి ట్యాంకులో నీళ్లు లేకపోవడంతో ఇందుమతి రాత్రి 12 గంటలకు మోటార్ స్విచ్ ఆన్ చేయడానికి వెళ్లింది. ఎంతకూ రాకపోవడంతో తల్లి వెళ్లి చూసింది. ఇందుమతి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని చూసి షాక్‌కు గురైంది. ఆమెను స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. ఊపిరాడక చనిపోయినట్లు వెల్లడించారు. ఎంకేపీ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఉద్యోగి మృతి

తిరువళ్లూరు: మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్‌ను సరి చేస్తున్న సమయంలో విద్యుత్‌షాక్‌కు గురై ఉద్యోగి మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా నరసింహాపురం గ్రామానికి చెందిన ఏలుమలై కుమారుడు అరుల్‌జ్యోతి(45) పేరంబాక్కంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో 20 ఏళ్లుగా వైర్‌మన్‌గా పని చేస్తున్నాడు. భార్య సావిత్రి(38), కుమారుడు కలైయరస్(21), కుమార్తె దర్శిని(17) ఉన్నారు. శుక్రవారం సాయంత్రం కొండంజేరి మేట్టుకాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురైంది. సరి చేయడానికి అరుల్‌జ్యోతితో పాటు మరో ఆరుగురు వెళ్లారు. పనులు చేస్తున్న సమయంలో అరుల్‌జ్యోతి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు మప్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విధులు నిర్వహించే సమయంలో భద్రత చర్యలు తీసుకోకపోవడమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

అన్నానగర్: తండయార్‌పేటలో శుక్రవారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో ఓ కార్మికుడు మృతి చెందాడు. వినాయకపురం తొమ్మిదో వీధిలో విల్లుపురం జిల్లాకు చెందిన ఆదిమూలం (58) కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం సాయంత్రం పని ముగించుకుని స్నానం చేసి ఇంట్లో ఉన్న విద్యుత్ ఫ్యాన్ వైరును స్విచ్ బోర్డుకు కలుపుతుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాసిమేడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు.

ఇంటిపై నాటు బాంబుతో దాడి

తిరువొత్తియూరు: కడలూరులో ప్రైవేటు ఆసుపత్రి ఉద్యోగి ఇంటిపై నాటు బాంబుతో దాడి చేసిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కుట్టియాం కుప్పానికి చెందిన మురుగానందం (47), సరళ (44) దంపతులు పుదువై రాష్ట్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. వీరికి మధుమిత, జనని అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం రాత్రి మురుగానందం ఇంట్లోని హాలులో నిద్రపోతున్నారు. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ కట్ అయింది. అప్పుడు ఇంటికి బయట రెండుసార్లు పెద్ద శబ్దం వినిపించింది. మురుగానందం భయాందోళనతో బయటకు వచ్చి చూడగా ఇంటి ముందు నాటు బాంబులు విసిరినట్లు తెలియ వచ్చింది. ఫిర్యాదు మేరకు ఎస్పీ రాజారామన్ సంఘటనా స్థలానికి వెళ్లి మురుగానందం, అతని భార్య సరళ, కుమార్తెల వద్ద విచారణ చేశారు.

రౌడీషీటర్ అరెస్ట్

తిరువొత్తియూరు: క్రైమ్ కేసులో కోర్టుకు డుమ్మా కొట్టిన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నై తురైపాకం కన్నగి నగర్‌కు చెందిన రాబర్ట్ అలియాస్ జైస్ రాబర్ట్ (32)పై వ్యాసార్‌పాడి, ఓటేరి తదితర పోలీస్‌స్టేషన్లలో 11 కేసులు ఉన్నాయి. పలు కేసులకు సంబంధించి ఏడాదిగా కోర్టుకు హాజరుకాకుండా అజ్ఞాతంలో ఉన్నాడు. ఈ క్రమంలో అతన్ని కోర్టులో హాజరుపరచాలని కోర్టు పోలీసులను ఆదేశించింది. దీంతో వ్యాసార్‌పాడి ఇన్‌స్పెక్టర్ అరుల్ మనిమారన్ నేతృత్వంలో పోలీసులు వ్యాసార్ పాడి కూట్రపేట్ ప్రాంతంలో దాగి ఉన్న రాబర్ట్‌ను అరెస్టు చేశారు. అతన్ని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరుపతి క్రైమ్: తిరుపతి- చంద్రగిరి మధ్య ఓ వ్యక్తి కేరళ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. తిరుపతి స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి వయసు 50 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 9440 627638లో సంప్రదించాలని సూచించారు.

స్విమ్స్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ



స్విమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకుంటున్న డాక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా: టీటీడీ స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్‌గా డాక్టర్ ఆర్‌వీ.కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. టీటీడీ జేఈఓ, స్విమ్స్ డైరెక్టర్‌గా ఉన్న సదాభార్గవి నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఆయన హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ప్రముఖ సీటీ సర్జరీ విభాగాధిపతిగా సేవలందించారు. ఈ క్రమంలో ఆయనను స్విమ్స్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

వీఐటీలో ఎస్‌ఐ రాత పరీక్ష ప్రశాంతం



వీఐటీ పరీక్ష కేంద్రంలో డీఐజీ ముత్తుస్వామి, ఎస్పీ మణివన్నన్ పరిశీలన



తిరువళ్లూరులో హాల్‌టికెట్‌ను తనిఖీ చేస్తున్న పోలీస్

వేలూరు: వేలూరు వీఐటీ యూనివర్సిటీలో ఎస్‌ఐ పోస్టుల భర్తీకి రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జనరల్ కేటగిరికి 100 మార్కులకుగాను ఉదయం 10 గంటలకు రాత పరీక్ష ప్రారంభమైంది. వేలూరు, తిరుపత్తూరు, రాణిపేట, తిరువణ్ణామలై జిల్లాలకు చెందిన 7,613 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘాకెమెరాలు ఏర్పాటు చేసి అభ్యర్థులపై నిఘా ఉంచారు. పరీక్ష కేంద్రంలోకి ముందుగా స్క్రీనింగ్ చేసిన తరువాతనే పరీక్ష హాలులోకి అనుమతించారు. వీఐటీలో జరిగిన పరీక్ష కేంద్రాన్ని వేలూరు డీఐజీ ముత్తుస్వామి, ఎస్పీ మణివన్నన్ తనిఖీ చేశారు. ఎటువంటి కాపీయింగ్ లేకుండా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ముగ్గురు అదనపు ఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, పోలీసులు మొత్తం 900 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ఎస్‌ఐ రాత పరీక్షలు

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా వ్యాప్తంగా శనివారం జరిగిన ఎస్‌ఐ రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. తమిళనాడు పోలీసు విభాగంలో ఖాళీగా వున్న 621 పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించారు. జిల్లా నుంచి 2,933 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరి కోసం శనివారం ఉదయం పది గంటల నుంచి రాత పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 8.30 గంటలకు పరీక్ష కేంద్రాలకు అనుమతించారు. అభ్యర్థుల కోసం పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాకలూరులోని సీసీసీ, శ్రీనికేతన్, డీఆర్‌బీసీసీ పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రానికి సమీపంలోని జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్‌లను మూసివేశారు. పరీక్షలకు డీఐజీ రాధిక, ఎస్పీ ఫకెర్లా సెఫాస్ కల్యాణ పర్యవేక్షించారు.

సముద్ర తీరంలో గంజాయి ప్యాకెట్లు

అన్నానగర్: వేదారణ్యం బీచ్‌లో శనివారం ఉదయం 40 కిలోల గంజాయి ప్యాకెట్లు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. కస్టమ్స్ అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నాగై జిల్లా వేదారణ్యంలోని కొడియాకరై బీచ్ సమీపంలో నాలుగున్నర కిలోమీటర్ల దూరంలో శనివారం ఉదయం 6 గంటలకు ఒడ్డున గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. సముద్రంలో చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులు గమనించి కస్టమ్స్ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు వాటిని పరిశీలించారు. 2 కిలోల చొప్పున 20 కవర్లలో 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలిసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

• బీచ్‌లో క్లీనింగ్ డ్రైవ్



కొరుక్కుపేట: 384వ మద్రాసు పుట్టిన రోజు (మద్రాసు డే)ను పురస్కరించుకుని స్విగ్గీ, భూమి స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా కలిసి చెన్నై బీసెంట్ నగర్ ఎలియట్స్ బీచ్‌లో క్లీనింగ్ డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా జరిగిన కార్యక్రమంలో స్విగ్గీ చెన్నై బృందం 100 మంది డెలివరీ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొని బీచ్‌లోని చెత్తను తొలగించారు. రీసైక్లబిలిటీ ద్వారా వేరు చేసిన చెత్తను స్థానిక మున్సిపల్ అధికారులకు అప్పగించారు. స్విగ్గీ ప్రతినిధులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఈ క్రమంలో తాము సామాజిక బాధ్యతగా చెత్తను తొలగించే క్లీనింగ్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు.

రైలు పట్టాలపై యువతి మృతదేహం

తిరువొత్తియూరు: అంబత్తూరు సమీపంలోని పట్రవాకం వద్దనున్న రైల్వే వంతెన కింద యువతి మృతదేహం ఉన్నట్లు అంబత్తూరు పారిశ్రామికవాడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ జై కృష్ణన్, పోలీసులు అక్కడికి వెళ్లారు. పెరంబూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండడంతో రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే పోలీసులు సంఘటన స్థలాలను వెళ్లి విచారణ చేశారు. మృతురాలు ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కూలీ ప్రీతి (20)గా తెలిసింది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కీల్పాక్కం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహానికి 10 మీటర్ల దూరంలో పడి ఉన్న ఆమె సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

క్రీడారంగంలో మహిళల సత్తా

• కేలో ఇండియా ఉమెన్స్ పెన్‌కాక్ లీగ్ రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభం

తిరుపతి సిటీ : క్రీడారంగంలోనూ మహిళలు సత్తా చాటుతున్నారని, ఇది శుభపరిణామమని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ భారతి ఆనందం వ్యక్తం చేశారు. పద్మావతి మహిళా వర్సిటీ, భారత క్రీడా మంత్రిత్వశాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా శనివారం వర్సిటీలో కేలో ఇండియా ఉమెన్స్ పెన్‌కాక్ లీగ్ రాష్ట్ర స్థాయి పోటీలను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ రెండు రోజులు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150 మంది మహిళా అథ్లెట్లు పాల్గొంటున్నారని తెలిపారు. మహిళలను క్రీడారంగంలో ప్రోత్సహించేందుకు ముందడుగుగా ఈ కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్ రజనీ, చిత్తూరు జిల్లా పెన్‌కాక్ సిలాట్ అసోసియేషన్ చైర్మన్ చంద్రశేఖర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ జి సారా సరోజిని పాల్గొన్నారు.



జెండా ఊపి ప్రారంభిస్తున్న వీసీ భారతి

దళిత ప్రజాఫ్రంట్ నేతల ఆందోళన



తిరుత్తణిలో దళిత ప్రజా ఫ్రంట్ ధర్నా

తిరుత్తణి: దళితులపై దాడులను అరికట్టాలనే డిమాండ్‌తో తిరుత్తణిలో శనివారం ధర్నా చేశారు. దళిత ప్రజాఫ్రంట్ అధ్యక్షుడు, న్యాయవాది తిరునావుక్కరసు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో పళ్లిపట్టు, తిర్తుతణి పరిసర ప్రాంతాల నుంచి ఆ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో దళిత విద్యార్థులపై దాడులు చోటుచేసుకుంటున్నాయని, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు రక్షణ కొరవడుతోందని ఆరోపించారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 69,529 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 29,227 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.85 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.



మాజీ మంత్రి రమణ సైకిల్ చోరీ

కొరుక్కుపేట: అన్నాడీఎంకే మాజీ మంత్రి రమణ ఖరీదైన సైకిల్ చోరీకి గురైంది. చెన్నైలోని అన్నానగర్‌లో నివాసముంటున్న రమణ రోజూ అన్నానగర్ టవర్ పార్క్ కాంప్లెక్స్‌లో వాకింగ్ వెళుతుంటారు. శనివారం ఉదయం రూ. 45 వేల విలువైన సైకిల్‌పై టవర్‌పార్క్ ప్రాంతానికి వచ్చారు. అనంతరం సైకిల్‌కు తాళం వేసి పార్కులో వాకింగ్ చేస్తుండగా సైకిల్ కనిపించకుండా పోయింది. ఆయన సహాయకులు సైకిల్ కోసం ఆ ప్రాంతమంతా వెతికినా కనిపించలేదు. దీంతో అన్నానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి అన్నానగర్ టవర్ మొత్తం ముమ్మరంగా సోదాలు చేశారు. మాజీ మంత్రి సైకిల్‌పై ఓ యువకుడు వెళుతుండగా అరెస్ట్ చేశారు. విచారణలో పట్టుబడిన వినోద్ కుమార్ (32) మానసిక పరిస్థితి బాగా లేదని గుర్తించారు. అతన్ని కిల్పాక్కంలోని మానసిక ఆసుపత్రిలో చేర్పించారు.

దంపతుల ఆత్మహత్య

అన్నానగర్: మధురై తాళ్లగాకుళం మీనాక్షిపురంలో దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. సత్యమూర్తి నగర్ 3వ వీధిలో నివాసం ఉంటున్న రాజ్ కుమార్ (46) కిరాణా వ్యాపారి. భార్య చిత్ర పుష్పం (42). వీరికి పిల్లలు లేరు. రాజ్‌కుమార్ తన భార్య, అత్త మాసిలరాజా పాండి (76)తో కలిసి ఈ నెల 23వ తేదీ దిండుక్కల్‌లోని కొడైకెనాల్‌కు వచ్చారు. బస్ స్టేషన్ సమీపంలోని హోటల్‌లో బస చేశారు. మూడు రోజులుగా పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. శుక్రవారం రాత్రి బస చేసిన గదికి తిరిగి వచ్చారు. మాసిలరాజా పాండి శనివారం ఉదయం లేచి చూసే సరికి కూతురు, అల్లుడు కనిపించలేదు. గదిలోని టాయిలెట్‌కి వెళ్లగా ఇద్దరూ ఉరికి వేలాడుతూ కనిపించారు. సమాచారం అందుకున్న కొడైకెనాల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారా? పిల్లలు లేక ఆత్మహత్యకు పాల్పడ్డారా? అని విచారణ చేస్తున్నారు.

55 సవర్ల నగలు చోరీ

తిరువొత్తియూరు: చెన్నై పల్లికరనై సాఫ్ట్‌వేర్ సంస్థ మేనేజర్ ఇంట్లో 55 సవర్ల నగలు చోరీకి గురయ్యాయి. చెన్నై పల్లికరనై ఢిల్లీబాబు నగర్‌కు చెందిన ప్రవీణ్ (45). ఇతను ప్రైవేటు సాఫ్ట్‌వేర్ సంస్థలో మేనేజర్. కొన్నిరోజుల క్రితం కుటుంబం సహా తిరువిడైందై పెరుమాళ్ ఆలయానికి వెళ్లారు. శుక్రవారం ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టబడి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి అందులో ఉన్న 55 సవర్ల నగలు, రూ.30 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పల్లికరనై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెక్స్ రాకెట్ గుట్టురట్టు

తిరువొత్తియూరు: చెన్నై సాలిగ్రామంలో వ్యభిచారం నిర్వహిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు యువతులను విడిపించారు. వివరాలు.. సాలిగ్రామం ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు విరుగంబాక్కం పోలీసులకు రహస్య సమాచారం అందింది. పోలీసులు ఆ ప్రాంతంలోని ఎస్ఎస్‌బీఐ కాలనీలో సాధారణ దుస్తులతో నిఘా ఉంచారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన యువకుడు మఫ్టీలో ఉన్న సబ్ ఇన్‌స్పెక్టర్ ఇలంవలుదితో మాటలు కలిపాడు. తరువాత సమీపంలో ఉన్న బహుళ అంతస్తు భవనంలో ఇద్దరు యువతులు ఉన్నారని, వారితో ఉల్లాసంగా గడిపేందుకు రూ. 5 వేలు ఇవ్వాలని చెప్పాడు. సరే అని చెప్పిన సబ్‌ఇన్‌స్పెక్టర్ యువతులు ఉన్న చోటుకు అతన్ని వెంటపెట్టుకుని వెళ్లారు. అక్కడ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలిసింది. పోలీసులు ఆ యువకుడిని అరెస్టు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

పోలీస్ అధికారికి గాయాలు

తిరువొత్తియూరు: నుంగంబాకం నెల్సన్‌మాణిక్యం రోడ్డులో పోలీస్‌జీపు అదుపు తప్పి వ్యాన్‌ను ఢీకొట్టడంతో సహాయ కమిషనర్, ఆయన డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. చెన్నై నుంగంబాక్కం మధురవాయల్ సర్కిల్ పోలీస్ సహాయ కమిషనర్(ఏసీపీ) సుబ్రహ్మణ్యన్, గస్తీ వాహన డ్రైవర్ మోహన్‌తో కలిసి శనివారం తెల్లవారుజామున అమందకరై నెల్సన్ మాణిక్యం రోడ్డులో గస్తీ చేస్తున్నారు. ఆ సమయంలో వాహనం అదుపు తప్పి వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏసీపీ, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని బయటకు తీసి ఆస్పత్రిలో చేర్చారు.

రూ.50 లక్షల చెట్ల నరికివేత

• 9 మందిపై కేసు నమోదు

కొరుక్కుపేట: అటవీశాఖకు చెందిన రూ.50 లక్షల విలువైన చెట్లను నరికేసిన కేసులో అన్నాడీఎంకే నేత సహా 9 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తూత్తుకుడి జిల్లాలోని కడచ్చపురం గ్రామంలో కల్లనేరి చెరువు 17 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం చెరువు ఎండిపోయి చెట్లు దట్టంగా పెరిగాయి. ఈ స్థితిలో కొన్ని రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా చెట్లను నరికి వాహనాల్లో తరలిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న డిప్యూటీ వార్డు డెవలప్‌మెంట్ అధికారి మసన ముత్తు, పంచాయతీ అధ్యక్షుడు పొన్మురుగేషన్, శుక్రవారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహించారు. చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. చెట్లను నరికిన వ్యక్తులు తప్పించుకునేందుకు ప్రయత్నించారు. వీరిలో ఇద్దరిని పోలీసులు పట్టుకుని విచారణ జరిపారు. విచారణలో చెట్ కులతయైకి చెందిన అమల్‌రాజ్ (30), లారీ డ్రైవర్ విజయరాజ్ (62)గా గుర్తించారు. స్మగ్లింగ్ ముఠా గత కొద్ది రోజులుగా చెట్లను నరికి అక్రమంగా రవాణా చేస్తోందని, ప్రస్తుతం రూ.50 లక్షల విలువైన చెట్లను తరలించేందుకు యత్నిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మెంజ్ఞానపురత్‌కు చెందిన అమత మహేంద్రన్‌ప్రధాన సూత్రధారి అని తేలింది. ఇతను ఈటెంకుడి ఎంజీఆర్ యూత్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. విచారణలో కలప కటింగ్ ప్రమోటర్‌కు రూ.2 లక్షలు చెల్లించినట్లు తేలింది. 3 ట్రక్కులను, 3 జేసీపీలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 9 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో అమల్ రాజ్, లారీ డ్రైవర్ విజయరాజ్‌లను అరెస్టు చేశారు.

భర్తను హత్య చేసి భార్య ఆత్మహత్య

అన్నానగర్: భర్తను హత్య చేసి భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన కృష్ణగిరి జిల్లాలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కావేరిపట్టణంలోని కరాడిఅల్లి పంచాయతీకి చెందిన రంగసామి(45) ఎలక్ట్రీషియన్. భార్య జయంతి (36). వీరికి కుమారుడు సంతోష్, కుమార్తె దీపిక ఉన్నారు. సంతోష్ కూలి పనికి వెళ్తున్నాడు. దీపిక చదువుతోంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో కొద్ది రోజులుగా జయంతి మానసిక వ్యాధితో బాధపడుతోంది. శుక్రవారం రాత్రి కొడుకు, కూతురు నిద్రకు ఉపక్రమించారు. ఆ తర్వాత భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలో కోపోద్రిక్తురాలైన జయంతి అక్కడే ఉన్న తాడును తీసుకుని రంగస్వామి మెడకు బిగించి హత్య చేసింది. ఆపై ఆ ప్రాంతంలోని బావిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించింది. ఈ శబ్దం విన్న స్థానికులు అక్కడికి వచ్చి జయంతిని రక్షించేందుకు ప్రయత్నించారు. బావిలోంచి బయటకు తీయగా కొద్దిసేపటికే ఆమె మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణదారులకు నోటీసులు

తిరుత్తణి: పట్టణంలో ప్రభుత్వ స్థలం ఆక్రమించిన వారికి రెవిన్యూ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. తిరుత్తణి జేజేరవి నగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించి కట్టడాలు నిర్మాణం చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయి. తహసీల్దార్ మదన్ తన బృందంతో సర్వే చేపట్టి రూ. 5 కోట్ల విలువైన ఒకటిన్నర ఎకరం ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయితే హెచ్చరిక బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో శుక్రవారం ఆర్డీఓ దీప ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మించిన ప్రహరీ గోడలను పరిశీలించారు. వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్, ఆర్‌ఐ ముహ్మద్ యాసర్ ఆరాఫత్ గోడలకు నోటీసులు అంటించారు. 15 రోజుల్లో ఆక్రమణకు సంబంధించి జిల్లా కలెక్టర్, తహసీల్దార్ వద్ద సంజాయిషి ఇవ్వకుంటే ఆక్రమణలు తొలగింపునకు చర్యలు తీసకుంటామని పేర్కొన్నారు.

• నివాళి



తమిళ్ తెండ్రల్ వి కల్యాణ సుందర్ 140వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మదుర వాయిల్ తుండలం గ్రామంలో ఉన్న ఆయన విగ్రహానికి తమిళాభిమానులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎంపీ టీఆర్ బాలు, మేయర్ ప్రియ, ఎమ్మెల్యే గణపతి, తమిళాభివృద్ధిశాఖ డైరెక్టర్ అరుల్ తదితరులు ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. - సాక్షి, చెన్నై

కంటైనర్‌ను ఢీకొన్న లారీ

• లారీడ్రైవర్ మృతి -క్లీనర్‌కు తీవ్రగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ

వేలూరు: కంటైనర్ లారీని మరో లారీ ఢీకొన్న ఘటనలో లారీడ్రైవర్ మృతిచెందాడు. తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని కనికాపురం వద్ద జాతీయ రహదారిపై వేలూరు నుంచి ఆంబూరు వైపు కంటైనర్ లారీ వెళుతోంది. అదేసమయంలో వెనుక వస్తున్న మరో అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ తిరువణ్ణామలై జిల్లా ఆరణి తాలుకా ఇరయంబాడుకు చెందిన మునస్వామి(55) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసి ఆంబూరు పోలీసులు వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని లారీలో చిక్కుకున్న మృతదేహాన్ని బయటకుతీసి పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్లీనర్‌ను ఆంబూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటనతో గంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఆంబూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో 2023-2024 విద్యా సంవత్సరానికిగాను ప్రాక్ శాస్త్రి కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నటుల రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఆన్‌లైన్‌లో ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం httpr:// nrkt uac.in వెబ్‌సైట్‌ను వీక్షించాలని కోరారు.

శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి,అమ్మవార్ల అభిషేక సేవ అనంతరం శనీశ్వరస్వామికి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదటి గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచి నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేలం, కలశ జలాలతో అభిషేకం చేశారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో సుమారు 25 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

క్లుప్తంగా...

'నైరుతి'లో కదలిక

• రాష్ట్రంలో రెండ్రోజులు వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: చాలా రోజుల తర్వాత నైరుతి రుతుపవనాల్లో కాస్త కదలిక వచ్చింది. దాదాపు మూడు వారాల నుంచి ఇవి స్తబ్దుగా ఉండిపోయాయి. ప్రస్తుతం ఈ రుతుపవనాలు కోస్తాంధ్రపై మోస్తరుగా ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు రాష్ట్రంపై నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయి. ఫలితంగా ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం.. పశ్చిమ, నైరుతి గాలులు, రుతుపవనాల ప్రభావం రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు ఉంటుంది. ఆది, సోమవారాల్లో ఉత్తర కోస్తాలో కొన్నిచోట్ల.. దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. కాగా.. శనివారం చిత్తూరు జిల్లా రామాపురంలో 3.1 సెం.మీ., తిరుపతి జిల్లా అరణ్యకండ్రిగ, నంద్యాల జిల్లా చిలకలూరు, అనంతపురం జిల్లా చిటికలపల్లె 2.7, సత్యసాయి జిల్లా గోరంట్లలో 2.4, ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో 2.3 సెం.మీ.చొప్పున వర్షపాతం నమోదైంది.

చర్మకార ఉత్పత్తులపై ఎస్సీ యువతకు శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ యువతకు ఉపాధి చూపేలా శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. చెప్పులు, షూ తదితర చర్మకార ఉత్పత్తులపై ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధికి చేయూతనివ్వనుంది. దీనిలో భాగంగా తొలి బ్యాచ్‌లో వంద మందికి శిక్షణ ఇస్తారు. ఈ నెల 29న ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ప్రారంభిస్తారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తడలో రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయమై ఆంధ్రప్రదేశ్ మాదిగ సంక్షేమ ఆర్థిక సహకార సంస్థ చైర్మన్ కొమ్మూరి కనకరావు 'సాక్షి'తో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీల సంక్షేమానికి, అభివృద్ధికి సీఎం జగన్ ప్రభుత్వం విప్లవాత్మక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే ప్లాస్టిక్ రీసైక్లింగ్ ద్వారా ఉత్పత్తులు తయారు చేసేలా 120మందికి శిక్షణ ఇచ్చామని, మరో 300 మందికి చెప్పులు, షూల తయారీలో నైపుణ్యం పెంచి ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

రెడ్లపై అంత ద్వేషమెందుకు?

• టీడీపీపై ఓసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి ఆగ్రహం

కృష్ణలంక(విజయవాడ తూర్పు): రెడ్డి సామాజికవర్గంపై అంత ద్వేషమెందుకని టీడీపీ నాయకులను ఓసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇకనైనా దీన్ని ఆపకపోతే టీడీపీ కనుమరుగవ్వడం తథ్యమని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీతో పాటు కొన్ని పత్రికలు అభూత కల్పనలతో రెడ్లపై విషం చిమ్ముతూ నిత్యం కట్టుకథలు అల్లుతున్నాయని మండిపడ్డారు. ఒక సామాజిక వర్గంపై ద్వేషంతో ఇలా దుష్ప్రచారం చేయడం సరికాదని సూచించారు. వాస్తవానికి సీఎం జగన్ అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ.. వారి అభివృద్ధికి కృషి చేస్తూ సామాజిక న్యాయం పాటిస్తున్నారని చెప్పారు. గతంలో చంద్రబాబు తన కులం వారికే ప్రాధాన్యత ఇచ్చి.. రెడ్లను పూర్తిగా అణిచివేశారని గుర్తుచేశారు. సమర్థులైన 'రెడ్డి' అధికారులను ప్రాధాన్యం లేని పోస్టుల్లో నియమించి అవమానించారని.. ఇది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

స్టీల్‌ప్లాంట్ కోసం ఆమరణ నిరాహారదీక్ష : కేఏ పాల్



సీతమ్మధార (విశాఖ ఉత్తర): స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం మూడు గంటల్లోగా ప్రకటన చేయకపోతే ఆశీలమెట్టలోని కేఏ పాల్ కన్వెన్షన్ హాల్ ఆవరణలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతానని హెచ్చరించారు. తనను చంపేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఆయన శనివారం విశాఖలో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ, బీజేపీ నేతల ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద కుట్ర జరుగుతుందన్నారు. చంద్రబాబు, జగన్, పవన్‌కళ్యాణ్, మోదీని ఢీకొని తెలుగు ప్రజల కోసం దీక్షకు పూనుకున్నానని చెప్పారు.

భారత్‌మాల పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం: సీపీఎం

సాక్షి, అమరావతి: భారత్‌మాల పేరుతో జాతీయ రహదారుల నిర్మాణానికి లక్షల ఎకరాలు సేకరించి వాటిని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి కేంద్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. అధిక ధరలు, నిరుద్యోగం, కరెంటు చార్జీలపై ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సీపీఎం నిర్వహించనున్న సమరభేరి పోస్టర్‌ను ఆయన శనివారం విజయవాడలో ఆవిష్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 4న అన్ని మండల కేంద్రాల్లోను ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు.

'యాంత్రిక' రాతలు పనిచేయవు రామోజీ..

బాబు హయాంలో కమీషన్ల కోసమే రైతు రథాలు, యంత్ర పరికరాలు

• రైతులకు తక్కువ అద్దెకు పరికరాలు ఇవ్వాలన్నది సీఎం జగన్ సంకల్పం
• ఇప్పటివరకు 3.3 లక్షల మంది రైతులకు సేవలు
• ఇక అమ్ముకునే అవకాశం ఎక్కడ ఉంటుంది రామోజీ?



సాక్షి, అమరావతి: పచ్చ కామెర్లు అలుముకున్న పచ్చ పత్రికలు చంద్రబాబు జమానాలో జరిగినట్లుగా ఇప్పుడూ అవినీతి జరుగుతోందన్న భ్రమల్లోనే ఉంటాయి. బాబు జమానాలో పచ్చ పార్టీ నేతలకు యంత్రపరికరాలను కట్టబెట్టడమే కాదు.. సబ్సిడీ మొత్తాన్ని వారికి చెందిన వారికే పప్పుబెల్లాల్లా పంచిపెట్టారు. అదే రీతిలో ఇప్పుడు కూడా జరుగుతోందన్న భ్రమల్లో కళ్లుమూసుకొని కథనాలు అల్లేస్తున్నారు రామోజీ. క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవాలను పరిశీలించకుండా అబద్ధాలతో ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా వ్యవసాయ యాంత్రీకరణ అంటే పచ్చపార్టీ నేతలకు పండగలా ఉండేది. కమీషన్ల కోసం ట్రాక్టర్లు (రైతురథాలు), యంత్రాలను వారి తాబేదార్లకు కట్టబెట్టారు. 2014–2019 వరకు ఇష్టమైన వారితో 3,584 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు(సీహెచ్‌సీ) ఏర్పాటు చేశారు. వీటిలో రైతులన్న వారు చాలా తక్కువ. వీటిద్వారా రూ.239.16 కోట్ల సబ్సిడీతో కూడిన ట్రాక్టర్లు పంపిణీ చేశారు. అయితే, ఏ కంపెనీవి కొనాలో, ఏ డీలర్ దగ్గర కొనాలో కూడా మంత్రులు, ఎమ్మెల్యేలు లేదా స్థానిక టీడీపీ నాయకులే నిర్దేశించేవారు. తద్వారా కంపెనీలు, డీలర్ల నుంచి కమీషన్లు పొందే వారు. వాటికి రుణాల కోసం రైతులే బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. రాయితీ సొమ్మును కంపెనీ డీలర్ల ఖాతాకు జమ చేసేవారు. చాలాచోట్ల ట్రాక్టర్లు రైతులకు ఇవ్వకుండానే సబ్సిడీ సొమ్ము స్వాహా చేసినట్టుగా అప్పట్లో పెద్దఎత్తున ఆరోపణలు కూడా వచ్చాయి.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ అక్రమాలకు చెక్ పెట్టారు. చిన్న, సన్నకారు రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను తక్కువ అద్దెకే అందించి, వారికి ఎక్కువ లాభాలు వచ్చేలా చేయాలన్న సంకల్పంతో వైఎస్సార్ యంత్ర సేవ పథకాన్ని ప్రవేశపెట్టారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా పారదర్శకంగా ఎంపిక చేసిన రైతు కమిటీల (సీహెచ్‌సీ)కు వారు కోరుకున్న యంత్ర పరికరాలను అందిస్తున్నారు. తక్కువ అద్దెకే రైతులకు వీటిని అందిస్తున్నారు. అద్దె వివరాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. అయితే, ఈనాడు మాత్రం వాస్తవాలకు పాతరేస్తూ 'వైకాపా నేతలకే యంత్ర సేవ' అంటూ అబద్ధాలను అచ్చేసింది. జిల్లాల్లో యంత్ర పరికరాలు అమ్ముకున్నారని, వైఎస్సార్‌సీపీ నేతల బంధువుల ఇళ్లల్లో ఉన్నాయని, ఇసుక, మట్టి తవ్వకాలకు ఉపయోగిస్తున్నారని, పాత పరికరాలకు రంగులేసి సొమ్ము చేసుకున్నారంటూ ఇష్టానుసారం ఆరోపణలు చేసింది. ఈ కథనంలో వాస్తవాలేమిటో ఒక్కసారి పరిశీలిద్దాం..



ఆరోపణ: నాయకులు. వారి అనుచరుల పేర్లతోనే సంఘాలు
వాస్తవం: వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద ఆర్బీకే పరిధిలోని గ్రామంలో భూమి కలిగి వ్యవసాయం చేస్తున్న ఐదారుగురు రైతులతో కమిటీ (సీహెచ్‌సీ)లను ఏర్పాటు చేశారు. పార్టీ, కులం, వ్యక్తిగత వివరాలతో సంబంధం లేకుండా ఎలాంటి రాజకీయ ప్రమేయం, సిఫార్సులకు తావులేకుండా అర్హులైన రైతులతో మాత్రమే కమిటీలను ఏర్పాటు చేశారు. ఇలా 10,444 గ్రామాల్లో ఆర్బీకే స్థాయిలో, క్లస్టర్ స్థాయిలో ఏర్పాటైన 492 రైతు కమిటీలకు రూ.1052.42 కోట్ల విలువైన యంత్ర పరికరాలు, ట్రాక్టర్లను అందించారు. వీటి కోసం రూ.366.25 కోట్లు సబ్సిడీ రూపంలో రాష్ట్ర ప్రభుత్వం భరించింది. యంత్ర సేవా కేంద్రాల్లో 6,362 ట్రాక్టర్లు, 492 హార్వెస్టర్లు, 31,356 ఇతర యంత్రపరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఆరోపణ: ఆన్‌లైన్‌లో కానరాని సేవలు
వాస్తవం: రైతులు గ్రామంలోనే కాకుండా, మండలంలోని ఏ ఆర్బీకే పరిధిలోఉన్న యంత్ర సేవా కేంద్రం నుంచైనా యంత్రాలను తక్కువ అద్దెకు పొందవచ్చు. ఈ రేట్లను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తారు. వీటికోసం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వైఎస్సార్ యంత్ర సేవా యాప్‌ను తీసుకొచ్చారు. అగ్రినెట్ వెబ్‌సైట్‌లో వైఎస్సార్ యాప్‌లో పొందుపరిచిన లింక్ ద్వారా రైతులు వారికి కావలిసిన పరికరాలు, యంత్రాలను 15 రోజుల ముందుగా బుక్ చేసుకుంటే సరిపోతుంది. ఆన్‌లైన్ విధానం తెలియని వారు ఆర్బీకేలోని వీఏఏ ద్వారా బుక్ చేసుకోవచ్చు.

ఆరోపణ: పారదర్శకతకు పాతరేసారు
వాస్తవం: గ్రామాల్లో సాగయ్యే పంటలకు కావలసిన, స్థానికంగా డిమాండ్ కలిగిన పరికరాలను ఎంపిక చేసుకునే అవకాశాన్ని రైతు కమిటీలకే అప్పగించారు. నిర్ణయాధికారం వాటికే ఇచ్చారు. అంతేకాదు.. వాటిని వారికి నచ్చిన కంపెనీల నుంచి కొనుక్కొనే అవకాశం కల్పించారు. పైగా సబ్సిడీ మొత్తం గతంలో మాదిరిగా కంపెనీల ఖాతాలకు కాకుండా నేరుగా రైతు కమిటీల ఖాతాలకు జమ చేశారు. ఇందులో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చేశారు.

ఆరోపణ: ఆర్బీకేల్లో కానరాని అద్దెల బోర్డులు
వాస్తవం: ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు ఇచ్చే పరికరాల రెంట్లకంటే తక్కువ అద్దెలుండేలా ప్రతి వ్యవసాయ సీజన్‌కు ముందు వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో అద్దెలను నిర్ణయించి, ఆ వివరాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. ఇలా 3 ఏళ్లలో అక్షరాలా 3.3 లక్షల మంది రైతులు ఈ యంత్ర పరికరాలు, ట్రాక్టర్లను అద్దెకు తీసుకున్నారు. 8.90 లక్షల ఎకరాల్లో వ్యవసాయ పనులకు ఉపయోగించుకున్నారు.


ఆరోపణ: రాయితీ సొమ్ము పక్కదారి
వాస్తవం: ఎంపిక చేసిన రైతు కమిటీలకు ఆప్కాబ్, డీసీసీబీలతో పాటు హెచ్‌డీఎఫ్‌సీ, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఐవోబీ తదితర బ్యాంకుల ద్వారా ఎలాంటి పూచీకత్తు లేకుండా యూనిట్ మొత్తంలో 50 శాతం రుణం రూపంలో అందించారు. పైగా తీసుకున్న రుణాలను రైతు కమిటీలు సకాలంలో చెల్లించేలా వైఎస్సార్ యంత్ర సేవా యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఆరోపణ: ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లు అమ్మేసుకుంటున్నారు
వాస్తవం: యంత్ర సేవా కేంద్రాలకు సరఫరా చేసిన యంత్రాలను వ్యవసాయ శాఖ, బ్యాంకులు సంయుక్తంగా తనిఖీ చేసిన తరువాతే ఆ కమిటీలకు రాయితీ సొమ్ము విడుదల చేశారు. పైగా తీసుకున్న రుణాలను 3 నుంచి 5 ఏళ్లలో చెల్లిస్తేనే ట్రాక్టర్లు, కంబైన్డ్ హార్వెస్టర్లపై హక్కులు వస్తాయి. అప్పటివరకు అవి బ్యాంకుల తనఖాలో ఉంటాయి. అలాంటప్పుడు వాటిని అమ్ముకునే అవకాశం ఎక్కడ ఉంటుందో రామోజీకే తెలియాలి.

ఆరోపణ: ఈ యంత్ర పరికరాలతో మట్టి, ఇసుక తవ్వకాలు
వాస్తవం: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలంలో ఏర్పాటు చేసిన 9 కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 647 మంది రైతులు యంత్ర సేవలు పొందారు. అద్దెకు తీసుకున్న యంత్ర పరికరాలను 2,008 ఎకరాల్లో వ్యవసాయ పనుల కోసం ఉపయోగించుకున్నారు. అద్దె రూపంలో కమిటీలకు రూ.9.45 లక్షల ఆదాయం వచ్చింది. విజయనగరం జిల్లా గంట్యాడ మండలంలో 21 ఆర్బీకేల్లో ఏర్పాటైన కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 385 రైతులు యంత్ర సేవలు పొందారు. అద్దెకు తీసుకున్న యంత్రాలతో 1,793 ఎకరాల్లో వ్యవసాయ పనులు చేశారు. రైతు కమిటీలకు బాడుగ రూపంలో రూ.5.47 లక్షల ఆదాయం వచ్చింది. నంద్యాల మండలంలో 19 యంత్ర సేవా కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1,106 మంది రైతులు 2,905 ఎకరాలలో అద్దెకు యంత్ర సేవలు పొందారు. ఈ కేంద్రాలు రూ.13.72 లక్షలు బాడుగ సొమ్ము పొందాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వరికోత యంత్రంతో కూడా యంత్ర సేవ కేంద్రాలను రైతు కమిటీలకే ఇచ్చారు. జిల్లాల్లో రైతులు గ్రామం, మండలం పరిధిలోని యంత్ర సేవా యాప్ ద్వారా పరికరాలను వినియోగించుకుంటున్నారు. ఇవి వాస్తవాలు. వీటిని పట్టించుకోకుండా యాంత్రికంగా అసత్యాలతో రాసే రాతలను ప్రజలు తిరస్కరిస్తారు రామోజీ.

జగన్ కంటే మూడు రెట్లు సంక్షేమం అందిస్తాం

• సెప్టెంబర్ 1 నుంచి బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం
• టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో చంద్రబాబు



సాక్షి, అమరావతి: భవిష్యత్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంటే మూడు రెట్లు అధికంగా సంక్షేమాన్ని అందిస్తామని ప్రతిపక్ష నేత చంద్రబాబు చెప్పారు. శనివారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ హయాంలో రూ.200 పింఛన్‌ను రూ.2 వేలకు పెంచామని, వైఎస్ జగన్ రూ.3 వేలు ఇస్తానని మాట తప్పారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రికి భయం అంటే తెలియదని విమర్శించారు. 16 నెలలు జైల్లో ఉండి వచ్చాడు కాబట్టి భయం లేకుండా పోయిందన్నారు. కానీ.. దానివల్ల రాష్ట్రం నష్టపోతోందని తెలిపారు. తనకు రుణపడి ఉండాలని వైఎస్ జగన్ చెప్పడం దారుణమని, వీళ్ల అబ్బ సొమ్ము ఇచ్చారా? వీళ్ల తాత జాగీరు పంచారా అని ప్రశ్నించారు. ఇండియా టుడే–సీ ఓటర్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే టీడీపీకి 15 ఎంపీ స్థానాలు వస్తాయని చాలా స్పష్టంగా తేలిందన్నారు. ఇంతకు ముందు చేయించిన సర్వేలన్నీ బోగస్‌వని తేలిందని విమర్శించారు. 'బాబు ష్యూరిటీ–భవిష్యత్‌కు గ్యారంటీ' కార్యక్రమాన్ని సెప్టెంబర్ 1నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. బూత్‌ల వారీగా రోజుకు పది ఇళ్ల చొప్పున తిరగాలని, ఆ సమయంలోనే యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలు ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలన చేస్తారని తెలిపారు. ప్రజావేదిక అనే కార్యక్రమం ద్వారా నియోజకవర్గ ఇన్‌చార్జిలు ప్రతి మండల, పట్టణ, నగర ప్రధాన కేంద్రాల్లో పాదయాత్ర చేసి, డోర్ టు డోర్ ప్రచారం చేసి, ఒక బహిరంగ సభ పెట్టాలని సూచించారు. తాను 35 నియోజకవర్గాల్లో పర్యటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో 3 కోట్ల మంది రికార్డులు అప్‌డేట్ చేయాలనుకుంటున్నామని, 3 కోట్ల మంది ఓటర్లను కలవాలని పేర్కొన్నారు. సవాల్ చేసి చెబుతున్నానని, వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వం నూటికి వెయ్యి శాతం చిత్తుచిత్తుగా ఓడిపోవడం ఖాయమన్నారు.

సమానత్వం సహించలేకే చంద్రబాబు విమర్శలు

• మంత్రులు రజిని, నాగార్జున ధ్వజం




యడ్లపాడు: రాష్ట్రంలో పేద, ధనిక సమానత్వాన్ని సహించలేక ప్రతిపక్ష నేత చంద్రబాబు... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పిస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. ధనిక కుటుంబాలకు సమానంగా అణగారిన వర్గాల పిల్లలు విద్యలో రాణించడం చంద్రబాబుకు ఏనాడూ ఇష్టం లేదన్నారు. పల్నాడు జిల్లా వంకాయలపాడులోని బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులం పాఠశాలల సముదాయం ప్రారంభోత్సవానికి మంత్రులు రజిని, నాగార్జున హాజరయ్యారు. రజిని మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివే వారంతా పేదవారని, అందులోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కుటుంబాల పిల్లలు ఉంటారని గుర్తించిన సీఎం జగనన్న మన బడి నాడు–నేడు ద్వారా రూపురేఖల్ని మార్చి పుస్తకాల నుంచి అన్ని రకాల వస్తువుల్ని ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక వసతుల కల్పన, ఉచితంగానే నాణ్యమైన విద్యాబోధన, ఇంగ్లిష్ మీడియం, ఆన్‌లైన్ క్లాసులు అందించడం చూసి తట్టుకోలేక తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయన్నారు. పేదలు ఎదగడం, వారి పిల్లలు గొప్పగా చదవడం, మంచి విద్యావంతులై అత్యున్నత స్థాయికి చేరడాన్ని ఓర్వలేక అబద్ధాల చంద్రబాబు తమ నాయకుడిపై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. మేరుగు నాగార్జున మాట్లాడుతూ ప్రతిపక్షం వాహన చక్రాలు విరిగిపోయాయని, చంద్రబాబు వయసుడిగి నడవలేక పోతున్నారని విమర్శించారు. దేశంలోనే ఏపీ పాలన గురించి గురించి మేధావులు, ప్రముఖులు సైతం సీఎం జగన్‌పై ప్రశంసల జల్లులు కురిపిస్తుంటే.. చంద్రబాబు మాత్రం కళ్లులేని కబోదిలా విమర్శలు చేయడం దారుణమన్నారు. వీరికి వత్తాసుగా ఎల్లో మీడియా అవాస్తవాలను గుప్పించడం బాధాకరమన్నారు.

రాష్ట్రాన్ని ముంచింది చంద్రబాబే

• ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ధ్వజం



సాక్షి, అమరావతి: తన అసమర్థ పరిపాలనతో రాష్ట్రాన్ని ముంచిన చంద్రబాబును వదిలేసి.. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడుపుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై రామోజీరావు నిత్యం విషం కక్కుతున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ధ్వజమెత్తారు. కళ్లెదుటే వాస్తవాలు కనిపిస్తున్నా వాటికి ముసుగేసి.. 'ఈనాడు'లో తలతోక లేని రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈనాడులో అసత్య కథనాలు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మూడు ప్రాంతాలను అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేకే మూడు రాజధానుల డ్రామాలు అంటూ తప్పుడు రాతలు రాస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్సీ ఉప ప్రణాళిక అమలుతోపాటు ఎస్సీ కుటుంబాలకు సహాయం చేయడంలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని గుర్తు చేశారు.

మా జెండా ఎగరేస్తే మీ సమస్యలు తీరుస్తా

• నూజివీడు నియోజకవర్గంలో 'రచ్చబండ'లో లోకేశ్
• ఆయన పిలుపునకు స్పందించని జనం



నూజివీడు/ముసునూరు/దెందులూరు: నూజివీడు నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తే మీ గ్రామ సమస్యలు తీరుస్తానని హామీ ఇస్తున్నట్లు ఆ పార్టీ నేత నారా లోకేశ్ తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి నుంచి శనివారం ప్రారంభమైన యువగళం పాదయాత్ర మండలంలోని కొర్లగుంట మీదుగా ముసునూరులోని మండపం సెంటర్‌కు చేరుకుంది. ఇక్కడ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగాలేదంటూ, సీసీ రహదారులు కావాలంటూ గ్రామ సమస్యలను వివరించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలని, ఇళ్ల స్థలాలిస్తామని పట్టా ఇచ్చారే తప్ప స్థలం చూపించలేదని, అమ్మఒడి రాలేదని పలువురు స్థానికులు చెప్పారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. నూజివీడు నియోజకవర్గంలో టీడీపీని గెలిపిస్తే, అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ముసునూరు గ్రామంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేయిస్తానని, రోడ్లు వేయిస్తానని, సిమెంట్ ధరలు తగ్గిస్తామని, విద్యుత్ చార్జీలు, బస్సు చార్జీలు తగ్గించి, మహిళలకు జిల్లా స్థాయిలో ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాగా, నిత్యావసరాల ధరలు పెరిగాయా.. లేదా అంటూ పదేపదే చేతులు ఎత్తండంటూ లోకేశ్ కోరగా.. ప్రజలు పెద్దగా స్పందించలేదు. పాదయాత్రలో వాహనాలు, యువగళం వలంటీర్ల హడావుడే ఎక్కువగా ఉంది. గ్రామస్తుల హాజరు అంతంతమాత్రంగా ఉంది.

మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు

మరోవైపు.. దెందులూరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ ఎ. దుర్గాకళ శనివారం లోకేశ్ పాదయాత్ర విధులకు హాజరుకాగా.. కాన్వాయ్‌లోని ఓ వాహనం ఆమె కాలు పైనుంచి వెళ్లిపోయింది.. దీంతో ఆమె గాయపడ్డారు. అయితే, కాన్వాయ్ వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. కానీ, అక్కడే ఉన్న సహచర పోలీసులు ఆమెకు ప్రథమ చికిత్స చేయించారు. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి బాధితురాలిని ఫోన్‌లో పరామర్శించారు.

యువగళం టీం సభ్యుల దాడి అమానుషం : ఎమ్మెల్యే మేకా



చిట్టిబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

లోకేశ్ యువగళం టీం సభ్యులు తుక్కులూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి చేయడం అమానుషమని, క్షమించరాని తప్పని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడిలో గాయపడిన యువకుడు యలమర్తి చిట్టిబాబును శనివారం ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అతని ఇంటికెళ్లి పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోకేశ్ ఇలాంటి దాడులను ప్రోత్సహించడం గర్హనీయమన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసినప్పుడు ఎవరైనా టీడీపీ కార్యకర్త జెండాలు పట్టుకుని నిల్చున్నా ఇలాంటి సంఘటనలు ఎక్కడా చోటుచేసుకోలేదన్నారు.

పాదయాత్రలో వెయ్యిమంది కూడా లేరు..

లోకేశ్ పాదయాత్రలో వెయ్యి మంది కూడా జనం లేరని, దీనిని బట్టే అతనికి, టీడీపీకి ప్రజల్లో ఏమాత్రం ఆదరణ ఉందో అర్థమవుతోందని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తుందని కలలు కంటున్నారేమో గానీ అవి కల్లలుగానే మిగిలిపోతాయన్నారు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నంత కాలం మరే పార్టీ అధికారంలోకి రాదన్నారు. ఒంటరిగా ఉన్నవారిపై దాడిచేయడం అమానుషమని చెప్పారు. మీడియాపై కూడా దాడిచేయడం తీవ్రమైన తప్పన్నారు.

రాష్ట్రంలో అల్లర్లకు లోకేశ్ కుట్ర



గాజువాకలో సీఐ భాస్కరరావుకు చంద్రబాబు, లోకేశ్‌పై ఫిర్యాదు చేస్తున్న విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు



పాలకొల్లులో నారా లోకేశ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సభ్యులు

• అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న చంద్రబాబు, లోకేశ్‌పై చర్యలు తీసుకోండి
• రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఫిర్యాదులు
• పలు జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు, సోషల్ మీడియా కార్యకర్తల ఫిర్యాదులు
• విశాఖలో సోషల్ మీడియా రాష్ట్ర ఇన్‌చార్జి సజ్జల భార్గవ్ రెడ్డి ఫిర్యాదు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించేలా టీడీపీ శ్రేణులను ప్రేరేపిస్తూ, రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ.. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలను దుర్భాషలాడుతున్న తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేశ్, ఆ పార్టీకి చెందిన ఇతర నేతలపై శనివారం కూడా రాష్ట్రవ్యాప్తంగా పోలీసులకు ఫిర్యాదులందాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ సోషల్ మీడియా కన్వీనర్లు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు ఈ ఫిర్యాదులు చేశారు. సమాజంలో అశాంతి కలిగేలా ప్రవర్తిస్తున్న చంద్రబాబు, లోకేశ్, ఇతర నేతలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్ని రెచ్చగొట్టి రాష్ట్రంలో అల్లర్లకు నారా లోకేశ్ కుట్ర చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవ్ రెడ్డి శనివారం విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విశాఖ జిల్లా కో కన్వీనర్ సదరం జ్ఞానేష్, ఉత్తర నియోజకవర్గం కన్వీనర్ అనిల్ శర్మ తదితరులతో కలిసి ఆయన విశాఖపట్నం ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విశాఖ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనకాపల్లి జిల్లా కోటవురట్లలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా మండల కన్వీనర్ కొల్లు గోపాలకృష్ణ తదితరులు ఫిర్యాదు చేశారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ కొప్పుల ప్రభాకరరెడ్డి, కో కన్వీనర్లు డెక్కత జయరాంరెడ్డి, కొమ్మన అనిల్ తదితరులు ఏలూరు వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ద్వారకా తిరుమల మండల సోషల్ మీడియా ప్రతినిధులు ద్వారకా తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో నాలుగు రోజుల్లో లోకేశ్ పాదయాత్ర నల్లజర్ల మండలం చేరుకుంటుందని, అక్కడ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తుగా చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఏలూరు జిల్లా కోకన్వీనర్ సైదం సురేష్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండల పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. టి.నర్సాపురం పోలీసులకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ శ్రీను రాజు, ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, సహకార సంఘ చైర్మన్, పార్టీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, వైఎస్సార్‌సీపీ యూత్ మండల నాయకుడు కన్నం సర్వేశ్వరరావు ఫిర్యాదు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణ పోలీసులకు వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాకు చెందిన బాకూరు సత్యనిరంజన్, ఉచ్చుల స్టాలిన్, కుక్కల బాలచందర్ తదితరులు ఫిర్యాదు చేశారు. కుక్కునూరు సీఐ సత్యనారాయణకు మండల సోషల్ మీడియా కన్వీనర్ మల్లెల చంటినాయుడు ఆధ్వర్యంలో పలువురు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతలు చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడ తూర్పు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ పిల్లి వెంకట్ ఆధ్వర్యంలో విజయవాడ పటమట సీఐ కాశీవిశ్వనాథ్‌కు ఫిర్యాదు చేశారు.



విజయవాడలోని పటమట సీఐ కాశీవిశ్వనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సోషల్ మీడియా ప్రతినిధులు

వైరల్





ఇద్దరు మిత్రులు

బాలీవుడ్ నటి రవీనా టాండన్ కూతురు రషా తందానీ భావుకురాలు. ప్రకృతి ప్రేమికురాలు. పద్దెనిమిది సంవత్సరాల రషా మంచి ఫొటోగ్రాఫర్ కూడా. తల్లితో పాటు ప్రపంచంలోని ఎన్నో ప్రాంతాలను చూసి వచ్చింది రషా. తాజాగా ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ పర్యటనకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది.

'హూ ఎల్స్ టు ట్రావెల్ ద వరల్డ్ విత్?' కాప్షన్‌తో తల్లితో దిగిన ఫొటోలను షేర్ చేసింది. 'తల్లీకూతుళ్లు క్లోజ్‌ఫ్రెండ్స్‌లా కనిపిస్తున్నారు' అన్నారు ఒక నెటిజన్.

గిన్నిస్ భర్ సింగ్



పంజాబ్‌కు చెందిన అమృత్ భర్‌సింగ్ పేరు వినబడగానే అదేదో ఆయన ఇంటి పేరు లాగా 'గిన్నిస్ బుక్' అనే సౌండ్ ఠకీమని ప్రతిధ్వనిస్తుంది. గతంలో ఎన్నో రికార్డ్‌లను క్రియేట్ చేసిన అమృత్‌భర్‌సింగ్ తాజాగా మరో రికార్డ్ సృష్టించాడు. ఒక నిమిషంలో ఫింగర్ టిప్స్‌పై 86 పుషప్‌లు చేసి గిన్నిస్‌బుక్‌లోకి ఎక్కాడు.

గుర్‌దాస్‌పూర్ జిల్లా ఉమర్‌వాలా గ్రామానికి చెందిన సింగ్ పాశ్చాత్య పద్ధతుల్లో కాకుండా సంప్రదాయ పద్ధతుల్లో ప్రాక్టీస్ చేస్తుంటాడు.

మోడ్రన్ జిమ్‌లకు వెళ్లకుండా ఇంటి పరిసరాలలో ఉన్న పశువుల కొట్టాన్ని జిమ్‌గా మార్చుకున్నాడు. ఇటుకలు, ఇసుక బస్తాలు, ప్లాస్టిక్ క్యాన్‌లు తన ప్రాక్టీసింగ్ సాధనాలు. సప్లిమెంట్స్‌కు దూరంగా ఉండే సింగ్ నేచురల్ డైట్స్ మాత్రమే తీసుకుంటాడు. 'గతనెల ఫిబ్రవరి నెలలో సెట్ చేసిన రికార్డ్‌ను నేనే బ్రేక్ చేయాలనుకున్నాను. ప్రాక్టీస్ కోసం ఎన్నోనెలలు చెమటలు చిందించాను. ఫలితం వృథా పోలేదు' అంటున్నాడు అమృత్‌భర్ సింగ్.

ఇచ్చట తల వెంట్రుకలు ఖండించ బడును



సొంతంగా హెయిర్ కటింగ్ చేసుకోవాలనుకోవడం తేలికే గానీ, ప్రాక్టికల్ విషయానికి వస్తేగానీ కష్టమేమిటో తెలియదు. బోలెడు ఓపిక ఉండాలి. దానికి నైపుణ్యం తోడు కావాలి.

'ఇదంతా ఎందుకండీ... నా రోబోను చూడండి' అంటున్నాడు షేన్ వైటన్.

అమెరికన్ ఇంజినీర్ షేన్ వైటన్ హెయిర్ కట్ చేసే రోబోను తయారు చేశాడు. రోబో ఒక కుర్రాడికి హెయిర్ కట్ చేసే వీడియోను 'గెట్టింగ్ ఏ రోబో టు కట్ యువర్ హెయిర్' కాప్షన్‌తో తన యూ ట్యూబ్ చానల్‌లో పోస్ట్ చేశాడు. ఈ వీడియో వైరల్ అయింది.

'వీడియోను జాగ్రత్తగా గమనిస్తే అతడి కళ్లలో అంతులేని భయం కనిపిస్తుంది. అంతవసరమంటారా?' అంటూ ఒక యూజర్ స్పందించాడు.

దిగేదే ల్యా పుష్ప-3



చంద్రయాన్-3 విజయవంతమైన ఆనందంలో ఉండగానే 'పుష్ప' చిత్రం జాతీయస్థాయిలో అవార్డ్‌లు సొంతం చేసుకుంది. ఒకవైపు 'పుష్ప-2' షూటింగ్‌లో ఉండగానే మరోవైపు నెటిజనులు చంద్రయాన్, పుష్ప ఆనందాన్ని మిక్స్ చేస్తూ ఎవరికి వారు 'పుష్ప-3' స్టోరీ లైన్ రెడీ చేశారు. అందులో ఒకటి... ఆంగ్లపత్రికలో వచ్చిన 'వై ది గ్లోబల్ రేస్ ఫర్ ది లునార్ సౌత్ పోల్' అనే వ్యాసాన్ని అనువాదం చేయించి తెలుగులో వింటాడు పుష్ప. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఉన్న విలువైన ఖనిజాల గురించి విన్న తరువాత గంధపు చెట్లపై పుష్పకు ఆసక్తిపోయింది. 'కొడితే సౌత్ పోల్ కొట్టాలి. విలువైన ఖనిజాలు కొట్టేయాలి' అని గట్టిగా డిసైడై పోయాడు. చిత్తూరు జిల్లాకు చెందిన పుష్పరాజ్ చంద్రుడి దక్షిణ ధృవం పైకి చేరుతాడా? అక్కడి ఖనిజాలను సొంతం చేసుకుంటాడా? ఒకవేళ చేసుకుంటే విలన్ భన్వర్ సింగ్ షెకావత్ ఎలా అడ్డుపడుతాడు... అనేది నెటిజనుల ఊహల్లో పుట్టిన పుష్ప-3 స్థూల కథ.

మన ఇల్లే... ఒక పాఠశాల ప్రయోగశాల



● దివ్య మిట్టల్
ఐఏఎస్ అధికారి



ఒక వైపు వృత్తి నిర్వహణలో బిజీగా ఉన్నప్పటికీ స్కూల్ పిల్లలకు అవసరమైన సలహాలు, టిప్స్‌ను సోషల్ మీడియా ద్వారా అందిస్తోంది ఐఏఎస్ అధికారి దివ్య మిట్టల్. తాజాగా ఫన్ అండ్ ఇంటరాక్టివ్ మార్గంలో సైన్స్ సూత్రాలను అర్థం చేయించే టిప్స్‌ను షేర్ చేసింది. పిల్లలకు భూభ్రమణం గురించి వివరించడానికి హ్యూమన్ సన్‌డయల్ ఎలా తయారు చేయాలి, 'సింక్ అండ్ ఫ్లోట్ ఎక్స్‌పెరిమెంట్'ను వివరించడానికి నారింజలు, నీళ్లను ఎలా ఉపయోగించాలి... అనేవి ఇందులో ఉన్నాయి.

'ఐఐటీ దిల్లీలో ఇంజినీరింగ్ చదువుకున్నాను. డిగ్రీ కంటే శాస్త్రీయ దృష్టి, విశ్లేషణ ముఖ్యం' అంటుంది దివ్య మిట్టల్. 'సూపర్ కలెక్షన్. ఫన్-టు-డూ. మీ పిల్లలు అదృష్టవంతులు. మీరు ఇచ్చిన టిప్స్‌ను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలి' అని ఒక యూజర్ స్పందించాడు.

నాన్న ముద్ద



పిల్లలు స్కూలుకెళ్లే హడావుడిలో ఉంటే అమ్మలు అన్నం ముద్ద కలిపి పెడతారు. ఇక్కడ కూతురు ఎయిర్‌హోస్టెస్‌గా డ్యూటీకి వెళ్లే హడావుడిలో ఉంటే నాన్న బతిమాలి అన్నం తినిపిస్తున్నాడు. ఇండిగో ఎయిర్‌హోస్టెస్ పూజా బిహాని పెట్టిన ఈ పోస్టు క్షణాల్లో వైరల్‌గా మారి అందరి చేతా తల్లినో, తండ్రినో గుర్తుకు తెప్పిస్తోంది.

'తల్లి బిడ్డ కడుపు చూస్తుంది' అంటారు. తండ్రికి మాత్రం బిడ్డ ఆకలి పట్టదా? తల్లి కష్టపడ్డా, తండ్రి కష్టపడ్డా బిడ్డల కోసమే. జీవులకు లోకంలో అన్నింటి కంటే తృప్తినిచ్చేది తమ సంతానానికి ఆహారం అందించడమేనట. పిల్లలు తింటూ ఉంటే తల్లిదండ్రులకు ఆనందం. వారు ఖాళీ కడుపులతో ఉంటే బాధ. ముద్దుకోసమో మురిపెం కోసమో పిల్లలకు ఎన్నేళ్లొచ్చినా గోరుముద్దలు తినిపించే తల్లులు ఉంటారు. అయితే ఇక్కడ తండ్రి మార్కులు కొట్టేశాడు. ఇండిగోలో ఎయిర్ హోస్టెస్‌గా పని చేస్తున్న పూజా బిహాని డ్యూటీకి టైమయ్యి మేకప్ వేసుకుంటూ ఉంటే ఎక్కడ ఖాళీ కడుపుతో క్యాబ్ ఎక్కి తుర్రుమంటుందోనని ఆమె తండ్రి అన్నం తినిపించాడు. ఆ వీడియోను పూజా ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తే క్షణాల్లో 8.6 లక్షల వ్యూస్ వచ్చాయి. 'నాకు చిన్నప్పటి రోజులు గుర్తుకొచ్చాయి' అని ఒకరంటే 'తల్లిదండ్రులు మాత్రమే పిల్లల బాగోగుల గురించి పట్టించుకుంటారు' అని మరొకరు అన్నారు. 'నాన్న గుర్తొస్తున్నారు' అని ఒకరంటే 'ఆ రోజులు మళ్లీ రావు' అని మరొకరు బాధ పడ్డారు. చిన్న చిన్న ఆనందాల జీవితం అంటే ఇదేనని అందరూ అన్నారు.

అమ్మ కుట్టీ అమ్మ కుట్టీ... వెళ్దాం ఛలో ఎలి.కుట్టీ

అవసరమే కాదు ఆసక్తి కూడా కొత్త భాషను దగ్గర చేస్తుందని మలయాళ భాషను గడగడా మాట్లాడే ఎలిజబెత్ కీటోన్‌ను చూస్తే అర్థమవుతుంది. జార్జియా (యూఎస్)కు చెందిన ఎలిజబెత్ ఇంగ్లీష్ టీచర్. కొత్త భాషలు నేర్చుకోవడం అంటే ఇష్టం. సౌత్‌కొరియా ఆ తరువాత యూఏఈలో ఇంగ్లీష్ పాఠాలు చెప్పింది. దుబాయ్‌లో ఉన్నప్పుడు మలయాళీ కుర్రాడు అర్జున్‌తో ఎలిజబెత్‌కు పరిచయం అయింది, ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్లయింది. ఇక అప్పటి నుంచి శ్రీవారి మాతృభాషను నేర్చుకోవాలని డిసైడై పోయింది ఎలిజబెత్.

'30 రోజుల్లో మలయాళం'లాంటి ఔట్‌డేటెడ్ పుస్తకాలు, మార్గాలు తప్ప కొత్తవి కనిపించలేదు. దీంతో కోళికోడ్‌లో ఉన్న ఒక టీచర్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో మలయాళం భాష నేర్చుకోవడం మొదలుపెట్టింది. అయితే సాంకేతిక కారణాల వల్ల అది మధ్యలోనే ఆగిపోయింది. దీంతో తనదైన స్టైల్లో సొంతంగా నోట్స్ రాసుకొని, డూడుల్స్ తయారు చేసుకొని మలయాళ భాషపై పట్టు సంపాదించింది.

'ఎలి.కుట్టీ' పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆసక్తి ఉన్నవారికి మలయాళం నేర్పుతోంది.



హెల్త్


● తుంటి ఎముక కీలు మార్పిడి

యాంటీరియర్ పద్ధతితో నిర్వహిస్తే లాభాలేమిటంటే?

మనిషి నిటారుగా నిలబడటానికి, కూర్చోడానికి, పరుగెత్తడానికి... ఒక్కమాటలో చెప్పాలంటే రోజులో చేయాల్సిన చాలా పనులకు తోడ్పడేది తుంటి ఎముక కీలు. తుంటి ఎముకలో సాకెట్ లాంటి గుండ్రటి ఖాళీ స్థలం ఉంటుంది. సరిగ్గా ఆ ఖాళీలో అమరిపోయేలా తొడ ఎముక చివరన బంతిలాంటి భాగం ఉండి, ఈ రెండింటి కలయితో కీలు (జాయింట్) ఏర్పడుతుంది. ఈ కీలు వల్లనే రోజువారీ చేసే అనేక పనులు సాధ్యమవుతాయి. ఇటీవల అనేక కారణాలతో... అంటే... వయసు పెరగడం వల్ల వచ్చే ఆర్థ్రైటిస్‌తో, తుంటి ఎముకలో అరుగుదల వల్ల, యాంకలైజింగ్ ఆర్థ్రైటిస్‌తో, మరీ ముఖ్యంగా ఇటీవల కరోనా తర్వాత పాతికేళ్ల లోపు యువతలో సైతం అవాస్క్యులార్ నెక్రోసిస్ కారణంగా తుంటి ఎముక అరగడం, విరగడం చాలా సాధారణమయ్యింది. ఇలాంటప్పుడు తుంటి ఎముక మార్పిడి సర్జరీ చేయడం అవసరమవుతుంది. అయితే ఇదే శస్త్రచికిత్సను 'యాంటీరియర్ హిప్ రీప్లేస్‌మెంట్' పద్ధతిలో కాస్త వైవిధ్యంగా నిర్వహిస్తున్నారు డాక్టర్ నితీశ్ భాన్. ఈ పద్ధతి అంటే ఏమిటో, దాని వల్ల ప్రయోజనాలేమిటో ఆయన మాటల్లోనే...

ప్రశ్న : యాంటీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్ అంటే ఏమిటి, దాని వల్ల ప్రయోజనాలేమిటి?

నితీశ్ భాన్ : 'యాంటీరియర్ హిప్ రీప్లేస్‌మెంట్' అంటే ఏమిటో తెలుసుకునే ముందర, అసలు సంప్రదాయబద్ధంగా (కన్వెన్షనల్‌గా) చేసే 'పోస్టీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్' అంటే ఏమిటో తెలియాలి. అప్పుడు దానికీ దీనికీ తేడాలేమిటి అనేవి తెలుస్తాయి. నిజానికి హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీని మూడు రకాలుగా చేస్తారు. అవి... మొదటిది పిరుదు వెనకభాగం నుంచీ, రెండోది కాస్త పక్కగా చేసేవి. వీటినే పోస్టీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్‌గా చెప్పవచ్చు. ఇందులో మూడోది... మనం యాంటీరియర్‌గా చెప్పే... కాలి ముందు వైపు నుంచి చేసే శస్త్రచికిత్స.



సాధారణంగా 'పోస్టీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్'లో పిరుదు దగ్గర ఉండే మూడు కండరాల సముదాయంలో పెద్దదైన 'గ్లుటియస్ మాక్సిమస్' అనే పెద్ద కండరాన్నీ, మరి కొన్ని కీలకమైన కండరాల్ని కట్ చేయాల్సి వస్తుంది. ఇలా కండరాలను కట్ చేసి, తుంటి కీలు వరకు వెళ్లాక కీలు మార్పిడి ప్రక్రియ అంతా ఒకేలా ఉంటుంది. కానీ... అతి పెద్దవీ, కీలకమైన కండరాలను కట్ చేయడం వల్ల గాయం తగ్గి, అంతా నయం కావడానికి కనీసం ఐదారు నెలలు పట్టవచ్చు. అయితే 'యాంటీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్'లో ఇలా కీలకమైన కండరాల కోత అవసరముండదు కాబట్టి ఇది తగ్గడానికి 12 రోజులు చాలు.

ప్రశ్న : శస్త్రచికిత్స ఏదైనప్పటికీ... ఆర్నెల్ల తర్వాతైనా అంతా మునపటిలా ఉంటుందా?

నితీశ్ భాన్ : అదే చెప్పబోతున్నా. గ్లుటియస్ మాక్సిమస్ లాంటి అతి పెద్ద కండరం కట్ చేయడం వల్ల 'పోస్టీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్' శస్త్రచికిత్స తర్వాత అనేక ప్రతిబంధకాలూ, ప్రతికూలతలు ఉంటాయి. మనం నిలబడటానికి, కూర్చోడానికి, కూర్చున్న తర్వాత లేవడానికి, కదలడానికి, నడవడానికి, పరుగెత్తడానికి... ఇలా చాలా కదలికలకు తోడ్పడే కండరం కావడంతో... హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్ తర్వాత అనేక ఆంక్షల్ని పాటించాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఒకవైపు ఒరిగి పడుకున్నప్పుడు కాళ్లు రెండూ దగ్గరగా తీసుకురాకూడదు. కూర్చున్నప్పుడు పాదాలు లోపలివైపునకు ఉండేలా కాళ్లు దగ్గరగా పెట్టుకోకూడదు. కూర్చుని ముందుకు వంగకూడదు. కూర్చుని కాళ్లు ముడిచినప్పుడు 90 డిగ్రీల నుంచి 100 డిగ్రీలు లోపలికి ముడవలేం. కూర్చుని ముందుకు వంగి సాక్స్ తొడగలేము, షూలేసులు కట్టుకోలేం. అంతెందుకు... సోఫాలో నిర్భయంగా, నిశ్చింతగా, సౌకర్యంగా కూర్చోడానికీ జాగ్రత్త పాటించాలి. ఎందుకంటే పోస్టీరియర్ పద్ధతిలో కీలు మార్పిడి తర్వాత... ప్రతి కదలికలోనూ కీలు తన స్థానం నుంచి తొలగి పోయేందుకు (డిస్‌లొకేషన్‌కు) అవకాశం ఉంటుంది. పోస్టీరియర్‌లో గాయం తగ్గేందుకు ఆర్నెల్లు పట్టడం, ప్రతి కదలికలోనూ జాగ్రత్త వహించాల్సిరావడం, డిస్‌లొకేషన్ రిస్క్ ఉండటంతో చికిత్స తర్వాతా నిశ్చింతగా ఉండటం సాధ్యం కాదు. ఇది క్వాలిటీ ఆఫ్ లైఫ్‌పై ప్రభావం చూపుతుంది.



ప్రశ్న : మరి యాంటీరియర్‌తో ప్రయోజనం ఏమిటి?

నితీశ్ భాన్ : ఇంతకుమునుపు చెప్పుకున్న ప్రతి బంధకాలేమీ ఉండవు. పాటించాల్సిన ఆంక్షలు ఒక్కటి కూడా ఉండవు. అంటే జీరో రిస్ట్రిక్షన్స్ అన్నమాట. ఎందుకంటే.... యాంటీరియర్ శస్త్రచికిత్సలో చిన్న గాటు తప్ప పెద్ద లేదా కీలకమైన కండరాలు వేటినీ కోయనక్కర్లేదు. దీంతో కండరాలు దెబ్బతినడం చాలా చాలా తక్కువ (లెస్ టిష్యూ డ్యామేజ్); కోలుకునే వేగమూ చాలా ఎక్కువ. అక్కడ కోత గాయం మానడానికి ఆర్నెల్లు పడితే, ఇక్కడ కేవలం 10, 12 రోజులు చాలు. నేను చేసిన కొన్ని శస్త్రచికిత్సల్లో రెండో రోజే పరుగెత్తడం, కొన్ని రోజుల వ్యవధిలోనే వాహనాలు నడపడం జరిగింది. వైద్య గణాంకాల ప్రకారం... యాంటీరియర్‌లో ఇలాంటి డిస్‌లొకేషన్‌కు అవకాశాలు కేవలం 1 శాతం లోపే. ఆస్ట్రేలియన్ జాయింట్ రిజిస్ట్రీ ప్రకారం పోస్టీరియర్ పద్ధతిలో డిస్‌లొకేషన్ రిస్క్ 21.1 శాతం కాగా... యాంటీరియర్‌లో ఇది కేవలం ఒక శాతం కంటే కూడా తక్కువే. ఇవి ప్రపంచవ్యాప్తంగా ఉన్న గణాంకాలైతే, ఇప్పటివరకు నేను నిర్వహించిన దాదాపు 450 పైగా సర్జరీల్లో హిప్ డిస్‌లొకేషన్ అయిన కేసు, ఫెయిలైన కేసు ఒక్కటి కూడా లేనే లేదు.

ప్రశ్న : మరి అందరూ యాంటీరియర్ పద్ధతిలోనే చేయవచ్చుగా?

నితీశ్ భాన్ : ఇది సాంకేతికంగా, సునిశితత్వం పరంగా చాలా ఎక్కువ నైపుణ్యాలు అవసరమైన శస్త్రచికిత్స. దీనికి చాలా నేర్పు కావాలి. సర్జరీ నిర్వహణను ఒక గ్రాఫ్‌లా గీస్తే సునిశితత్వం, నేర్పూ, నైపుణ్యాలూ ఇవన్నీ ఒక నిటారైన గీతలా ఉంటాయి. అంటే... యాంటీరియర్ హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్‌లో అంత సక్లిష్టత ఉంటుందన్నమాట. అందుకే దాదాపు ఈ పద్ధతిలో శస్త్రచికిత్స చేసేవారిలో పన్నెండేళ్ల కిందట దేశంలో ఆరేడుగురి కంటే ఎక్కువ లేరు. ఇప్పటికీ నా అంచనా ప్రకారం మహా అయితే తొమ్మిది మది ఉండి ఉంటారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నేనే సీనియర్. అంతెందుకు విదేశాల నుంచి కూడా వచ్చి... ముంబైలో కుదరకపోవడంతో... అక్కడున్నవారితో వాకబు చేసుకుని... అక్కడ్నుంచి ఇక్కడికి వస్తుంటారు.

ప్రశ్న : ఈ యాంటీరియర్ హిప్ రీ–ప్లేస్‌మెంట్ సర్జరీకి ఫీజులెలా ఉంటాయి?

నితీశ్ భాన్ : హిప్ రీప్లేస్‌మెంట్‌లో ఏ రకమైనా ఒకేలాంటి ఫీజు ఉంటుంది. అయితే శస్త్రచికిత్స తర్వాత రీప్లేస్‌మెంట్ కోసం ఉపయోగించే కృత్రిమ కీలు (ప్రోస్థటిక్ జాయింట్)కే వేర్వేరు ధరలుంటాయి.



డాక్టర్ నితీశ్ భాన్
సీనియర్ ఆర్థోపెడిక్ అండ్ నీ & హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్



మెడి టిప్
తల వెంట్రుకల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే...

ఒక వయసు దాటాక తెల్లబడ్డ వెంట్రుకలకు రంగువేయడం చూస్తుంటాం. ఇక యువతులూ, కొందరు మహిళలు కూడా స్ట్రెయిటెన్, బ్లీచింగ్ చేసుకోవడం వంటివి చేస్తున్నారు. ఈ ప్రక్రియల్లో జుట్టు (హెయిర్ స్ట్రాండ్స్) దెబ్బ తినకుండా సంరక్షించుకోడానికి చేయాల్సిన పనులివి...

▸ మాటిమాటికీ దువ్వడం, దువ్వుతున్నప్పుడు చిక్కులున్నచోట మృదువుగా కాకుండా బలంగా దువ్వడం, జుట్టు తడిగా ఉన్నప్పుడే దువ్వడం వల్ల వెంట్రుకలు దెబ్బతింటాయి. ఇలా దెబ్బతిన్నప్పుడు వెంట్రుక సాఫీగా లేకుండా కొన్నిచోట్ల ఉబ్బుగానూ, మరోచోట పలచగానూ కనిపించవచ్చు. ఇలా కనిపించే వెంట్రుకల్ని 'బబుల్‌డ్ హెయిర్' అంటారు. కాబట్టి వెంట్రుకలపై బలం ఉపయోగించకుండా, మృదువుగా దువ్వేలా జాగ్రత్త వహించాలి ▸ షాంపూ వాడే సమయంలో దాన్ని నేరుగా వాడకుండా... అరచేతిలో వేసుకుని, కొన్ని నీళ్లు కలిపి, దాని సాంద్రతను కాస్త తగ్గించాలి. దీంతో వెంట్రుకల మీద షాంపూలోని రసాయనాల తాకిడి, ప్రభావం తగ్గుతాయి ▸ తలస్నానం తర్వాత డ్రైయర్ వాడేటప్పుడు వెంట్రుకలకు వేడి గాలి మరీ నేరుగా తగలకుండా జాగ్రత్త వహించాలి ▸ రంగువేయడం, బ్లీచింగ్‌లతో జుట్టు రసాయనాలకు ఎక్స్‌పోజ్ అవుతుంది. దాంతో వెంట్రుక పైపొర అయిన 'క్యూటికిల్' దెబ్బతినే అవకాశముంది. క్యూటికిల్ దెబ్బతినగానే కాస్త లోపల ఉండే కార్టెక్స్ అనే భాగం బయటపడుతుంది. ఇది క్యూటికిల్‌లా నునుపుగా కాకుండా కాస్తంత గరుకుగా ఉంటుంది. ఫలితంగా జుట్టు నిర్జీవంగా, గజిబిజిగా కనిపిస్తుంటుంది. అందుకే రంగువేసే సమయంలో నాణ్యమైన హెయిర్-డై వాడుకోవాలి. ఒకసారి తమకు సరిపడుతుందా లేదా అన్నదీ చూసుకోవాలి.

హుక్ వార్మ్ ఇన్ఫెక్షన్‌తో ముప్పు ఇది..!

హుక్ వార్మ్ అనే పరాన్నజీవి ప్రధానంగా చిన్నపేగుల్లో ఉంటుంది. మనం తీసుకునే ఆహారాన్ని అది సంగ్రహిస్తూ ఉండటం వల్ల నీరసం, నిస్సత్తువ, పోషకాల లోపంతో పాటు ప్రధానంగా ఐరన్ లోపం కనిపిస్తుంది. చాలామందిలో ఇది ప్రధానంగా చిన్నపేగులనే ఆశ్రయించినా కొందరిలో మాత్రం ఊపిరితిత్తులు, చర్మం వంటి ఇతర అవయవాలపైనా ప్రభావం చూపవచ్చు. పొలాలకు వెళ్లే పెద్దలూ, మట్టిలో ఆడుకునే పిల్లల్లో ఇది ఎక్కువ. ఈ ఇన్ఫెక్షన్ గురించి అవగాహన కోసం ఈ కథనం.

హుక్‌వార్మ్ ఇన్ఫెక్షన్ అనేది పొలాల్లో నడిచేవారిలో... అది కూడా చెప్పులు, పాదరక్షలు లేకుండా నడిచేవారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ఇప్పటికీ కొన్ని మారుమూల పల్లెల్లో ఆరుబయలు మలవిసర్జన చేసే అలవాటు ఉంటుంది. మలంతో పాటు విసర్జితమైన హుక్‌వార్మ్ గుడ్లు ఏదో రూపంలో మనుషుల నోటి ద్వారా మళ్లీ లోనికి ప్రవేశించడం అన్నది దీని జీవితచక్రం (లైఫ్‌సైకిల్)లో భాగం. నేల /మట్టి ద్వారా ఇన్ఫెక్షన్ వస్తుంటుంది కాబట్టి దీన్ని 'సాయిల్ ట్రాన్స్‌మిటెడ్ హెల్మింథిస్' అంటారు. మనుషులు నేల మీద నడవక తప్పదు కాబట్టి దీని విస్తృతి ఎంతంటే... ప్రపంచవ్యాప్త జనాభాలో దాదాపు 10% మందిలో ఈ ఇన్ఫెక్షన్ ఏదో ఒక దశలో వచ్చే ఉంటుందనేది ఒక అంచనా.



డాక్టర్ కె. శివరాజు
సీనియర్ ఫిజీషియన్

లక్షణాలు: ● కొద్దిపాటి నుంచి ఓ మోస్తరు జ్వరం ● పొట్టలో నొప్పి ● ఆకలి మందగించడం ● నీళ్ల విరేచనాలు ● బరువు తగ్గడం ● రక్తహీనత ● కొందరిలో దగ్గు / పిల్లికూతలు (ఊపిరితిత్తులు ప్రభావితమైనప్పుడు) ● చర్మంపై ర్యాష్ (చర్మం ప్రభావితమైనప్పుడు).

ఇదీ ముప్పు... తీసుకున్న ఆహారం, దాంతో సమకూరే శక్తి, సారం అంతా హుక్‌వార్మ్స్ గ్రహించడంతో తీవ్రమైన రక్తహీనత, పోషకాల లోపం, ప్రొటీన్స్ లోపం వంటి పరిణామాలతో తలతిరగడం, తీవ్రమైన అలసట, కండరాలు పట్టేయడం, ఊపిరి అందకపోవడం, ఛాతీలో నొప్పి వంటి అనేక పరిణామాలు తరచూ చోటు చేసుకుంటూ ఉంటాయి. దాంతో క్రమంగా భౌతికంగా, మానసికంగా బలహీనమయ్యే అవకాశం ఉంది.

నిర్ధారణ: మల, రక్త (సీబీపీ) పరీక్షలతో నిర్ధారణ చేయవచ్చు. రక్తపరీక్షలో ఈసినోఫిలియా (తెల్లరక్తకణాల్లో ఒక రకం) కౌంట్ నార్మల్ కంటే ఎక్కువగా ఉంటుంది. అలాగే మల పరీక్షలో హుక్‌వార్మ్ గుడ్లు కనిపిస్తాయి.

నివారణ: ● కాచివడబోసిన నీళ్లు తాగాలి. వేడిగా ఉన్నప్పుడే ఆహారం తినేయాలి ● తినేముందు చేతులు కడుక్కవాలి ● ఆరుబయట మలవిసర్జనను పూర్తిగా నిలిపివేయాలి. (పల్లెల్లో సైతం ఇది జరగాలి) ● మల విసర్జన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి ● పెద్దలు పొలాల్లో తిరిగి వచ్చాక, పిల్లలు మట్టిలో ఆడుకున్న తర్వాత చేతులు, కాళ్లు శుభ్రంగా కడుక్కోవాలి ● పెంపుడు జంతువులకు క్రమం తప్పకుండా డీ-వార్మింగ్ చేయిస్తుండాలి.



చికిత్స: కాళ్లకు లేదా ఒంటి మీద ఎక్కడైనా ర్యాష్ కనిపించినా, లేదా ఆకలి / బరువు తగ్గినట్లుగా ఉన్నా, తీవ్రమైన అలసట, నీరసం, నిస్సత్తువ ఉన్నా డాక్టర్‌ను సంప్రదించాలి. అవసరమైన పరీక్షల తర్వాత వ్యాధి నిర్ధారణ జరిపాక వారు మిబెండిజోల్, ఆల్బెండిజోల్ వంటి మందుల్ని సూచిస్తారు.



మూడో వన్డేలోను పాకిస్తాన్‌దే విజయం

అఫ్గనిస్తాన్‌తో జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను పాకిస్తాన్ 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. శనివారం కొలంబోలో జరిగిన చివరి మ్యాచ్‌లో పాక్ 59 పరుగుల తేడాతో అఫ్గనిస్తాన్‌ను ఓడించింది. ముందుగా పాకిస్తాన్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 268 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మొహమ్మద్ రిజ్వాన్ (67), కెప్టెన్ బాబర్ ఆజమ్ (60) అర్ధ సెంచరీలు సాధించగా, ఆగా సల్మాన్ (38 నాటౌట్), నవాజ్ (30) రాణించారు. నైబ్, ఫరీద్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం అఫ్గన్ జట్టు 48.4 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. ముజీబ్ ఉర్ రహమాన్ (64) హాఫ్ సెంచరీ చేయగా, షాహిదుల్లా (37), రియాజ్ హసన్ (34) మాత్రమే కొద్దిగా పోరాడారు. పాక్ బౌలర్లలో షాదాబ్ ఖాన్ 3 వికెట్లు పడగొట్టాడు.

నోవా లైల్స్ 'డబుల్'

- 200 మీటర్ల పరుగులో స్వర్ణం సాధించిన అమెరికా అథ్లెట్
- మహిళల విజేత షెరికా జాక్సన్
- ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్



లైల్స్

బుడాపెస్ట్ (హంగేరి): అమెరికా అథ్లెట్ నోవా లైల్స్ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 'డబుల్' సాధించాడు. ఈ మెగా ఈవెంట్‌లో ఇప్పటికే 100 మీటర్ల స్ప్రింట్‌లో విజేతగా నిలిచిన అతను ఇప్పుడు 200 మీటర్ల పరుగులో కూడా అగ్రస్థానాన్ని అందుకున్నాడు. అంచనాలకు తగినట్లుగానే సత్తా చాటిన లైల్స్ 19.52 సెకన్లలో పరుగు పూర్తి చేసి పసిడి పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ ఈవెంట్‌లో ఎరియోన్ నైటాన్ (అమెరికా – 19.75 సెకన్లు) రజతం సాధించగా, లెట్సిలో టెబొగో (బోట్స్‌వానా – 19.81 సెకన్లు) కాంస్యం గెలుచుకున్నాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ 200 మీటర్ల పరుగులో లైల్స్‌కు ఇది వరుసగా మూడో స్వర్ణం కావడం విశేషం. గత ఏడాది ఒరెగాన్‌లో జరిగిన పోటీల్లోనూ అతను బంగారు పతకం సాధించాడు. తద్వారా బోల్ట్ తర్వాత ఒకే ఈవెంట్‌లో వరుసగా కనీసం మూడు స్వర్ణాలు గెలిచిన రెండో అథ్లెట్‌గా లైల్స్ నిలిచాడు. 4x100 మీటర్ల రిలేలో అమెరికా జట్టు ఫైనల్ చేరింది. ఇందులో కూడా భాగంగా నిలిచి విజయం సాధిస్తే లైల్స్ ఖాతాలో మూడో స్వర్ణం చేరుతుంది.

ప్రపంచ రికార్డుకు చేరువై...

100 మీటర్ల స్ప్రింట్‌లో రజతం సాధించిన షెరికా 200 మీటర్ల ఈవెంట్‌లో తన పరుగుకు మరింత పదును పెట్టింది. ఈ జమైకా అథ్లెట్ 200 మీటర్ల పరుగులో రెండో అత్యుత్తమ టైమింగ్‌ను నమోదు చేస్తూ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. 21.41 సెకన్లలో షెరికా పరుగులు పూర్తి చేసింది. గాబ్రియెల్ థామస్ (అమెరికా – 21.18 సెకన్లు), షకారి రిచర్డ్సన్ (అమెరికా – 21.92 సెకన్లు)లకు వరుసగా రజత, కాంస్యాలు దక్కాయి. ప్రపంచ రికార్డు ఇప్పటికీ అమెరికాకు చెందిన ఫ్లోరెన్స్ గ్రిఫిత్ జాయ్‌నర్ (21.34 సెకన్లు) పేరిటే ఉంది. 1988లో ఆమె ఈ టైమింగ్‌ను నమోదు చేసింది. గత ఏడాది కూడా ఈ ఈవెంట్‌లో షెరికా స్వర్ణం సాధించింది.



షెరికా

ఆసియా రికార్డుతో ఫైనల్లోకి

భారత 4x400 రిలే బృందం ప్రదర్శన



ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత 4x400 మీటర్ల రిలే బృందం అద్భుత ప్రదర్శనతో సత్తా చాటింది. ఆసియా రికార్డుతో ఫైనల్‌కు అర్హత సాధించింది. తొలి హీట్‌లో మన జట్టు రెండో స్థానంలో నిలిచింది. మొహమ్మద్ అనస్ యాహియా, అమోజ్ జాకబ్, మొహమ్మద్ అజ్మల్ వరియత్తోడి, రాజేశ్ రమేశ్ భాగంగా ఉన్న భారత్ ఈ రేసును 2 నిమిషాల 59.05 సెకన్లలో పూర్తి చేసింది. ఇది కొత్త ఆసియా రికార్డు కావడం విశేషం. ఈ హీట్స్‌లో అమెరికా జట్టు మొదటి స్థానంలో నిలవగా, గ్రేట్ బ్రిటన్ టీమ్‌కు మూడో స్థానం దక్కింది. నేడు ఫైనల్ రేస్ జరుగుతుంది.

పాకిస్తాన్‌కు బీసీసీఐ అధ్యక్షుడు

ఆసియా కప్ కోసం పీసీబీ ఆహ్వానం



న్యూఢిల్లీ: క్రికెట్‌కు రెండు వైరి దేశాల బోర్డులకు సంబంధించి కీలక పరిణామం! ఆతిథ్య హోదాలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) లాహోర్‌లో ఏర్పాటు చేస్తున్న అధికారిక డిన్నర్‌కు హాజరయ్యేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అంగీకరించింది. భారత బోర్డు తరఫున అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ కార్యక్రమానికి హాజరవుతారు. ఆసియా కప్ కార్యక్రమంలో టోర్నీలో పాల్గొంటున్న అన్ని జట్ల బోర్డులకు ఆహ్వానం పంపారు. ఇందులో భాగంగా పీసీబీ అధ్యక్షుడు జకా అష్రఫ్ బీసీసీఐని కూడా ఇందులో భాగం కావాలని కోరారు. సెప్టెంబర్ 2న పల్లెకెలెలో భారత్, పాకిస్తాన్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించిన తర్వాత బోర్డు ప్రతినిధులు పాకిస్తాన్‌కు వెళతారు. బిన్నీ, శుక్లా వాఘా బోర్డర్ ద్వారా పాక్‌లోకి అడుగు పెడతారని సమాచారం. ఆసియా కప్‌కు పేరుకే పాకిస్తాన్ ఆతిథ్యం ఇస్తున్నా...ఇరు జట్ల ప్రస్తుతం నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భారత్ ఆ దేశంలో ఆడేందుకు నిరాకరించింది. దాంతో హైబ్రీడ్ మోడల్‌లో టీమిండియా తమ మ్యాచ్‌లకు శ్రీలంక వేదికగా ఆడుతోంది. నిజానికి బీసీసీఐ కార్యదర్శి జై షా వెళ్లడంపై కూడా చర్చ జరిగినా...జై షా బోర్డు కార్యదర్శి మాత్రమే కాకుండా భారత హోం మంత్రి కుమారుడు కూడా కావడంతో ఈ ఆలోచనను పక్కన పెట్టినట్లు సమాచారం. అయితే ఆసియా సభ్యుల గౌరవార్థం ఇస్తున్న విందుకే ఈ పర్యటన పరిమితమని... ఇరు దేశాల బోర్డు మధ్య ఎలాంటి చర్చలు ఉండవని, ద్వైపాక్షిక సిరీస్‌ల విషయంలో యథాతథ స్థితి కొనసాగుతుందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి.

కాంస్యంతో సరి

- సెమీస్‌లో పోరాడి ఓడిన ప్రణయ్
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

కోపెన్‌హాగెన్ (డెన్మార్క్): అసాధారణ ఆటగాడు అక్సెల్‌సన్‌కు సొంతగడ్డపైనే చుక్కలు చూపించిన భారత షట్లర్ హెచ్.ఎస్.ప్రణయ్ పోరు సెమీ ఫైనల్లో ముగిసింది. ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఈ కేరళ స్టార్ కాంస్యంతోనే సరిపెట్టుకున్నాడు. క్వార్టర్స్‌లో తొలి గేమ్ కోల్పోయినప్పటికీ వరుస గేమ్‌లను గెలిచి పతకం ఖాయం చేసుకున్న భారత ఆటగాడు చిత్రంగా సెమీస్‌లో తొలి గేమ్ గెలిచి జోరు మీదుండి తర్వాత రెండు గేమ్‌లను గెలువలేక మ్యాచ్ ఓడిపోయాడు. శనివారం 76 నిమిషాల పాటు సాగిన పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్లో హెచ్.ఎస్. ప్రణయ్ 21–18, 13–21, 14–21తో కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయం చవిచూశాడు. తొలి గేమ్‌లో తెలివైన షాట్లతో ప్రత్యర్థిని కోర్టులో పరుగు పెట్టిస్తూ స్కోరు సాధించాడు. నెట్‌వద్ద చురుగ్గా పాయింట్లు సాధించిన ప్రణయ్ స్మాష్‌లతో చెలరేగి... తొలి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. తర్వాత రెండో గేమ్ కూడా ప్రణయ్ ఆధిపత్యంతోనే మొదలైంది. వరుసగా 4–0తో పైచేయి సాధించాడు. ఈ దశలో చేసిన అనవసర తప్పిదాలతో భారత షట్లర్ పాయింట్లను కోల్పోయాడు. పదే పదే ఇవే తప్పిదాలు కొనసాగించడంతో ఆధిక్యాన్ని, ఆపై గేమ్‌నే కోల్పోయాడు. నిర్ణాయక మూడో గేమ్‌లోనూ ప్రణయ్ తప్పిదాలనే ఆసరాగా చేసుకొని పుంజుకున్న థాయ్ ప్రత్యర్థి చివరిదాకా ఆధిపత్యాన్ని కొనసాగించాడు.



ఫైనల్లో రాయలసీమ కింగ్స్

ఆంధ్ర ప్రీమియర్ లీగ్

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో రాయలసీమ కింగ్స్ ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో కింగ్స్ 3 పరుగుల తేడాతో గోదావరి టైటాన్స్‌పై విజయం సాధించింది. ముందుగా రాయలసీమ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 218 పరుగుల భారీ స్కోరు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కోగటం రెడ్డి (47 బంతుల్లో 92; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, గిరినాథ్ రెడ్డి (20 బంతుల్లో 43; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), వంశీ కృష్ణ (34 బంతుల్లో 43; 3 ఫోర్లు, 1 సిక్స్) అండగా నిలిచారు. అనంతరం గోదావరి టీమ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 215 పరుగులు చేసి పోరాడి ఓడింది. భూపతి రాజు వర్మ (40 బంతుల్లో 89; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒంటిచేత్తో జట్టును గెలిపించే ప్రయత్నం చేయగా, ఇతర ఆటగాళ్లనుంచి సహకారం లభించలేదు. నేడు జరిగే ఫైనల్లో కోస్టల్ రైడర్స్‌తో రాయలసీమ కింగ్స్ తలపడుతుంది. ముగింపు కార్యక్రమానికి బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, మాజీ కెప్టెన్ కె.శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారు.

అంకిత పరాజయం



న్యూయార్క్: భారత టాప్ టెన్నిస్ క్రీడాకారిణి అంకితా రైనా ఈ ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించడంలో విఫలమైంది. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లలో తొలి రెండు నెగ్గిన అంకిత మూడో క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో అంకిత వరుస సెట్లలో 2–6, 2–6 స్కోరుతో మిర్జమ్ జొర్క్లండ్ (స్వీడన్) చేతిలో పరాజయంపాలైంది. 1 గంటా 37 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో ప్రపంచ 154వ ర్యాంకర్ అంకిత తన ప్రత్యర్థి ముందు నిలవలేకపోయింది. జొర్క్లండ్ 3 ఏస్‌లు సంధించగా, అంకిత ఒకే ఒక ఏస్ కొట్టింది.

జీపీ బ్యాడ్మింటన్ లీగ్ వాయిదా

బెంగళూరు: గ్రాండ్‌ప్రి బ్యాడ్మింటన్ లీగ్ (జీపీబీఎల్) రెండో సీజన్ నిరవధికంగా వాయిదా పడింది. గతేడాది విజయవంతమైన ఈ లీగ్‌కు ఈసారి భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) నుంచి అభ్యంతరం వ్యక్తమవడం, కోర్టు వివాదాలతో పలువురు షట్లర్లు తప్పుకోవడంతో వాయిదా వేస్తున్నట్లు లీగ్ కమిషనర్ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. కర్ణాటక హైకోర్టు నుంచి లీగ్ నిర్వహణకు అనుకూల తీర్పే వచ్చినప్పటికీ... తమ గుర్తింపులేని లీగ్, టోర్నీల్లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని 'బాయ్' హెచ్చరించడంతో స్టార్ షట్లర్లు భమిడిపాటి సాయిప్రణీత్, మిథున్ మంజునాథ్ తదితరులు వేలం తర్వాత తప్పుకున్నారు. దీంతో నిర్వాహకులు నిరవధిక వాయిదా వేయక తప్పలేదు. తొలి సీజన్‌లో కేజీఎఫ్ వోల్వ్స్ విజేతగా నిలిచింది.

వెర్‌స్టాపెన్‌కే పోల్



జండ్‌వూర్ట్ (నెదర్లాండ్స్): ఈ ఎఫ్1 సీజన్‌లో జోరు మీదున్న రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్‌కే మరో పోల్ పొజిషన్ దక్కింది. శనివారం జరిగిన డచ్ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ రేసులో ల్యాప్‌ను అందరికంటే ముందుగా 1 నిమిషం 10.567 సెకన్లలో పూర్తి చేసిన వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్ లభించింది. ఈ సర్క్యూట్‌పై అతనికిది వరుసగా మూడో పోల్ పొజిషన్ కావడం విశేషం. ఆదివారం ప్రధాన రేసు జరుగుతుంది. డిఫెండింగ్ ఫార్ములావన్ చాంపియన్ వెర్‌స్టాపెన్ ఈ సీజన్‌లో 11వ టైటిల్‌పై కన్నేశాడు. మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ (1ని.11.104 సెకన్లు) రెండో స్థానంలో నిలిచాడు.



భారత మహిళలకు స్వర్ణం

బర్మింగ్‌హామ్: అంధుల క్రికెట్‌లో భారత మహిళల జట్టు సత్తా చాటి విజేతగా నిలిచింది. ఇంటర్నేషనల్ బ్లైండ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐబీఎస్ఏ) నిర్వహిస్తున్న వరల్డ్ గేమ్స్ క్రికెట్‌లో భారత్ స్వర్ణం సొంతం చేసుకుంది. ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్లో భారత్ 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 8 వికెట్లకు 114 పరుగులు చేయగా...వర్షం కారణంగా లక్ష్యాన్ని 42 పరుగులకు కుదించగా భారత్ 3.3 ఓవర్లలో విజయాన్ని అందుకుంది.

తగ్గేదే లే.. ఆపేదే లే.. అనుకున్నా..!

- అల్లు అర్జున్



"ఒకరు అదే పనిగా మనల్ని విమర్శిస్తున్నారంటే మనం ఎదిగినట్లే...
బయటకు చెప్పలేం... చాలా అవమానాలుంటాయి..
నాది అత్యాస.. నాకు అన్నీ కావాలి...
నేషనల్ బెస్ట్ హీరో అని ఊరికే ఇచ్చేయరు"...
ఇంకా ఇలాంటి ఆసక్తికరమైన విషయాలను 'సాక్షి'తో ప్రత్యేకంగా పంచుకున్నారు అల్లు అర్జున్. 'జాతీయ ఉత్తమ నటుడు' అవార్డు దక్కించుకున్న ఆనందంలో ఉన్న అల్లు అర్జున్‌తో శనివారం జరిపిన ఇంటర్వ్యూలోని విశేషాలు ఈ విధంగా...

జాతీయ ఉత్తమ నటుడి ప్రకటన రాగానే మీ రియాక్షన్?

అల్లు అర్జున్: ఇంగ్లీష్‌లో ఎలైటెడ్ (ఉక్కిరి బిక్కిరి.. పట్టరానంత ఆనందం...) అంటారు. నా ఫీలింగ్ అదే. అయితే ఈ అవార్డు నాకు వచ్చింది నా వల్ల కాదు. సుకుమార్ వల్ల వచ్చిందన్నది నా ఫస్ట్ ఫీలింగ్. అవార్డు ప్రకటన రాగానే నేను, సుకుమార్ ఆప్యాయంగా హత్తుకుని, ఆ ఉద్విగ్న క్షణాల్లో అలా ఓ నిమిషానికి పైగా ఉండిపోయాం. మైత్రీ మూవీ మేకర్స్ కాకుండా 'పుష్ప'ని ఎవరు తీసినా ఈ సినిమా ఇంత బాగా వచ్చి ఉండేది కాదు. నాతో 'పుష్ప' తీశారని అలా అనడంలేదు. 'రంగస్థలం' చూసినప్పుడే 'మైత్రీ సపోర్ట్ చేసింది కాబట్టే నువ్వు అనుకున్న సినిమా తీయగలిగావు. ఈ సినిమాని వేరే ఏ బేనర్‌తో చేసినా తీయలేకపోయేవాడివి' అని సుకుమార్‌తో అన్నాను. 'పుష్ప'కి కూడా ఇదే వర్తిస్తుంది.

ఈ తరంలో తెలుగులో ఉన్న 'బెస్ట్ యాక్టర్స్'లో మీరు ఒకరు. ముందు తరాల్లో ఎందరో 'బెస్ట్ యాక్టర్స్' ఉన్నారు. వారికి ఉత్తమ జాతీయ నటుడు అవార్డు లభించలేదు. ఈ విషయంపై మీ అభిప్రాయం..

నాకు అవార్డు వచ్చినందుకు ఎంత హ్యాపీగా ఉందో.. ముందు తరాల వారికీ, నా సమకాలీన నటులకు అవార్డు రాలేదన్నది అంతే బాధాకరమైన విషయం. వారంతా అర్హులే. జాతీయ అవార్డు దక్కించుకునే స్థాయి నటనను అందరూ ప్రదర్శించారు. కానీ ఎందుకో వారికి రాలేదు. సామర్థ్యం లేక వారికి అవార్డులు రాలేదనుకుంటే అది మన తెలివితక్కువతనమే. మన పరిశ్రమలో ఎప్పుడూ గొప్ప నటులు ఉంటూనే ఉన్నారు. కానీ ఎందుకో కుదర్లేదు.. ఈసారి కుదిరింది.

అంటే.. కాస్త అదృష్టం కూడా కలిసి రావాలంటారా?

అదృష్టాన్ని నమ్మను. మన కృషి మనం చేస్తూ ఉంటే సరైన చాన్స్, టైమ్ వచ్చినప్పుడు కొడితే ఆ పాయింట్‌ను అదృష్టం అంటా. మంచి పెర్ఫార్మెన్స్ ఇచ్చే విషయంలో నేను ఎప్పుడూ కృషి చేస్తూనే ఉన్నాను. ఇక ఇప్పుడు తెలుగు సినిమాలకు దేశవ్యాప్త గుర్తింపు దక్కడం, తెలుగు సినిమాలపై అందరి దృష్టి పడటం అనేది అవకాశం. సో... నా కృషికి చాన్స్, టైమ్ కలిసి స్ట్రైక్ అయ్యాయి. ఇది లక్ అంటాను.

మీ 20 ఏళ్ల సక్సెస్‌ఫుల్ కెరీర్‌లో మీ కుటుంబం, అభిమానుల, ఇండస్ట్రీ భాగస్వామ్యం ఎంత..

నా సక్సెస్‌లో అందరి సపోర్ట్ ఉంది. ఏ సపోర్ట్ లేదని అనలేను. నా ఫ్యామిలీ, ఇండస్ట్రీ సపోర్ట్ ఉంది. ఎక్కువ శాతం ఉన్న నా సొంత ఫ్యాన్స్ సపోర్ట్‌తో పాటు మెగా ఫ్యాన్స్, ఇతర హీరోల ఫ్యాన్స్ ప్రోత్సాహం కూడా ఉంది.

మీ కెరీర్ ఫస్ట్ మొదలైంది మెగా ఫ్యాన్స్ సపోర్ట్‌తోనే. ఆ తర్వాత మీకు సొంత ఆర్మీ (అభిమానులు) ఏర్పాటైంది. ఇలా ఓన్ ఫ్యాన్ బేస్ డెవలప్ అయ్యాక పాజిటివిటీతో పాటు నెగటివిటీ కూడా వచ్చింది. ఈ విషయాన్ని ఎలా చూస్తారు..

నేనే కాదు.. ప్రపంచంలో ఉన్న ఏ వ్యక్తి అయినా ఒక చోటు నుంచి మొదలై, జీవితంలో ఎదిగే క్రమంలో కొంత టైమ్ గడిచాక తనకంటూ ఓ డెవలప్‌మెంట్ జరుగుతుంది. అది సహజం.. ఇందుకు ఉదాహరణగా చాలామంది ఉన్నారు. కొన్నిసార్లు పిల్లలు తమ తల్లిదండ్రుల కన్నా ఉన్నత స్థాయికి చేరుకుంటారు. ఇదొక సహజమైన ప్రయాణం.

కానీ ఎక్కడ మొదలయ్యారో ఆ నీడలో ఉండాలని వేరేవాళ్లు అనుకోవడం సహజంగా జరుగుతుంటుంది..

నేనేమనుకుంటానంటే.. ఒకరు విశేషంగా ఎదుగుతూ, ఓ లెవల్‌కి వచ్చాక.. వారు మన దగ్గర ఉండలేరని వారికే అర్థం అయిపోతుంది.. వాళ్లు ఇక్కడ సరిపోరని. అది పేరెంట్స్ అయినా కావొచ్చు.. ఫ్యామిలీలో ఎవరైనా కావొచ్చు. అయితే వాళ్లు ఎప్పుడు కోరుకుంటారంటే.. వాళ్లకంటే తక్కువగా ఉన్నప్పుడో.. ఇప్పుడు వాళ్లు ఎంత ఉన్నారో.. మనం అంతే ఉన్నప్పుడు ఎందుకు బయటకు వెళ్లాలని కోరుకుంటారు. అదే మనం 'టెన్ ఎక్స్' ఎదిగాం అనుకుంటే అప్పుడు వాళ్లు కోరుకోరు. ఇదంతా సైజ్ డిఫరెన్స్‌పై ఆధారపడి ఉంటుంది.

'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' సినిమా తర్వాత మీరు కొంత గ్యాప్ తీసుకున్నారు. ఆ తర్వాత మీరు చేసిన 'అల.. వైకుంఠపురములో..., పుష్ప' హిట్. ఆ గ్యాప్‌లో మిమ్మల్ని మీరు తెలుసుకోవడమే ఈ హిట్స్‌కి కారణమా..

నా గురించి నేను వంద శాతం తెలుసుకోవడానికి ఆ సమయం నాకు దొరికినట్లయింది. నేను ఏం తప్పలు చేశాను? ఎటు వెళ్తున్నాను అని ఆలోచించుకున్నాను. కొందరు సలహాలు ఇచ్చారు. చెప్పాలంటే నన్ను నేను సరిద్దుకున్న సమయం అది. అలా నన్ను నేను సరిదిద్దుకుని ఇకనుంచి తగ్గేదే లే... ఆపేదేలే అనుకున్నాను.

చిరంజీవిగారి ఇంటికి వెళ్లారు కదా. ఆయన స్పందన..

చిరంజీవిగారు చాలా మంచి మాట అన్నారు. ఓ జాతీయ అవార్డు రావడానికి ఓ నటుడికి కావాల్సిన కారణాలు ఇరవై ఉంటే.. అన్ని కారణాల్లోనూ నువ్వు వంద మార్కులు కొడతావ్ అన్నారు. బాడీ లాంగ్వేజ్.. మేకప్ కావొచ్చు... సంభాషణల ఉచ్చారణ కావొచ్చు.. ఇలా కొన్ని చెప్పుకుంటూ వచ్చారు. చిరంజీవిగారికి ఉన్న అనుభవంతో ఓ విషయాన్ని ఆయన మనకన్నా బాగా చూడగలరు. బాగా పెర్ఫార్మ్ చేశావ్. చెప్పాలంటే.. నీకు ఇవ్వకపోతే తప్పయిపోయేది అనే స్థాయిలో పెర్ఫార్మ్ చేశావన్నారు.

మీ నాన్నగారు (నిర్మాత అల్లు అరవింద్) చాలా సంతోషపడి ఉంటారు. అలాగే మీ కుటుంబ సభ్యులు ఎలా స్పందించారు...

అవార్డు సాధించిన నాకన్నా.. మా నాన్నగారికి ఎక్కువ శుభాకాంక్షలు వచ్చాయి (నవ్వుతూ). మా అమ్మ అయితే ఆనందంతో మాట్లాడలేకపోయారు. అమ్మ హగ్‌లోనే ఆమె సంతోషం అర్థమైపోయింది. అలాగే నా సినిమా గురించి మా ఆవిడ (స్నేహ) ఎప్పుడూ భావోద్వేగానికి లోనవ్వదు. కానీ తొలిసారి ఎమోషన్‌కి గురై, నన్ను హత్తుకుంది.

ఏదైనా మనకు దక్కినప్పుడు అందుకు మనం నిజంగా అర్హులమేనా? అనే ఓ ఆలోచన కలగడం సహజం. నేషనల్ అవార్డు ప్రకటించినప్పుడు అలాంటి ఆలోచన మీకేమైనా కలిగిందా?

నేనూ సుకుమార్‌గారు ఎప్పుడూ నిజం అనేది ఒకటి ఉంటుందని మాట్లాడుకుంటుంటాం. మేం నిజాయితీగా కష్టపడ్డాం. ఆ కష్టం ప్రజలకు కనెక్ట్ అయ్యింది. ఇది నిజం. ఒక సినిమా బాగుందా? లేదా అనేది నిజం మాట్లాడుతుంది. బాగోలేని సినిమాను నేను ఎంత ప్రమోట్ చేసినా వర్కౌట్ కాదు. కానీ మనం నిజాయితీగా కష్టపడ్డప్పుడు ఆ కష్టమే మాట్లాడుతుంది. అది నిజం. అప్పుడు నిజం దానంతట అదే మాట్లాడుతుంది. ఒకవేళ నేను సినిమాలో బాగా యాక్ట్ చేసి, నేనే బాగోలేదని చెప్పినా కూడా నా మాట ఎవరూ నమ్మరు. ఎందుకంటే నిజం నాకంటే గొప్పది.. నన్ను మించినది అనేది నా అభిప్రాయం.



తల్లి నిర్మలతో...

జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు సాధించారు. ఇక వాట్ నెక్స్ట్ అనే ప్రెజర్ ఏమైనా?

దేశవ్యాప్తంగా సినిమా పెరుగుతోంది. తెలుగు సినిమా మరింతగా ప్రగతి పథంలో ముందుకు వెళుతోంది. ఇప్పుడు మనం ఏ ప్రయోగాలు చేసినా రిసీవ్ చేసుకోవడానికి ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారు. ఇది ప్రెజర్ కాదు.. పెద్ద అడ్వాంటేజ్ అని చెప్పవచ్చు. చెప్పాలంటే ఎవరికైనా ప్రెజర్ లేదూ అంటే అది మనకే. తెలుగు పరిశ్రమతో పోటీపడాలని ఇతర ఇండస్ట్రీలు ఒత్తిడికి గురవుతున్నాయి.

తెలుగు సినిమాకు ఈ ఏడాది ఎక్కువగా జాతీయ అవార్డులు వచ్చాయి... ఈ విషయం గురించి ఏమంటారు?

ఈ గౌరవం దక్కడానికి 'ఆర్ఆర్ఆర్' సినిమాను ముఖ్య కారణంగా చెప్పుకోవాలి.. 'పుష్ప' కూడా. 'ఆర్ఆర్ఆర్'కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించింది. దీంతో జాతీయ స్థాయిలో 'ఆర్ఆర్ఆర్'ను గౌరవించుకోకపోతే అది తప్పవుతుందనే ఓ ప్రత్యేక ఫీలింగ్ ఆ సినిమాపై ఉంది. ఏదో ఆస్కార్స్‌కు వెళ్లింది కదా అని కాకుండా నిజంగా ఆ సినిమాకు సంబంధించి ఎవరెవరికి రావాలో వారికి ఇచ్చారు. తెలుగు సినిమాకు ప్రాముఖ్యత చేకూర్చారు. అందుకు తగ్గ కష్టం కూడా ఆ సినిమాలు పడ్డాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా తెలుగు ఇండస్ట్రీ ప్రామిసింగ్‌గా ఉంది. ఈ ఇంపాక్ట్ వారిపై (జ్యూరీని ఉద్దేశిస్తూ..) కూడా ఉంటుంది.

ఈ సమయంలో మీ తాత (ప్రముఖ నటుడు అల్లు రామలింగయ్య)గారు ఉండి ఉంటే సంతోషించేవారు..

ఆయన జీవించి ఉన్నట్లయితే.. ఇన్నేళ్ల చరిత్రలో నా మనవడు కొట్టాడు. తన జీవితానికి ఇది చాలని ఆయన ఫీలయ్యే సందర్భం కచ్చితంగా అయ్యుండేది. ఆ విషయం పక్కన పెడితే... నేను నేషనల్ అవార్డుని సాధించడం మా నాన్నగారు చూడగలిగారు. నాకు అదే చాలా అదృష్టం.

'పుష్ప'లో నటనపరంగా తగ్గేదే లే అన్నట్లు నటించారు. 'ఆర్ఆర్ఆర్'లో ఎన్టీఆర్, రామ్‌చరణ్ అద్భుత నటనతో పాటు ఆ సినిమా ఆస్కార్‌తో గ్లోబల్‌గా రీచ్ అయింది. తమిళ 'జై భీమ్'లో సూర్య నటన అద్భుతం.. ఈ పెద్ద పోటీలో జాతీయ అవార్డు ఎవరికి దక్కుతుందనే కోణంలో ఆలోచించారా?

మనం సౌత్‌లో ఉన్నాం కాబట్టి ఈ రెండు సినిమాల గురించే మాట్లాడటం సహజం. అయితే పోటీలో హిందీ నుంచి 'షేర్షా, సర్దార్ ఉద్దమ్' వంటి చిత్రాలు ఉన్నాయి. ఇంకా వేరే భాషల నుంచి వేరే చిత్రాల్లో నటించిన హీరోలు ఉన్నారు. పోటీలో 20 మందికి పైగా ఉన్నారు. కానీ ఫైనల్‌గా నేషనల్ హీరో ఒక్కడే. ఈ ప్రాసెస్‌లో 'పుష్ప' హీరోకి అవార్డు దక్కే అర్హత పూర్తిగా ఉంది. ఎందుకంటే నేషనల్ హీరోని సెలక్ట్ చేసేటప్పుడు అతని నటన చూస్తారు.. సినిమాని కాదు. అయినా బెస్ట్ ఫిలిం కింద నేషనల్ అవార్డుకి 'పుష్ప'ని తీసుకోరు. ఎందుకంటే స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్ కాబట్టి. అందుకే ఉత్తమ చిత్రం కేటగిరీకి మేం 'పుష్ప'ని పంపించలేదు. బెస్ట్ యాక్టర్ కేటగిరీ అనేది పూర్తిగా నటనని బేస్ చేసుకునే ఇస్తారు. ఆ విధంగా పుష్పరాజ్.. బెస్ట్ అనుకుని, నామినేషన్‌కి పంపించాం. మా నమ్మకం నిజమైంది.

20 ఏళ్ల కెరీర్.. 20 మందికి పైగా హీరోలతో పోటీ పడి నేషనల్ అవార్డు తెచ్చుకున్న ఈ ఆనందంలో మీ కెరీర్‌ని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తోంది?

యాక్చువల్‌గా ఇలా ఆనందంగా ఉన్నప్పుడు కాదు.. 'సాడ్ మూమెంట్స్' అప్పుడే ఎక్కువ ఎనలైజ్ చేసుకుంటాం. హ్యాపీ అప్పుడు హాయిగా అలా వెళ్లిపోతాం. 20 ఏళ్ల లైఫ్ టైమ్‌లో ఏ మనిషికైనా హ్యాపీ.. సాడ్ ఈ రెండూ ఉంటాయి. బయట చూసేవాళ్లకు అంతా స్మూత్‌గా ఉన్నట్లు కనిపిస్తుంది కానీ ఏ మనిషి జీవితం కూడా ఈ రెండూ లేకుండా ఫ్రిజ్‌లో పెట్టిన మటన్‌లా ఫ్రీజ్ అయిపోవడం జరగదు (నవ్వుతూ). ఏ చెట్టుకి ఆ గాలి. బయటకు చెప్పలేకపోవచ్చు కానీ.. చాలా అవమానాలు ఉంటాయి. ఆ చెప్పలేనివి జరిగినప్పుడు విశ్లేషణ అనేది మొదలవుతుంది. అందులోంచే నేర్చుకోవడం, నడుచుకోవడం కూడా తెలుస్తుంది.

మీరన్నట్లు అవమానాలు సహజం. పైగా ఇప్పుడీ డిజిటల్ వరల్డ్‌లో ట్రోల్స్ ఎక్కువ.. వీటిని పట్టించుకుంటారా?

హండ్రెడ్ పర్సంట్ అన్నీ పట్టించుకుంటాను. కాకపోతే 'ఫన్'గా తీసుకుంటాను. మన కోసం ఒకళ్లు పని గట్టుకుని టైమ్ కేటాయించి, అదే పనిగా విమర్శిస్తున్నారంటే మనం ఎదిగినట్లే కదా (నవ్వుతూ). మా స్టాఫ్‌లో ఒకరు.. 'చూడండి సార్.. మీ గురించి ఇలా అనుకుంటున్నారు' అంటే, 'మంచిదే కదా.. మనం ఎదిగినట్లు అర్థం' అన్నాను. ఏమీ లేకుండా మిగిలిపోయినవాళ్లను ఎవరూ పట్టించుకోరు. సో.. మనల్ని పట్టించుకున్నారంటేనే మనం సాధిస్తున్నాం అని అర్థం.

మరి.. 'మెగా ఫ్యాన్స్', 'అల్లు అర్జున్ ఆర్మీ' అంటూ ఫ్యాన్ వార్ జరుగుతుంటుంది కదా.. ఆ వార్‌ని కూడా పట్టించుకుంటారా?

నేను ఏదైనా ఒకటి పట్టించుకోనంటే ఆ ఫ్యాన్ వార్‌ని మాత్రమే. నేనస్సలు పట్టించుకోను. ఎందుకు పట్టించుకునేంత టైమ్ లేదు. ఫ్యాన్స్ పని ఫ్యాన్స్ చూసుకుంటారు. నా పని నేను చూసుకుంటాను.

వసూళ్లు, అవార్డుల గురించి పట్టించుకుంటారా..?

వీటి గురించి అయితే పక్కాగా ఆలోచిస్తాను. వేరే వాటి గురించి ఆలోచించను. నా ఫోకస్ అంతా వాటిపైనే ఉంటుంది. మిగతావారి గురించి నాకు తెలియదు కానీ నాకు మాత్రం అన్నీ కావాలి. అవార్డులు కావాలి... కలెక్షన్స్ కావాలి. ప్రజల్లో పేరు, నా సినిమా నిర్మాతలకు డబ్బులు రావాలి. జనాలకు పిచ్చెక్కిపోయే సినిమాలు ఇవ్వాలి.. ఇలా నాకు అన్నీ కావాలి. ఆ క్లారిటీ నాకు ఉంది. నాది అత్యాశ.. నాకు అన్నీ కావాలి. అందుకే తగ్గేదే లే అంటూ హార్డ్ వర్క్ చేస్తాను. ఆగేదే లే అంటూ సినిమాలు చేసుకుంటూ వెళతాను..

'పుష్ప 2' తర్వాత మీ ప్రాజెక్ట్?

ప్రస్తుతం 'పుష్ప 2' కోసం దేశవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. వాళ్లకు న్యాయం చేయాలనే ఆలోచనే ప్రజెంట్ నా మైండ్‌లో ఉంది. 'పుష్ప 2' తర్వాత నా తర్వాతి సినిమాపై మరింత క్లారిటీ ఇస్తాను.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

• తెలంగాణ

బీఆర్‌ఎస్, బీజేపీలను ఇంటికి పంపాల్సిందే!

- ఆ రెండు పార్టీలూ ఒకటే..
- చేవెళ్ల ప్రజాగర్జన సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణలోని బీఆర్‌ఎస్, దేశంలోని బీజేపీ రెండు ఒక్కటేనని, ఆ రెండు పార్టీలను ఇంటికి పంపించాల్సిన సమయం ఆసన్నమైందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల పోరాటాల ఫలితంగానే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, అందులో కేసీఆర్ చేసిందేమీ లేదని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే టీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని చెప్పి.. తీరా ఫొటో తీసుకుని బయటికి వచ్చాక మాట మార్చారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో దేశంలో, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని.. తాము ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి తీరుతామని చెప్పారు. శనివారం చేవెళ్లలో కాంగ్రెస్ నిర్వహించిన ప్రజాగర్జన సభలో ఖర్గే ప్రసంగించారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 4 వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారని.. తాజాగా చైనా సరిహద్దుల్లోనూ బైక్‌పై పర్యటించారని ఖర్గే చెప్పారు. అలాంటి నేతపై బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా, నియంతలా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. దేశంలో మహిళలు, గిరిజనులు, ఆదివాసులకు రక్షణ లేకుండా పోయిందని, అనేక మంది పేద విద్యార్థులు కనీస తిండికి నోచుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. నాగార్జునసాగర్ వంటి భారీ బహుళార్థక ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వమే కట్టించిందని.. బ్యాంకులను జాతీయాకరణ చేసిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు అనేక ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పితే.. నేటి మోదీ ప్రభుత్వం లాభాల్లో ఉన్న ఆ సంస్థలను నష్టాల్లోకి నెట్టేసి, వాటి ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ బయటికి మోదీని తిడుతూ, లోలోపల మంతనాలు జరుపుతున్నారని ఖర్గే విమర్శించారు.

12 హామీలతో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్

చేవెళ్ల ప్రజాగర్జన సభ వేదికగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. మొత్తం 12 అంశాలతో కూడిన ఈ డిక్లరేషన్‌ను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే సమక్షంలో టీపీసీసీ నేతలు ప్రకటించారు.

సచివాలయాల్లోనూ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందే వీలు

- పరీక్షల ఫీజు కూడా చెల్లించే అవకాశం
- బడికి వెళ్లి చదవలేనివారికి మరింత వెసులుబాటు
- వచ్చే వారం నుంచి ఈ సేవలు అందుబాటులోకి..
- వయోజనుల్లో విద్య పట్ల ఆసక్తి పెంచేలా ప్రభుత్వం చర్యలు



సాక్షి, అమరావతి: చదువు పట్ల ఆసక్తి ఉండి.. బడికి వెళ్లి చదువుకోలేనివారి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌ల్లో చేరే అవకాశాన్ని అందిస్తోంది. అలాగే పరీక్ష ఫీజులను కూడా వీటిలోనే చెల్లించే ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే వారం నుంచే ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇక నుంచి ఎవరైనా.. ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు తమ పేర్లు నమోదు చేసుకోవడంతోపాటు వాటికి సంబంధించిన పరీక్ష ఫీజు చెల్లింపులు వంటి సేవలను తమ దగ్గరలో ఉండే గ్రామ, వార్డు సచివాలయాల్లోనే పొందొచ్చు. ఈ మేరకు గ్రామ వార్డు సచివాలయాల శాఖ, ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ)ల మధ్య ఇప్పటికే అవగాహన కుదిరింది. ఈ సేవల టెస్టింగ్ ప్రక్రియ కూడా పూర్తయిందని.. వచ్చే వారంలో రాష్ట్రంలో అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ సేవలు అధికారికంగా మొదలవుతాయని అధికారులు వెల్లడించారు.

తప్పనున్న ఇబ్బందులు..

కాగా, ఓపెన్ స్కూల్ ద్వారా ప్రవేశాలు పొందాలంటే ఇప్పటివరకు అధికారిక వెబ్‌సైట్ మాత్రమే అందుబాటులో ఉంది. సొంతంగా ఇంటర్‌నెట్‌తో కూడిన కంప్యూటర్, వెబ్ వినియోగంలో అవగాహన ఉన్నవారు ఇంట్లో నుంచే ప్రవేశాలు పొందేవారు. నెట్ సదుపాయం, అవగాహన లేకపోతే తమ ప్రాంతంలో లేదంటే, సమీప పట్టణంలో నెట్ సెంటర్లకు వెళ్లాల్సి వస్తోంది. ఇప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ సేవలు ప్రవేశపెడుతుండటంతో ఈ ఇబ్బందులు తప్పనున్నాయి. మరోవైపు.. 14 ఏళ్ల లోపు బడి ఈడు పిల్లలు ఎవరైనా పాఠశాలలకు వెళ్లని పరిస్థితి ఉంటే.. అలాంటి వారందరినీ ఆయా ప్రాంత గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం గుర్తిస్తోంది. వారందరినీ వంద శాతం బడుల్లో చేర్పించేలా ఇప్పటికే చర్యలు చేపట్టింది. అలాగే వివిధ కారణాలతో బడి వయసు ఉన్నవారు, బడులకు వెళ్లలేని వారితోపాటు 17 ఏళ్లు దాటిన వయోజనులు ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్ చదువుకునే అవకాశాన్ని సచివాలయాల ద్వారా అందిస్తోంది.

ఏటా నవంబర్ నెలాఖరు దాకా అడ్మిషన్లు..

ఓపెన్ స్కూల్ విధానంలో పది, ఇంటర్ ప్రవేశాల ప్రక్రియ ఏటా నవంబరు నెలాఖరు వరకు కొనసాగుతోందని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి ‘సాక్షి’కి తెలిపారు. ప్రవేశాలకు పేర్ల నమోదు సెప్టెంబర్ 15 నుంచి నవంబర్ నెలాఖరు వరకు ఎక్కువగా చేసుకుంటారని వెల్లడించారు. ఓపెన్ స్కూల్ విధానంలో పది, ఇంటర్ చదివే వారి కోసం ఈ ఏడాది నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో ఆయా తరగతుల ఆన్‌లైన్ పాఠాల బోధన వీడియోలను ఉంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సార్వత్రిక విద్య అంటే.. మన దేశంలో కనీసం ఇంటర్‌గా గుర్తించిన నేపథ్యంలో ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ఎంత మంది ఇంటర్‌లోపు చదువుకున్న వారు ఉన్నారో తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఇంటర్‌లోపు చదివిన వారందరినీ ఓపెన్ స్కూల్ ద్వారానైనా చదువుకునేలా ప్రోత్సహించడానికి అవకాశం ఉంటుందన్నారు.

• తెలంగాణ

గ్రామీణాభివృద్ధితోనే దేశ ప్రగతి

- ‘నిలువెత్తు నిజాయితీ’ పుస్తకావిష్కరణలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు
- హాజరైన జస్టిస్ ఎన్వీ రమణ

బంజారాహిల్స్ (హైదరాబాద్): గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం మరింత వేగంగా ముందుకు వెళ్తున్నట్లు భావించాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ పూర్వ చీఫ్ ఇంజనీర్ గూడపాటి సీతారామస్వామి జీవిత చరిత్రపై రచయిత పాలకోడేటి సత్యనారాయణరావు రచించిన ‘నిలువెత్తు నిజాయితీ’ పుస్తకాన్ని ఆయన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ, సీతారామస్వామి కర్తవ్య దీక్ష, పల్లెలపై ప్రేమ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో వారు నెలకొల్పిన ప్రమాణాలు ఆదర్శనీయమని ప్రశంసించారు. నేటి యువతకు, రేపటి తరానికి సీతారామస్వామి అనుభవాలు అందించేందుకు, స్ఫూర్తి కలిగించేందుకు ఈ పుస్తకం తీసుకురావడం అభినందనీయమని అన్నారు. కాగా, మాతృభాషలో మాట్లాడితే తక్కువగా చూస్తారు అనే తప్పుడు భావన చాలా మందికి ఉందని, భారత అత్యున్నత న్యాయమూర్తిగా పనిచేసినప్పటికి ఎన్వీ రమణ మాతృభాషలో ఈ సభా వేదికపై మాట్లాడటం సంతోషాన్ని కలిగించింది అన్నారు.

నదుల అనుసంధానానికి ట్రిబ్యునళ్ల అవార్డులే అడ్డంకి!

- కృష్ణాకు మళ్లించే గోదావరి జలాలకుగానూ..
- ఎగువ రాష్ట్రాలకు వాటా ఇచ్చిన గోదావరి ట్రిబ్యునల్
- కృష్ణా, కావేరి ట్రిబ్యునళ్లదీ అదే మాట
- ఏకాభిప్రాయం లేకపోవడంతో ప్రతిపాదన దశ దాటని అనుసంధానాలెన్నో..
- కేంద్రానికి జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ నివేదిక

సాక్షి, అమరావతి: కడలిపాలవుతోన్న నదీ జలాలను.. నీటి కొరత ఉన్న నదులకు మళ్లించడం ద్వారా దేశంలో కరవు పరిస్థితులను రూపుమాపవచ్చుననే లక్ష్యంతో చేపట్టిన నదుల అనుసంధానానికి నదీ జల వివాదాల ట్రిబ్యునళ్ల అవార్డులే ప్రతిబంధకంగా మారాయని కేంద్రానికి జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ(ఎన్‌డబ్ల్యూడీఏ) నివేదించింది. ట్రిబ్యునళ్ల అవార్డులను చూపి.. నదీ పరీవాహక ప్రాంతాల(బేసిన్)లోని రాష్ట్రాలు వాటా కోసం పట్టుబడుతున్నాయని పేర్కొంది. నదుల అనుసంధానానికి వాటి బేసిన్‌ల పరిధిలోని రాష్ట్రాలతో పలుమార్లు సంప్రదింపులు జరిపినా ఏకాభిప్రాయాన్ని సాధించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసింది. దాంతో కెన్-బెట్వా మినహా మిగతా అనుసంధానాలు ప్రతిపాదన దశను దాటడం లేదని వివరించింది. ఈ అంశంలో విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని కోరుతూ కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్‌కు ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్ సింగ్ ఇటీవల నివేదిక ఇచ్చారు. దేశంలో హిమాలయ నదుల అనుసంధానానికి 14.. ద్వీపకల్ప నదులను అనుసంధానం చేయడానికి 16 లింక్‌లను ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. నదుల అనుసంధానాన్ని వేగవంతం చేయడానికి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి అధ్యక్షతన అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, కార్యదర్శులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. నదుల అనుసంధానంపై బేసిన్‌ల పరిధిలోని రాష్ట్రాలను ఒప్పించేందుకు సంప్రదింపులు జరుపుతోంది. కాగా, పోలవరం కుడి కాలువ ద్వారా కృష్ణా డెల్టాకు మళ్లించే 80 టీఎంసీల గోదావరి జలాలకుగానూ.. కృష్ణా జలాల్లో మహారాష్ట్ర 14, కర్ణాటక 21 టీఎంసీలను అదనంగా వాడుకోవడానికి గోదావరి ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. మిగతా 45 టీఎంసీలను నాగార్జునసాగర్‌కు ఎగువన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలను అదనంగా వాడుకోవడానికి అనుమతి ఇచ్చింది. కావేరి, కృష్ణా జల వివాదాల పరిష్కారానికి ఏర్పాటైన ట్రిబ్యునళ్లు కూడా ఇదే రీతిలో నిర్ణయాలను ప్రకటించాయి. ఇప్పుడు ఆ ట్రిబ్యునళ్ల అవార్డులను చూపుతున్న రాష్ట్రాలు.. నదుల అనుసంధానం ద్వారా మళ్లించే నీటిలో అదనపు వాటా కోసం పట్టుబడుతున్నాయి. గోదావరి-కావేరి అనుసంధానం తొలి దశలో 141 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా(నాగార్జున సాగర్), పెన్నా(సోమశిల) మీదుగా కావేరికి తరలించేందుకు ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదన అమలు చేస్తే.. కృష్ణా జలాల్లో అదనపు వాటా కావాలంటూ మహారాష్ట్ర, కర్ణాటకలు పట్టుబడుతున్నాయి. కావేరికి మళ్లించే గోదావరి జలాలకుగానూ కావేరి జలాల్లో అదనపు వాటా ఇవ్వాలంటూ కర్ణాటక, కేరళ డిమాండ్ చేస్తున్నాయి. దాంతో ఈ అనుసంధానంపై ఏకాభిప్రాయం సవాల్‌గా మారింది.

విధానపరమైన నిర్ణయం తీసుకుంటేనే..:

నీటి లభ్యత అధికంగా ఉన్న నదుల నుంచి నీటి కొరత తీవ్రంగా ఉన్న నదులకు మళ్లించే నీటి విషయంలో రాష్ట్రాలతో సంప్రదించి, కేంద్రం విధానపరమైన నిర్ణయం తీసుకుంటేనే నదుల అనుసంధానం పట్టాలెక్కే అవకాశం ఉందని ఎన్‌డబ్ల్యూడీఏ ఏనే స్పష్టం చేస్తోంది. ఒక నది నుంచి మళ్లించిన నీటికిగానూ.. మరొక నదిలో అదనపు వాటా వాడుకోవడానికి ట్రిబ్యునళ్లు ఇచ్చిన అనుమతిని నదుల అనుసంధానానికి మినహాయిస్తేనే నదుల అనుసంధానం సాకారమవుతుందని సాగునీటిరంగ నిపుణులు తేల్చిచెబుతున్నారు.

క్లుప్తంగా...

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటిచెబుదాం..

- రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



పాత గుంటూరు : తెలుగు భాషా ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటి చెప్పాలని రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ తెలుగుజాతిని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తెలుగు భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి 160వ జయంతిని పురస్కరించుకుని శనివారం అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ, జిల్లా పరిపాలన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా వికాస వారోత్సవం నిర్వహించారు. విజయబాబు, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొని గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు.

రూ.6.4 కోట్ల విలువైన బంగారం పట్టివేత

- నిందితుడు అరెస్ట్

సాక్షి, అమరావతి: దుబాయ్, శ్రీలంక నుంచి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.6.4 కోట్ల విలువైన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు విజయవాడ కస్టమ్స్ కమిషనరేట్(ప్రివెన్షన్) ప్రిన్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరామ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున బొల్లపల్లి టోల్‌ప్లాజా వద్ద కస్టమ్స్ అధికారులు చెన్నై నుంచి విజయవాడకు వెళ్తున్న కారును సోదా చేశారు. ఆ కారులో బంగారం స్మగ్లింగ్ చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని.. అతని నుంచి దాదాపు 4.3 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడికి సంబంధించిన ప్రాంతాల్లో కస్టమ్స్ అధికారులు సోదాలు నిర్వహించి.. రూ.1.5 లక్షల విలువైన విదేశీ కరెన్సీతో పాటు 6.8 కిలోల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

పోలీస్ కస్టడీకి ఆడిటర్ శ్రీనాథ్

మదనపల్లె : కోట్లాది రూపాయల ట్రెజరీ కుంభకోణంలో ప్రధాన నిందితుడు ఆడిటర్ శ్రీనాథ్ నాలుగురోజుల క్రితం కోర్టులో లొంగిపోయారు. శనివారం మదనపల్లె సబ్‌జైలులో ఉన్న శ్రీనాథ్‌ను విచారణ నిమిత్తం మూడు రోజులు పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. కాగా, ట్రెజరీ కుంభకోణంలో పలువురు నకిలీ టీడీఎస్ క్లెయిమ్‌లతో ఆదాయపన్నుకు సంబంధించి రూ.37.62 కోట్లు ఫైల్ చేసి అందులో నుంచి రూ.13.21 కోట్లను రీఫండ్ రూపంలో ఇతరుల ఖాతాలకు మళ్లించి కాజేశారు. ఈ కుంభకోణంలో ఇప్పటికే నలుగురు ఉద్యోగులు కె.శ్రీనివాసులు, బాలమురళి, షేక్ ఇంతియాజ్, జీవానందం రిమాండ్‌లో ఉన్నారు.

నలుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- మరో ముగ్గురు పరారీ

చింతపల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఒడిశా నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న 901 కిలోల గంజాయిని పట్టుకుని నలుగురు నిందితులను శనివారం అరెస్ట్ చేశామని, మరో ముగ్గురు పరారీలో ఉన్నారని చింతపల్లి అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు. గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్‌కు అందిన ముందస్తు సమాచారం మేరకు.. ధారకొండ మాయాబజార్ జంక్షన్ వద్ద శుక్రవారం సీలేరు ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. వ్యాన్‌లో 35 బస్తాల్లో 901 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దబ్బకోటకు చెందిన కర్రి అప్పన్న, ములశాలవీధికి చెందిన శెట్టి రాంబాబు, చిన్నబ్బాయి, చిలకల మామిడికి చెందిన కొర్రా నారాయణను అరెస్టు చేశారు. అదే సమయంలో మరో ముగ్గురు పరారయ్యారని, వారిపైనా కేసు నమోదు చేశామని ఎస్పీ వెల్లడించారు.

బస్సు, లారీ ఢీ

- 24 మందికి గాయాలు



కొయ్యలగూడెంలో క్షతగాత్రులకు చికిత్స

కొయ్యలగూడెం : ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో 24 మందికి గాయాలు కాగా, వారిలో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోనసీమ జిల్లా వాడపల్లి పుణ్యక్షేత్రానికి శనివారం తెల్లవారుజామున బయలు దేరింది. కొయ్యలగూడెం – బయ్యన్నగూడెం గ్రామాల మధ్య ఉన్న పులివాగు వంతెన పైకి వచ్చేసరికి బస్సు డ్రైవర్ ఎదురుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి.. ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టాడు. దీంతో బస్సులో ఉన్న 51 మంది ప్రయాణికుల్లో 24 మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను కొయ్యలగూడెం పీహెచ్‌సీకి తరలించారు. వారిలో 8 మంది తీవ్ర గాయాలకు గురవడంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.



హిందుస్థాన్ షిప్‌యార్డ్

దేశ భద్రతకు 'పంచ' కవచాలు

ఐదు ఫ్లీట్ సపోర్ట్ షిప్స్‌ను నిర్మించనున్న హిందుస్థాన్ షిప్‌యార్డ్

- రూ.19,048 కోట్లతో షిప్‌యార్డ్‌తో భారత నౌకాదళం ఒప్పందం
- యుద్ధ విన్యాసాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించేలా షిప్ డిజైన్లు
- రక్షణ వ్యవస్థలోనే కాకుండా.. విపత్తు నిర్వహణకు వినియోగించేలా తయారీ
- 44 వేల టన్నుల షిప్‌లను నిర్మించడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి
- షిప్ బిల్డింగ్ హబ్‌గా విశాఖ
- ఎనిమిదేళ్ల వ్యవధిలో లక్షల మందికి ఉపాధి అవకాశాలు
- 2027 ఆగస్టు నెలలో తొలి యుద్ధ నౌకని అప్పగించనున్న షిప్‌యార్డ్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఇప్పటి వరకు షిప్ రిపేర్ హబ్‌గా మాత్రమే కొనసాగుతున్న విశాఖపట్నం హిందుస్థాన్ షిప్‌యార్డ్.. త్వరలోనే షిప్ బిల్డింగ్ హబ్‌గా అత్యుత్తమ సేవలందించేందుకు అడుగులు ముందుకు వేస్తున్నది. దేశీయ నౌకల తయారీపై దృష్టి సారించిన షిప్‌యార్డ్ అందుకోసం భారత నౌకాదళంతో కీలక ఒప్పందాలపై సంతకం చేసింది. ఈ క్రమంలో రూ.19,048 కోట్లతో 5 భారీ యుద్ధ నౌకల నిర్మాణ పనుల్ని దక్కించుకుంది. దేశ చరిత్రలో ఏ షిప్‌యార్డ్ నిర్మించని విధంగా ఏకంగా 44 వేల టన్నుల షిప్స్‌ని నిర్మించనున్న హెచ్ఎస్ఎల్... 2027 ఆగస్టులో తొలి యుద్ధనౌకని ఇండియన్ నేవీకి అప్పగించనుంది. యుద్ధ విన్యాసాల్లో వ్యూహాత్మకంగా వ్యవహరించేలా షిప్ డిజైన్లతో పాటు.. రక్షణ వ్యవస్థలోనే కాకుండా.. విపత్తు నిర్వహణకు వినియోగించేలా షిప్‌లను తయారు చేయనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. సింధుకీర్తి సబ్‌మెరైన్ మరమ్మతుల విషయంలో హిందుస్థాన్ షిప్‌యార్డ్ అపవాదు మూటకట్టుకుని.. తొమ్మిదేళ్లకు పూర్తి చేయడంతో షిప్‌యార్డ్ పనైపోయిందని అంతా అనుకున్నారు. అయితే, ఐఎన్ఎస్ సింధువీర్ మరమ్మతుల్ని అతి తక్కువ సమయంలోనే పూర్తి చేసి ఆ మరకని తుడిచేసుకున్న షిప్‌యార్డ్.. అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు. ఎలాంటి నౌకలు, సబ్‌మెరైన్ల మరమ్మతులైనా రికార్డు సమయంలో పూర్తి చేస్తూ.. ఆయా సంస్థలకు అప్పగిస్తున్న హెచ్ఎస్ఎల్.. ఇప్పుడు ప్రధాన నౌకా నిర్మాణ కేంద్రంగా దూసుకుపోతోంది. ఐదేళ్ల కాలంలో ఏకంగా 14 ప్రాజెక్టుల్ని పూర్తి చేసి ఆర్డర్ల పెండెన్సీ గణనీయంగా తగ్గించుకుంది. 40 నౌకల రీఫిట్ పనుల్ని ఐదేళ్ల కాలంలో పూర్తి చేసి ఔరా అనిపించుకుంది. మొత్తంగా హిందుస్థాన్ షిప్‌యార్డ్ పనితీరుతో విశాఖ.. షిప్ బిల్డింగ్ కేంద్రంగా మారుతోంది.

రూ.19 వేల కోట్లు.. 5 ఫ్లీట్ సపోర్ట్ షిప్స్..

2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.1,038 కోట్ల టర్నోవర్ సాధించిన షిప్‌యార్డ్.. ఈ ఏడాది ఏకంగా రూ.19,048 కోట్ల పనులకు సంబంధించిన కాంట్రాక్టుపై సంతకం చేసింది. ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకల తయారీకి సన్నద్ధమవుతోంది. ఐదు ఫ్లీట్ సపోర్ట్ షిప్స్ (ఎఫ్ఎస్ఎస్)ను భారత నౌకాదళం, కోస్ట్‌గార్డు కోసం తయారు చేసేందుకు శుక్రవారం భారత రక్షణ మంత్రిత్వ శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. హైవాల్యూస్‌తో ఈ నౌకల నిర్మాణాలు చేపట్టనుంది. దేశంలోని ఏ షిప్‌యార్డ్‌లోనూ లేనివిధంగా ఏకంగా 44 మిలియన్ టన్నుల డిస్‌ప్లేస్‌మెంట్ సామర్థ్యమున్న నౌకల్ని తయారు చేయనుంది. ఈ నౌకల నిర్మాణాలతో 2023–24 నుంచి హెచ్ఎస్ఎల్ వార్షిక టర్నోవర్ గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం రూ.1,038 కోట్ల వార్షిక టర్నోవర్ ఉన్న షిప్‌యార్డ్.. వచ్చే ఐదేళ్లలో రూ.1,500 నుంచి 2 వేల కోట్ల రూపాయలకు చేరుకోనుంది. 8 సంవత్సరాల కాల పరిమితితో ఈ షిప్స్‌ని తయారు చేయనుంది. తొలి షిప్‌ని 2027 ఆగస్టు 24న భారత నౌకాదళానికి అప్పగించేలా ఒప్పందం కుదుర్చుకుంది.

మూడేళ్లలో మరింత అభివృద్ధి..

పెరుగుతున్న ఒప్పందాలకు అనుగుణంగా.. షిప్‌యార్డ్‌ను ఆధునికీకరించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. రూ.1,000 కోట్లతో యార్డుని రానున్న మూడేళ్లలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రస్తుతం స్లిప్‌వేలు 190 మీటర్లుండగా వీటిని 230 మీటర్లకు పెంచనున్నారు. ఆర్డర్లు పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగుల సంఖ్య కూడా పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదేవిధంగా మరమ్మతులు, నౌకా నిర్మాణాలకు అనుగుణంగా రూ.5 వేల కోట్లతో మెటీరియల్ కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అవసరమైన 364 వెండార్ బేస్డ్ ఎంఎస్ఎంఈల సహకారం తీసుకుంటున్నారు.

లక్షల మందికి ఉపాధి



టెండర్లు దక్కించుకోవడంలో దూకుడు పెంచాం. తాజాగా 50 టన్స్ బొలార్డ్ పుల్ టగ్ బాల్‌రాజ్ మరమ్మతులు పూర్తి చేసి నేవల్ డాక్‌యార్డు (విశాఖపట్నం)కు అందించాం. అందుకే.. ఆర్డర్లు కూడా పెద్ద ఎత్తున సొంతం చేసుకుంటున్నాం. రక్షణ మంత్రిత్వ శాఖతో కుదుర్చుకున్న ఒప్పందం.. షిప్‌యార్డ్ భవిష్యత్తుని మార్చబోతోంది. ఈ ఎంవోయూ ద్వారా లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. విశాఖ భవిష్యత్తు కూడా మారబోతుంది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా.. మేక్ ఇన్ ఇండియాని చాటిచెప్పేలా షిప్స్ తయారు చేస్తాం. దేశీయ నౌకల నిర్మాణంతో పాటు అంతర్జాతీయ వాణిజ్య వ్యవహారాలపైనా దృష్టి సారించాం. సబ్‌మెరైన్ల నిర్మాణం, రీఫిట్‌కు సంబంధించిన సామర్థ్యం, మౌలిక సదుపాయాల కల్పనతో మరింత ఆధునికీకరించుకునేందుకు రష్యాతోనూ సమగ్ర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం.

– కమొడోర్ హేమంత్ ఖత్రి, హిందుస్థాన్ షిప్‌యార్డు సీఎండీ

పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్‌లో జరుగుతున్న ట్రాఫిక్ బ్లాక్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు పలు రైళ్లను పూర్తిగాను, పాక్షికంగాను రద్దు చేయడంతో పాటు మరి కొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం ప్రకటించారు.

రద్దయిన రైళ్లు ఇవే..
ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ మూడో తేదీ వరకు విజయవాడ-బిట్రగుంట (07978/07977) రైళ్లు, ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు బిట్రగుంట-చెన్నై సెంట్రల్ (17237/17238)రైళ్లు, ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ మూడు వరకు రాజమండ్రి-విశాఖపట్నం (07466/07467) రైళ్లు, కాకినాడ పోర్టు-విశాఖపట్నం (17267/17268) రైళ్లు, విజయవాడ-గూడూరు (07500) రైలు, ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ నాలుగు వరకు గుంటూరు-విశాఖపట్నం (17239/17240) రైళ్లు, ఈ నెల 28, 29, 30, సెప్టెంబర్ మూడు తేదీల్లో విజయవాడ-విశాఖపట్నం (22702/22701) రైళ్లు, ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ నాలుగో తేదీ వరకు గూడూరు-విజయవాడ (07458) రైలును రద్దు చేశారు.

పాక్షికంగా రద్దు..
ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ మూడో తేదీ వరకు నర్సాపూర్-గుంటూరు (17282/17281), విజయవాడ-గుంటూరు మధ్య పాక్షికంగా రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు..
ఈ నెల 29, సెప్టెంబర్ 1, 2, 5, 8, 9 తేదీల్లో దనాబాద్-అలెప్పి (13351) రైలు, ఈ నెల 28, సెప్టెంబర్ 5 తేదీల్లో హతియ-బెంగళూరు (12835) రైలు, సెప్టెంబర్ 8, 15 తేదీల్లో హతియ-బెంగళూరు (12889) రైలు, సెప్టెంబర్ 2న హతియ-బెగళూరు (18637)ను నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా దారి మళ్లించి నడపనున్నారు.

మంత్రి తమ్ముడు అడుగుతున్నా డబ్బులివ్వవా?

- మంత్రి చెల్లుబోయిన సోదరుడినంటూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్(గన్నవరం): బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సోదరుడినంటూ బెదిరింపులు, మోసాలకు పాల్పడుతున్న ఓ ప్రబుద్ధుడిని కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సీఐ అల్లు నవీన్‌నరసింహామూర్తి, ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్‌లు మీడియాకు వివరాలు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామానికి చెందిన దొంగల శ్రీధర్ కొంతకాలంగా మంత్రి వేణుగోపాలకృష్ణ తమ్ముడినని చెప్పుకొంటున్నాడు. తన వాహనానికి ఎమ్మెల్యే స్టిక్కర్ కూడా అంటించి పలుచోట్ల మోసాలకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో హనుమాన్‌జంక్షన్‌లోని పశువుల సంతలో ఇటీవల ఉంగుటూరు మండలం తేలప్రోలుకు చెందిన పశువుల వ్యాపారి తొందూరు శామ్యూల్ పరిచయమయ్యాడు. మంత్రి తమ్ముడినని, రామచంద్రాపురం ఏరియాలో కూడా కలిసి పశువుల వ్యాపారం చేద్దామని నమ్మించాడు. చేబదులుగా రూ.10 వేలు తీసుకున్నాడు. ఆ నగదు ఎంతకీ చెల్లించకపోవటంతో పాటుగా తరచూ మరింత డబ్బు ఇవ్వాలని అడుగుతుండటంతో శామ్యూల్‌కు అనుమానం వచ్చింది. ఈ నెల 25న నూజివీడు వెళుతున్న శామ్యూల్‌ను వేలేరు వద్ద అడ్డగించి 'మినిస్టర్ తమ్ముడు అడిగినా.. డబ్బులివ్వవా.. నీ అంతు చూస్తా' అంటూ శ్రీధర్ బెదిరించాడు. దీంతో శామ్యూల్ పోలీసులనాశ్రయించాడు. ఎస్ఐ జనార్దన్ కేసు నమోదు చేసి, నిందితుడి కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు చేపట్టడంతో ఇంకా బాగోతాలు వెలుగులోకొచ్చాయి. దొంగల శ్రీధర్ గతంలోనూ పలుమార్లు ఎమ్మెల్యే స్టిక్కర్‌తో కారులో తిరుగుతూ మంత్రి పేరు చెప్పి బెదిరింపులకు, మోసాలకు పాల్పడ్డాడని గుర్తించారు. ప్రత్తిపాడు, ద్రాక్షారామం, గొల్లపాలెం, రాజానగరం, అన్నవరం, ఆలుమూరు పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయని, కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో రౌడీ షీట్ కూడా ఉందని గుర్తించారు. నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి నూజివీడు కోర్టులో హాజరుపరిచారు.

సర్వేలపై ఎల్లో మీడియా సొంత కథనాలు

పచ్చ పార్టీ గెలుస్తుందని చెబితే అది ఒరిజినల్ సర్వే.. లేకపోతే ఫేక్ సర్వేనా?

- వచ్చే ఎన్నికల్లో గెలుస్తామనే ధీమా టీడీపీలో ఒక్కరికీ లేదు
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ధ్వజం



సాక్షి, అమరావతి: ఏ జాతీయ సంస్థ సర్వే వచ్చినా అది ఫేక్, పెయిడ్ అంటూ ఎల్లో మీడియా సొంత కథనాలు వండి వారుస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఒక ప్రకటన విడుదల చేశారు. ఇండియా టుడే ఇంగ్లిష్ న్యూస్ చానల్... సీ ఓటర్‌తో కలిసి చేసిన సర్వే మాత్రమే అసలు సిసలు అంటూ ఎల్లో మీడియా ఊదరగొడుతోందన్నారు. పచ్చ పార్టీ గెలుస్తుందని చెబితే ఒరిజినల్, లేకపోతే ఆ సర్వే ఫేకా అని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో గ్యారెంటీగా గెలుస్తామనే ధీమా టీడీపీలో ఏ ఒక్కరికీ లేదన్నారు. రాజకీయాల్లో విజేతలు, హుందాగా ఉండే వారి మాటలకే సమాజంలో గౌరవం ఉంటుందని తెలిపారు. పరాజితులు, ఒకప్పటి రౌడీషీటర్లు, చిల్లర నేరగాళ్లు హెచ్చరికలు జారీ చేస్తే వీధి కుక్కలు కూడా భయపడవని చెప్పారు. నలుగురి దృష్టిని ఆకర్షించే ఘటన ఎక్కడ జరిగినా దాన్ని చంద్రబాబు తనకు ఆపాదించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అల్లు అర్జున్‌కు జాతీయ అవార్డు రావడానికి కూడా తానే స్ఫూర్తి అని అన్నా అంటారన్నారు. ''నా హయాంలోనే ఎర్రచందనం స్మగ్లింగ్ కొత్త పుంతలు తొక్కింది.. ఎందరో పుష్పరాజ్‌లను నేను తయారు చేశా.. పుష్ప పార్ట్ 2 కూడా వస్తోంది తమ్ముళ్లూ'' అని బాబు అంటారేమో అని ఎద్దేవా చేశారు. పల్నాడు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు తాము సమీక్ష నిర్వహిస్తే 'ఈనాడు'లో తప్పుడు కథనాలు రాశారని మండిపడ్డారు. జర్నలిజం విలువలను పూర్తిగా వదిలేసిన ఈనాడు అభూత కల్పనలు రాస్తూ నానాటికీ దిగజారుతోందన్నారు. కాగా ఇంటర్నేషనల్ కాంపిటెన్స్ ఫర్ ఆర్గానిక్ అగ్రికల్చర్ ప్రకటించిన జైవిక్ ఇండియా అవార్డుకు ఎంపికైన గనిమిశెట్టి పద్మజకు విజయసాయిరెడ్డి అభినందనలు తెలిపారు. మన రాష్ట్రానికి మూడు అవార్డులు దక్కడం ప్రశంసనీయమన్నారు.

సాంకేతికతను జోడిస్తే సత్వర న్యాయం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్
- కర్నూలులో ఏర్పాటు చేసిన ఏపీ వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్‌ను ప్రారంభించిన జడ్జి



వేదికపై హైకోర్టు న్యాయమూర్తులు, కలెక్టర్

కర్నూలు (లీగల్): సాంకేతికతను జోడిస్తే సత్వర న్యాయం సాధ్యమని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో ప్రజలకు సత్వర న్యాయం అందించేలా వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ పనిచేయాలని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి, కర్నూలు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ అన్నారు. శనివారం కర్నూలులో ఏర్పాటు చేసిన ఏపీ వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్‌ను జస్టిస్ కృష్ణమోహన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే కర్నూలులో లోకాయుక్త, హ్యూమన్ రైట్స్ కమిషన్, ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ వంటి సంస్థలు ఏర్పాటయ్యాయని, తాజాగా వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ కూడా చేరిందని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన జరిగిన తొమ్మిదేళ్ల తర్వాత రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ కోర్టు ఏర్పాటు కావడం గొప్ప విషయమన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ బాగా పెరిగిందని, న్యాయవాదులు దీనిని బాగా వినియోగించుకోవాలన్నారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్‌కు జి.భూపాల్‌రెడ్డి చైర్మన్‌గా, ట్రిబ్యునల్ మెంబర్లుగా నాగేశ్వరరావు, అబ్దుల్ మజీద్ వ్యవహరిస్తారన్నారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన వివాదాలు, ప్రశ్నలు, ఇతర విషయాలపై వక్ఫ్ ఆస్తుల నిర్ధారణ హక్కులు, ప్రయోజనాలను సమర్థించేందుకు ట్రిబ్యునల్ కోర్టు పని చేస్తుందని చెప్పారు. విభజన జరిగిన నాటి నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు ట్రిబ్యునల్ కోర్టులో 213 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. మైనార్టీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్, కలెక్టర్ జి.సృజన, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఫ్యామిలీ కోర్టు జడ్జి ప్రతిభాదేవి, జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కల్యాణి పాల్గొన్నారు.

జల రవాణాపై ఏపీతో చర్చలు

4 పోర్టుల రాకతో డ్రెడ్జింగ్‌కు పుష్కలమైన అవకాశాలు

- 2021 సమ్మిట్‌లో రూ.14 వేల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నాం
- 'సాక్షి'తో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఎండీ కెప్టెన్ దివాకర్





ఏపీలో 4 పోర్టుల రాకతో అపార అవకాశాలు

ఏపీ ప్రభుత్వం పోర్టుల నిర్మాణాన్ని చురుగ్గా నిర్వహిస్తోంది. కొత్తగా రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట, కాకినాడలలో నిర్మిస్తున్న పోర్టుల ద్వారా అపారమైన అవకాశాలు కలగనున్నాయి. ఈ నాలుగు పోర్టుల్లో కనీసం 150 మిలియన్ క్యూబిక్ మీటర్ల డ్రెడ్జింగ్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే మచిలీపట్నంలో పనులు చేపడుతున్నాం. మిగిలిన పోర్టుల్లోనూ పనుల కోసం మరిన్ని డ్రెడ్జర్లను తీసుకొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో జల రవాణా మార్గాలను అభివృద్ధి చేసే అంశంపై రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ) ఎండీ కెప్టెన్ ఎస్.దివాకర్ చెప్పారు. అక్టోబర్ 17 నుంచి 19వ తేదీ వరకూ న్యూఢిల్లీలో జరిగే గ్లోబల్ మారిటైమ్ ఇండియా సమ్మిట్–2023కి అనుబంధంగా డీసీఐలో ఈ నెల 28న రోడ్ షో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాట్లను ఎండీ దివాకర్ పరిశీలించారు. డీసీఐ పురోగతికి తీసుకుంటున్న చర్యలు, సమ్మిట్‌కు సంబంధించిన విషయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

జలరవాణాపై సంప్రదింపులు

ప్రస్తుతం జీడీపీ విలువలో 80 శాతం వరకూ మారిటైమ్ ట్రేడ్ జరుగుతోంది. డ్రెడ్జింగ్ చేయకుండా ఏ పోర్టు అభివృద్ధి జరగదు. అందుకే ప్రధాని కూడా దేశీయ జలమార్గాల (ఇన్‌లాండ్ వాటర్ వేస్)పై దృష్టి సారించారు. ప్రస్తుతం 110 నదులుండగా కేవలం 4 నదుల్లో జల రవాణాకు సంబంధించి డ్రెడ్జింగ్ పనుల కోసం ఒప్పందం కుదుర్చుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో పూడికతో నిండిపోయిన డ్యామ్‌లు, రిజర్వాయర్లలోనూ డ్రెడ్జ్ చేయాల్సి ఉంది. ఇందుకోసం చిన్నచిన్న డ్రెడ్జర్లు అవసరం అవుతాయి. దీనిపైనా సమాలోచనలు చేస్తున్నాం. డ్రెడ్జ్ చేస్తే.. వాటర్ క్యాచ్‌మెంట్ ఏరియా పెరుగుతుందని ఇందుకు అవకాశం ఇవ్వాలని ఏపీ చీఫ్ సెక్రటరీకి లేఖ రాశాం. ఏపీతో పాటు కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలతోనూ సంప్రదింపులు జరిపాం. ఏ ప్రభుత్వమైనా డ్యామ్‌లు, రిజర్వాయర్ల డ్రెడ్జింగ్ పనుల్ని 8 నుంచి 10 ఏళ్ల పాటు కాంట్రాక్ట్ అప్పగిస్తే కొత్త డ్రెడ్జర్లు తీసుకుంటాం. దేశంలో డ్రెడ్జింగ్ కోసం 120 మిలియన్ క్యూబిక్ మీటర్ల వరకూ డిమాండ్ ఉంది. కానీ.. డీసీఐలో ప్రస్తుతం 59 వేల క్యూబిక్ మీటర్ల సామర్థ్యం ఉన్న10 టీఎస్‌హెచ్ డ్రెడ్జర్లు, 6 వేల క్యూబిక్ మీటర్ల సామర్థ్యం ఉన్న 2 కట్టర్ సీఎస్ డ్రెడ్జర్లు, ఒక బీహెచ్‌వో డ్రెడ్జర్ ఉన్నాయి. 12 వేల టన్నుల హోపర్ కెపాసిటీ డ్రెడ్జర్ కోసం ఆర్డర్ చేశాం. 2025 డిసెంబర్ నాటికి ఇది రానుంది.

రూ.12 వేల కోట్ల వరకూ ఎంవోయూలు

2021లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రూ.14 వేల కోట్ల విలువైన ఎంవోయూలు చేసుకున్నాం. ఈ ఏడాది రూ.12 వేల కోట్ల వరకూ వస్తాయని భావిస్తున్నాం. ఇందుకోసం 28న డీసీఐలో నిర్వహించే రోడ్‌షోలో షిప్ బిల్డర్స్, షిప్ ఆపరేటర్స్, పోర్టులు, రెగ్యులేటరీస్, కేంద్ర ప్రభుత్వంతో చర్చలు చేస్తాం.

పోలవరంపై బాబువి కాకి లెక్కలు

- ఈ ప్రభుత్వంలో జరిగిన పనులు చూసి ఆయన ఆశ్చర్యపోయారు
- గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్వహణలో రూ.3.5 కోట్లు భోంచేశారు
- అక్టోబర్‌లో కుప్పంకు కృష్ణా జలాలు
- జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి



బి.కొత్తకోట : గత టీడీపీ ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయంపై ఆ పార్టీ అధినేత చంద్రబాబు కాకి లెక్కలు చెబుతున్నారని జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) సీ నారాయణరెడ్డి విమర్శించారు. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై శనివారం ఆయన హంద్రీనీవా ప్రాజెక్టు రెండో దశ పనులపై మదనపల్లె ఎస్ఈ సీఆర్ రాజగోపాల్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ ప్రాజెక్టులపై మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

గత ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల పోలవరం ప్రాజెక్టుకు రూ.2వేల కోట్ల నష్టం వాటిల్లింది. అప్పట్లో కాంట్రాక్టర్లు లాభదాయకమైన పనులు మాత్రమే చేసి సొమ్ము చేసుకున్నారు. నిజానికి.. పోలవరం పనుల పరిశీలనకు వచ్చిన చంద్రబాబు అక్కడ ఆరు కిలోమీటర్ల మేర గోదావరి ప్రవాహాన్ని మళ్లించి చేపట్టిన పనులను చూసి ఆశ్చర్యపోవడమే కాక ఏమి మాట్లాడలేకపోయారు. అలాగే..

- కుప్పంకు అక్టోబర్‌లో శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను తరలిస్తాం. కుప్పం ఉపకాలువ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయిస్తున్నాం. ఇక్కడ రూ.535 కోట్లతో రెండు రిజర్వాయర్లు ప్రతిపాదించాం.
- అవుకు రెండో సొరంగం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇక్కడినుంచి ఒక టీఎంసీ నీటిని గండికోట ప్రాజెక్టుకు తరలిస్తాం. గత ప్రభుత్వం ఈ పనులను వదిలేసింది.
- డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లోని 68 చెరువులకు హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను తరలించి నింపుతాం. ఈ కార్యక్రమం సీఎం చేతుల మీదుగా ప్రారంభమవుతుంది.
- గుండ్లకమ్మ ప్రాజెక్టు గేటు గురించి తప్పుదోవ పట్టిస్తున్న చంద్రబాబు తన ప్రభుత్వంలో నిర్వహణకు కేవలం రూ.5 కోట్లు మంజూరు చేశారు. ఇందులో రూ.కోటిన్నర పార్కు కోసం ఖర్చుచేసి.. మిగతా రూ.3.5 కోట్లను భోంచేశారు.
- వెలిగొండ మొదటి సొరంగం పనులు పూర్తిచేశాం. రెండో సొరంగం పనులు అక్టోబర్‌లోగా పూర్తికి చర్యలు తీసుకుంటున్నాం.
- ఇక కర్ణాటక చేపట్టిన అప్పర్ తుంగభద్ర ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో కేసు వేశాం. ఆ పనులు ముందుకు సాగే పరిస్థితుల్లేవు.
- శ్రీశైలం జలాశయంలో 66 శాతం జలాలు ఏపీ వాటాకు వస్తాయి. ఇరు రాష్ట్రాల నీటి పంపకాలు జరగలేదని తెలంగాణ వాదించడం సరికాదు. దీనిపై తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాశాం.
- ఉత్తరాంధ్రకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులను రూ.2వేల కోట్ల వ్యయంతో పూర్తిచేయనున్నాం.
- రాయలసీమ ఎత్తిపోతల పథకం మొదటి దశ ఒక టీఎంసీ సామర్థ్యంతో తాగునీటి సంబంధిత పనులు ప్రారంభమయ్యాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,J-2 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No.TNTEL/2009/25943